www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
దీపావళి శుభాకాంక్షలు

గురువారం | 31-10-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 196 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి మ. 3.35 తదుపరి అమావాస్య; నక్షత్రం: చిత్త రా. 12.44 తదుపరి స్వాతి; వర్జ్యం: ఉ. 6.43-8.31; దుర్ముహూర్తం: ఉ. 10.04-10.50, మ. 2.38-3.23; అమృతఘడియలు: సా. 5.31-7.19; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.16; సూర్యాస్తమయం: 5.40 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఉచిత గ్యాస్ పండుగ



తొలిరోజే 4.3 లక్షల బుకింగ్‌లు

రేపు శ్రీకాకుళంలో లాంఛనంగా పంపిణీని ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

తొలివిడత రాయితీ సొమ్ము పెట్రోలియం సంస్థలకు అందజేసిన ముఖ్యమంత్రి

14

వేద పండితులకు నెలకు 3 వేలు



నిరుద్యోగ భృతి అందించేందుకు ప్రభుత్వం సన్నద్ధం

14

తొలి విడతలో 600 మంది గుర్తింపు

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ఆంధ్రజ్యోతి' దీపావళి శుభాకాంక్షలు



సెలవు

దీపావళి సందర్భంగా గురువారం మా కార్యాలయాలకు సెలవు. కావున 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం (1-11-2024) సంచిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.

-మేనేజింగ్ డైరెక్టర్



టీటీడీ చైర్మన్‌గా బీఆర్‌నాయుడు

23 మంది సభ్యులతో బోర్డు ఏర్పాటు

- ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలకు స్థానం
- వేమిరెడ్డి ప్రశాంతి, జంగా కృష్ణమూర్తికి మళ్లీ
- జనసేన కోటాలో ముగ్గురికి అవకాశం
- సభ్యుడిగా కళా దర్శకుడు ఆనంద్‌సాయి
- వివిధ రంగాల ప్రముఖులకూ చోటు
- బోర్డులో తొలిసారి మాజీ సీజేఐకు చాన్స్
- సభ్యుడిగా జస్టిస్ హెచ్‌ఎల్ దత్తు
- ఫార్మా నుంచి సదాశివరావు, సుచిత్ర ఎల్లా
- బోర్డులో ముగ్గురు మహిళలకు స్థానం

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) కొత్త పాలక మండలిని నియమించారు. మొత్తం 24 మందితో టీటీడీ బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మీడియా రంగానికి చెందిన బొల్లినేని రాజగోపాల నాయుడును

మిగతా 14వ పేజీలో...

స్వర్ణాంధ్ర సాధనకు 12 సూత్రాలు

'వికసిత్ భారత్'కు సమాంతరంగా 'విజన్ 2047'



నీతి ఆయోగ్ ప్రతినిధులతో సమావేశమైన సీఎం చంద్రబాబు

ఏఐ, రోబోటిక్స్ నాలెడ్జ్ సిటీలుగా అమరావతి, తిరుపతి, విశాఖ

- నీతి ఆయోగ్ బృందానికి చంద్రబాబు ప్రజెంటేషన్
- ప్రజారోగ్యమే ఫస్ట్.. సాంకేతికత, ఉపాధికి ప్రాధాన్యం
- డిమాండ్ - సప్లై ఆధారంగా నైపుణ్యాల మెరుగుదల
- ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేస్తాం
- 18 లక్షల మంది సూచనలతో 'విజన్' డాక్యుమెంట్

క్లీన్ ఎనర్జీలో 7.5 లక్షల కోట్ల పెట్టుబడులు, 10 లక్షల మందికి ఉపాధి లక్ష్యం.. పాలసీ డాక్యుమెంట్ విడుదల

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): 'స్వర్ణాంధ్ర - 2047' సాధనకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు 12 సూత్రాలను నిర్దేశించారు. ఆ లక్ష్యాలను చేరుకోవడం ద్వారా 2047 నాటికి రాష్ట్ర రూపు రేఖలు మార్చేలా ప్రణాళికను సిద్ధం చేశారు. దీనిపై బుధవారం సచివాలయంలో నీతి ఆయోగ్ ప్రతినిధులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో నీతిఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యంతో పాటు

మిగతా 14వ పేజీలో...

బ్రాండ్ ఏపీ రూపకల్పనకు మద్దతివ్వండి

టెక్నాలజీ, తయారీ రంగాల్లో సహకరించండి

ఇంద్రానూయి, సేల్స్ ఫోర్స్ ఏఐ సీఈవోతో లోకేశ్ భేటీ

అక్రమాల పత్రిక అవినీతి పుత్రిక 'సాక్షి'

పైసా పెట్టుబడి లేకుండా పత్రిక, చానల్ ఏర్పాటు

- నాడు తండ్రి సీఎంగా ఉన్నప్పుడు 'మేళ్లు' పొందినవారితో పెట్టుబడులు
- ఇష్టానుసారం షెల్ కంపెనీల ఏర్పాటు
- అవినీతి సొమ్ము విదేశాలకు పంపి అక్కడి నుంచి మళ్లీ జగన్ కంపెనీల్లోకి
- సండూర్ పవర్ నుంచి కార్మెల్ ఏషియాకు
- దాని ద్వారా జగతి, ఇందిరా టెలివిజన్‌కు
- వందల కోట్ల సంస్థలకు జగన్ అధినేత



15

మాఫియా డాన్‌లు, వేర్పాటువాదులూ ఏదో ఒక ముసుగులో మీడియాను స్థాపించి తమ 'సిద్ధాంతాల'ను జనంలోకి చొప్పించడం కుదురుతుందా? కుదరనే కుదరదు! అందుకు చట్టాలు అంగీకరించవు. అలాగే... ఈ దేశంలో చట్టాలు, వ్యవస్థలు నిక్కచ్చిగా దృష్టి పెడితే... జగన్ మీడియాకు ఎప్పుడో తాళాలు పడేవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రజాస్వామ్యపు నాలుగు స్తంభాల్లో ఒకటైన మీడియా రంగంలోకి ప్రవేశించిన అవినీతి పుత్రిక... జగన్ సాక్షి! చిరునామాలేని కంపెనీలు, ఆధారాలు లేని ఆదాయాలు, అనుమానాస్పద పెట్టుబడులతో పురుడు పోసుకుంది! జగన్ అధికారం సాధించడమే లక్ష్యంగా... అసత్యాలు చెప్పడమే పనిగా సాగుతోంది. ఈ పెట్టుబడుల బాగోతాన్ని సీబీఐ, ఈడీ ఎప్పుడో బయట పెట్టాయి.



అప్పుడు సంతకం చేసి ఇప్పుడు బెయిల్ కథలా?

రద్దుకు కుట్ర అనడం శతాబ్దపు పెద్ద జోక్

జగన్‌పై షర్మిల ఫైర్

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బెయిల్ రద్దు చేసేందుకు కుట్ర చేశామనడం ఈ శతాబ్దపు పెద్ద జోక్‌గా ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల అభివర్ణించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది సరస్వతి పవర్ షేర్లను కాదని.. రూ. 32 కోట్ల విలువ చేసే కంపెనీ స్థిరాస్తి మాత్రమేనని బుధవారం ఓ ప్రకటనలో షర్మిల వెల్లడించారు. షేర్ల బదలాయింపులో ఎలాంటి ఆంక్షలూ.. అభ్యంతరాలూ లేవన్నారు. స్టేటస్‌కో ఉన్నది షేర్ల మీద

మిగతా 15వ పేజీలో...



15

భయపెట్టారు.. బెదిరించారు!

- చుట్టుముట్టి మగ పోలీసుల వేధింపులు
- చెంపపై కొట్టి జుట్టుపట్టుకున్న ఆడ పోలీసు
- తప్పు చేయలేదని వేడుకున్నా నాడు పోలీసులు వదల్లేదు
- సీఐడీ ముందు జెత్వానీ కన్నీరుమున్నీరు
- నా ఫోన్లు, ల్యాప్‌టాప్ లాక్కున్నారు
- ఖాళీ పేపర్లపై సంతకాలకు ఒత్తిడి చేశారు
- 4 రోజులు నరకం.. 40 రోజులు జైలు
- ఐపీఎస్‌లు, ఖాకీల కర్కశత్వాన్ని వాంగ్మూలంలో వివరించిన నటి కాదంబరి

పోలవరం ఎత్తు తగ్గదు!

14



- 45.72 మీటర్ల కాంటూరులోనే నిర్మాణం: నిమ్మల
- రెండు దశలంటూ ఎత్తు 41.15 మీటర్లకు కుదించిన ఘనుడు జగనే
- నీటి నిల్వపై ఏమాత్రం రాజీపడం.. 150 అడుగుల మేర నిల్వ చేస్తాం

ఖలిస్థానీలపై దాడుల్లో అమిత్ షా హస్తం

వాషింగ్టన్ పోస్ట్‌కు నేనే వివరాలిచ్చా

కెనడా డిప్యూటీ విదేశాంగ మంత్రి

2

భారత విద్యార్థులకు ఆహారం కొరత!

ఉచిత ఆహారం నిలిపివేతపై వాంకోవర్ ఫుడ్ బ్యాంక్ నిర్ణయం

కొత్త మార్గదర్శకాలతో బెదిరింపులకు జల్లెడ.. అవన్నీ ఒట్టివని తేల్చారు!



2

ప్రయాణికులు, వైమానిక సంస్థలు, భద్రతాసిబ్బందిపై తగ్గిన భారం

జనవరి 5న గ్రూప్-2 మెయిన్స్

3



సరయూ తీరం దేదీప్యమానం

25లక్షల దీపాలతో గిన్నిస్ ప్రపంచ రికార్డు

అయోధ్య, అక్టోబరు 30: దీపావళి పండుగ సందర్భంగా బుధవారం అయోధ్యలోని సరయూ నదీ తీరంలో దీపోత్సవాన్ని అత్యంత అట్టహాసంగా నిర్వహించారు. 25 లక్షల ప్రమిదల వెలుగులతో సరయూ తీరం దేదీప్యమానమైంది. అయోధ్యలో రామమందిరం ప్రారంభమైన తర్వాత తొలి దీపావళి వేడుకలు కావడంతో నిర్వాహకులు సరయూ తీరంలో భారీగా ఏర్పాటు చేశారు. 55 ఘాట్‌లలో వెలిగించిన లక్షలాది ప్రమిదలను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు డ్రోన్లతో లెక్కించారు. మొత్తంగా 25,12,585 దీపాలను వెలిగించినట్లు వెల్లడించారు. ఇది గిన్నిస్ ప్రపంచ రికార్డు. మరోవైపు, బుధవారమే సరయూ తీరంలో 1,121 మంది వేదాచార్యులు ఒకేసారి హారతి సమర్పించారు. ఇది కూడా గిన్నిస్ ప్రపంచ రికార్డుల్లోకెక్కింది.



దీపావళి వేడుకల్లో
చిందేసిన అమెరికా రాయబారి

డిల్లీ, అక్టోబరు 30: డిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయంలో భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టీ దీపావళి వేడుకల్లో సందడి చేశారు. భారతీయ వస్త్రధారణలో వేడుకల్లో పాల్గొన్న ఆయన బాలీవుడ్ సినిమాలోని తౌబా-తౌబా పాటపై అదిరిపోయే స్టెప్పులేశారు. మిగతా కళాకారులతో కలిసి బాంగ్రా డ్యాన్స్ చేశారు. భారత్-అమెరికా బంధం కూడా దీపావళి వెలుగుల్లా వెలిగిపోవాలని ఆయన ఆకాంక్షించారు.

లోకం తీరు



పూర్తయిన బలగాల ఉపసంహరణ

» ఉద్రిక్తతలకు ముందున్న స్థానాలకు భారత్-చైనా బలగాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 30: తూర్పు లద్దాఖ్‌లోని డెప్సాంగ్, డెమ్చోక్ ప్రాంతాల నుంచి భారత్-చైనా బలగాల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిందని బుధవారం ఆర్మీ వర్గాలు తెలిపాయి. వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వెంబడి నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులకు ముంగిపు పలుకుతూ ఇరు దేశాల మధ్య ఇటీవల గస్తీ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా అక్టోబరు 29 లోగా బలగాలను ఉపసంహరించుకోవాలని ఉద్రిక్తతల ముందున్న స్థానాలకు వెళ్లిపోవాలని నిర్ణయించాయి. ఒప్పందానికి ముందు వివాదస్పద ప్రాంతంలో శాటిలైట్ చిత్రాలలో కనిపించిన బలగాల టెంట్లు, వాహనాలు తొలగించినట్లు తెలుస్తోంది.

4 నెలల్లో 1,750 కోట్లు

భారతీయుల నుంచి కాజేసిన సైబర్ నేరగాళ్లు..2024 మొదటి నాలుగు నెలల్లో 7.4 లక్షల కేసులు

» దేశంలో శరవేగంగా డిజిటలైజేషన్
» కరువైన పటిష్ట సైబర్ రక్షణ వ్యవస్థ
» సైబర్ నేరాలకు అడ్డాగా భారత్?

ముంబయి, అక్టోబరు 30: డిజిటలైజేషన్ దిశగా వేగంగా అడుగులు వేస్తున్న భారత్ సహజంగానే సైబర్ నేరగాళ్లకు అనువైన ప్రాంతంగా మారింది. 2024 సంవత్సరం తొలి నాలుగు నెలల్లోనే రూ.1,750 కోట్లు సైబర్ నేరగాళ్లు దేశ ప్రజల నుంచి కొల్లగొట్టారు. జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో 7.4 లక్షల కేసులు నమోదయ్యాయి. దేశంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, వాటిని అడ్డుకోవడానికి పటిష్టమైన సైబర్ రక్షణ వ్యవస్థ అవసరాన్ని ప్రస్తావిస్తూ 'ప్రహర్' సంస్థ ఒక నివేదిక 'ది ఇన్‌విజబుల్ హ్యాండ్'ను ప్రచురించింది. ఆ నివేదికలో భారతదేశం సైబర్ నేరగాళ్లకు ఎంత అనువైన ప్రాంతంగా మారిందో వివరించారు. '2033 నాటికి భారత్ లక్ష కోట్ల సైబర్ దాడులను ఎదుర్కొంటుంది. 2047 నాటికి ఆ సంఖ్య 17 లక్షల కోట్లకు చేరుకుంటుంది. ఎయిమ్స్, ఎయిర్‌లైన్స్‌పై జరిగిన సైబర్ దాడులు మన దేశ బలహీన సైబర్ వ్యవస్థకు తాజా ఉదాహరణలు. 2023లో దేశం 790 లక్షల సైబర్ దాడులను ఎదుర్కొంది. 2022తో పోల్చితే ఈ సంఖ్య 15 శాతం ఎక్కువ. ఈ పెరుగుదల 2024లోనూ కొనసాగింది. మొదటి త్రైమాసికంలో 5,000 లక్షల సైబర్ దాడులు జరిగాయి. 2023, రెండవ త్రైమాసికంతో పోలిస్తే 2024లో అదే కాలంలో ఈ సంఖ్యలో 46 శాతం పెరుగుదల ఉంది. ఈ దాడులను అడ్డుకోవడానికి బలమైన సైబర్ సెక్యూరిటీ అన్ని పరిశ్రమల్లోనూ అవసరం. సైబర్ నేరగాళ్ల లక్ష్యంగా చేసుకొనే సెక్టార్లకు ఇది మరింత అవశ్యం. ప్రపంచవ్యాప్తంగా 2024 మొదటి త్రైమాసికంలో సైబర్ దాడుల్లో 76 శాతం పెరుగుదల కనిపించింది. ఈ దాడులకు బలయిన మొదటి మూడు దేశాల్లో భారత్ కూడా ఉండడం విచారకరం. ఈ నేపథ్యంలో ఐదేళ్ల జాతీయ సైబర్ రక్షణ వ్యూహాన్ని రూపొందించుకోవలసిన అవసరం ఉంది. దేశంలోని అన్ని ఐటీ మౌలిక సదుపాయాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి కృషి చేయాలి. రహస్య ఎజెండాతో రూపొందించే బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి' అని నివేదిక సూచించింది. 'ప్రహర్' అధ్యక్షుడు అభయ్ మిశ్రా మాట్లాడుతూ, 'సైబర్ దాడులు రెండు రకాలు. మొదటిది... ఆర్థిక లాభం లేదా అంతరాయం సృష్టించడం కోసం వ్యవస్థలోని లొసుగులను ఉపయోగించుకొని సంప్రదాయ హ్యాకర్లు చేసే దాడి. రెండవది... పౌరులను లక్ష్యం చేసుకొని మరింత మోసపూరితంగా వ్యవహరిస్తుంది. బెదిరించో, బలవంతం చేసో, మాయమాటలు చెప్పో జాతి వ్యతిరేక కార్యకలాపాలకు ప్రేరేపిస్తుంది' అని వివరించారు. విశ్రాంత ఐపీఎస్ ముక్తేశ్ చందర్ మాట్లాడుతూ, 'వ్యక్తిగత హ్యాకర్లు, అసంతృప్తవాదులే కాదు... రాజ్య ప్రాయోజిత నటులు, కొన్ని సందర్భాల్లో స్వయంగా రాష్ట్రాలే ఆర్థిక వ్యవస్థ మూలాలను దెబ్బతీసే విపత్కర పరిస్థితి తలెత్తింది' అని అన్నారు.



కంబోడియా కేంద్రంగా..
డిజిటల్ అరెస్ట్ దందా

న్యూఢిల్లీ, అక్టోబరు 30 : డిజిటల్ అరెస్ట్... ఇటీవల సైబర్ నేరగాళ్ల ఎంచుకున్న కొత్త తరహా మోసం. ఫోన్లు చేసి కేసులు పేరుతో భయపెట్టి డిజిటల్‌గా అరెస్టు చేస్తున్నామని హడలెత్తించి సైబర్ కేటుగాళ్లు పెద్ద మొత్తంలో డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ తరహా మోసాలపై దేశ వ్యాప్తంగా ఇప్పటిదాకా 6,000కు పైగా కేసులు నమోదయ్యాయి. అయితే, కంబోడియా, మయన్మార్ కేంద్రంగా సైబర్ నేరగాళ్ల ఈ మోసాలకు పాల్పడుతున్నట్టు తెలిసింది. కంబోడియా, మయన్మార్‌లో మూతబడిన చైనాకు చెందిన క్యాసినోల్లో కాల్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని ఈ మోసాలకు పాల్పడుతున్నారు. ఈ ముఠాలు విదేశీ ఉద్యోగం పేరిట భారత్‌కు చెందిన నిరుద్యోగులకు ఎరవేసి ఉద్యోగాల్లో చేర్చుకుని వారితో బలవంతంగా మోసాలు చేస్తున్నాయి. ఈ ముఠాల్లోని వారు పోలీసు దుస్తులు ధరించి వీడియో కాల్స్ మాట్లాడుతూ డిజిటల్ అరెస్టులంటూ అమాయకుల నుంచి అందిన కాడికి దోచుకుంటారు. పైన ఖాకీ చొక్కా, కిందన సాధారణ పైజమా ధరించిన ఓ సైబర్ మోసగాడి ఫొటోను ఓ జాతీయ మీడియా చానల్ తన వెబ్‌సైట్‌లో ప్రచురించింది. కాగా, ఈ డిజిటల్ అరెస్ట్ మోసాలు రోజురోజుకి అధికమవ్వడంతో అప్రమత్తమైన కేంద్ర హోం శాఖ ఆయా కేసుల దర్యాప్తునకు ఓ ఉన్నతస్థాయి కమిటీని నియమించింది.

కార్మిక శక్తిపై
ఉష్ణోగ్రతల ప్రభావం

» పెరిగిన వేడి వల్ల పని సామర్థ్యం తగ్గుదల
» గతేడాది భారత్‌కు 12 లక్షల కోట్ల నష్టం

న్యూఢిల్లీ, అక్టోబరు 30: వాతావరణ మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయిలో పెరిగిపోతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు కార్మిక శక్తిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. 2023లో అధిక వేడి కారణంగా భారత్‌లో కార్మిక సామర్థ్యం బాగా తగ్గిపోయిందని, దీనివల్ల రూ.11.85 లక్షల కోట్ల ఆదాయాన్ని భారత్ నష్టపోవాల్సి వచ్చిందని 'లాన్సెట్ కౌంట్‌డౌన్ పర్ ఇండియా-2024' నివేదిక వెల్లడించింది. వ్యవసాయ రంగానికి అత్యధికంగా రూ.6.04 లక్షల కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో), ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) సహా ప్రపంచవ్యాప్తంగా 57 విద్యాసంస్థలు, ఐక్యరాజ్య సమితి సంస్థలకు చెందిన 122 మంది నిపుణులతో రూపొందించిన వార్షిక నివేదికను లాన్సెట్ బుధవారం వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం బహిరంగ వేడి కారణంగా గతేడాది భారత్‌లోని ప్రజలు సగటున 2,400 పనిగంటలు లేదా 100 రోజుల పనిదినాలను కోల్పోయారు. ఇది 1990-1999 సగటుతో పోలిస్తే 50 శాతం అధికం. ఐక్యరాజ్యసమితి 29వ కాన్ఫరెన్స్ (సీవోపీ29)కు ముందు ప్రచురించిన ఈ నివేదిక.. వాతావరణ మార్పులు ప్రజల ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నాయో దేశాల వారీగా అంచనా వేసింది. 2014-2023 మధ్య కాలంలో శిశువులు, 65 ఏళ్ల పైబడివారు ఏడాదికి సగటున 7.7 నుంచి 8.4 రోజులపాటు వడగాడ్పులకు గురవుతున్నారని ఈ నివేదిక స్పష్టం చేసింది. అలాగే 2000వ సంవత్సరం తర్వాత భారత్‌లో పునరుత్పాదక విద్యుత్‌శక్తి వినియోగం పెరిగిందని, 2022లో దేశంలోని విద్యుత్‌లో దీని వాటా 11% అని తెలిపింది. దేశంలో 71% విద్యుత్ ఇప్పటికీ బొగ్గు నుంచే వస్తోందని పేర్కొంది.

కొత్త మార్గదర్శకాలతో బెదిరింపులకు జల్లెడ..
అవన్నీ ఒట్టివని తేల్చారు!

» పలు కోణాల్లో బెదిరింపుల పరిశీలన

న్యూఢిల్లీ, అక్టోబరు 30: గత కొన్ని రోజులుగా వందలాది విమానాలకు బాంబు బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో 'బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్' కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. వీటి ఆధారంగానే బాంబు బెదిరింపులను ఒట్టివేనని తేల్చి, సదరు విమానాల ప్రయాణానికి అనుమతిస్తోంది. ఫలితంగా, ప్రయాణికులు, విమానయానసంస్థలు, ఎయిర్‌పోర్టులు, భద్రతా సిబ్బంది తదితరులకు అనవసరమైన ఇబ్బందులు, శ్రమ తప్పుతున్నాయి. ఈ మార్గదర్శకాలను బీసీఏఎస్ ఈ నెల 19నే విడుదల చేసినప్పటికీ.. వాటి వివరాలు బుధవారం వెల్లడయ్యాయి. సాధారణంగా బాంబు బెదిరింపులు వచ్చినప్పుడు.. బీసీఏఎస్, సీఐఎస్ఎఫ్, స్థానిక పోలీసులు, ఎయిర్‌పోర్టు నిర్వహణ సంస్థ, విమానయాన సంస్థ సిబ్బందితో కూడిన ఓ కమిటీ దానిపై నిర్ణయం తీసుకుంటుంది. కొత్త మార్గదర్శకాల ప్రకారం.. ఈ కమిటీ సదరు బెదిరింపులు నిజమైనవేనా? నకిలీవా? వాటిలో ఉన్న విశ్వసనీయత ఎంత? అన్నది పరిశీలిస్తోంది. దీంట్లో భాగంగా, బెదిరింపులు చేసిన వ్యక్తి లేదా సంస్థ నేపథ్యం ఏవిటి? ఉగ్రవాదంతోగానీ ఏదైనా నిషేధిత సంస్థతోగానీ సంబంధం ఉన్నవాళ్లా? దుండగుల పేర్లు, వివరాలు నిజమైనవేనా? మారుపేర్లు పెట్టుకున్నవారుగానీ, అజ్ఞాతవ్యక్తులుగానీ వీటిని పంపించారా? ఒకే సోషల్ మీడియా హ్యాండిల్ నుంచి పలుసార్లు బెదిరింపులు వస్తున్నాయా? వంటి పలు కోణాల్లో ఈ కమిటీ పరిశీలన జరుపుతోంది. బెదిరింపులు వచ్చిన విమానంలో ప్రయాణిస్తున్న వారిలో వీఐపీలు ఉన్నారా అన్నది కూడా పరిగణలోకి తీసుకుంటోంది. వీటి ఆధారంగానే.. వచ్చిన బాంబు బెదిరింపుల తీవ్రతను కమిటీ అంచనా వేసి విమానాన్ని దారి మళ్లించటం, జనసమ్మర్ధం లేని ప్రాంతంలో దించటం, తాజాగా మళ్లీ ప్రయాణికుల లగేజీతోపాటు విమానంలో తనిఖీలు జరపటం మొదలైన చర్యలపై నిర్ణయాలు తీసుకుంటుంది. అయితే, గత కొన్ని వారాలుగా వస్తున్న బెదిరింపులన్నీ కూడా ఒట్టివేనని ఈ కొత్త మార్గదర్శకాల ప్రకారమే బీటీఏసీ నిర్ణయించిందని వైమానిక రంగానికి చెందిన ఓ సీనియర్ సెక్యూరిటీ అధికారి తెలిపారు. గతంలో బాంబు బెదిరింపులు వచ్చినప్పుడు తీవ్రమైనవిగా పరిగణించి జాగ్రత్త చర్యలు చేపట్టేవారమన్నారు. ప్రస్తుత బెదిరింపుల్లో అత్యధికం ఒకే సోషల్ మీడియా హ్యాండిల్ నుంచి వస్తున్నట్లు తేలిందన్నారు.

సల్మాన్ ఖాన్‌కు మళ్లీ బెదిరింపు

బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్‌కు మళ్లీ బెదిరింపు వచ్చింది. రూ. 2 కోట్లు చెల్లించకపోతే చంపుతామని గుర్తుతెలియని వ్యక్తి ముంబయి ట్రాఫిక్ పోలీసులకు మెసేజ్ పంపాడు. ముంబయి పోలీసుల ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నెంబరుకు గుర్తుతెలియని వ్యక్తి ఈ మెసేజ్ పంపాడు. దీనిపై వర్లి పోలీసులు కేసు నమోదు చేసి ఆ వ్యక్తిని గుర్తించే పనిలో పడ్డారు. సల్మాన్‌ఖాన్, ఎన్సీపీ లీడర్ జీషన్ సిద్దిఖీలను చంపుతామని బెదిరించిన యూపీలోని నోయిడాకు చెందిన 20 ఏళ్ల యువకుడిని ముంబయి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. తర్వాత రెండు రోజులకు ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. అంతకుముందు లారెన్స్ బిష్ణోయ్ పేరు చెప్పి రూ.5 కోట్లు చెల్లించాలని సల్మాన్‌ఖాన్‌ను డిమాండ్ చేసిన జమ్‌షెడ్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తిని కూడా పోలీసులు అరెస్టు చేశారు.

ఖలిస్థానీలపై దాడుల్లో షా హస్తం

» కేంద్ర హోంమంత్రిపై కెనడా తాజా ఆరోపణలు

న్యూఢిల్లీ, అక్టోబరు 30: కెనడాలో ఖలిస్థానీలపై దాడుల వెనుక కేంద్ర హోంమంత్రి అమిత్ షా హస్తం ఉందని ట్రూడో ప్రభుత్వం తాజాగా ఆరోపించింది. జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ కెనడాలో మరిన్ని కార్యకలాపాలు నిర్వహించకుండా నిరోధించాలని భారత్‌ను కోరింది. ఈ కుట్రల వెనుక అమిత్ షా పాత్ర ఉందని అమెరికాకు చెందిన ఒక వార్తాపత్రికకు తానే సమాచారం ఇచ్చినట్లు కెనడా డిప్యూటీ విదేశాంగ మంత్రి డేవిడ్ మోరిసన్ అంగీకరించారు. మంగళవారం కెనడా స్టాండింగ్ కమిటీ ముందు ఆయన విచారణకు హాజరయ్యారు. 'ఆ జర్నలిస్టు నాకు కాల్ చేసి... అది ఆయనేనా (అమిత్ షా) అని అడిగారు. ఆయనేనని నేను ధ్రువీకరించాను' అని పబ్లిక్ సేఫ్టీ అండ్ నేషనల్ సెక్యూరిటీ స్టాండింగ్ కమిటీకి మోరిసన్ వెల్లడించారు. కాగా, కెనడాలో భారత కార్యకలాపాలపై దర్యాప్తు చేస్తున్న రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ (ఆర్‌సీఎంపీ) కూడా ఇప్పటి వరకూ అమిత్ షాపై బహిరంగంగా ఆరోపణలు చేయలేదు.

పోలీస్ స్టేషన్‌నే స్టూడియోగా వాడుకున్న బిష్ణోయ్

» పోలీసులపై పంజాబ్ హైకోర్టు ఫైర్

చండీగఢ్, అక్టోబరు 30: పోలీస్ స్టేషన్‌లో సీనియర్ అధికారి కార్యాలయాన్ని ఓ టీవీ ఇంటర్వ్యూ కోసం గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ స్టూడియోగా వాడుకోవడంపై పంజాబ్ హరియాణా హైకోర్టు తీవ్ర స్థాయిలో మండిపడింది. ఈ విషయంలో పోలీసు అధికారులు, లారెన్స్ బిష్ణోయ్ మధ్య కుమ్మక్కు, కుట్రపై విచారణ జరిపేందుకు ప్రత్యేక సిట్‌ను ఏర్పాటు చేయాలని జస్టిస్ అనుపిందర్ సింగ్ గ్రేవాల్, జస్టిస్ లాపితా బెనర్జీలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. జైల్లో ఖైదీలు సెల్‌ఫోన్లు వాడుతున్నారనే కేసులో కోర్టు విచారణ సందర్భంగా బిష్ణోయ్ ఇంటర్వ్యూ విషయాన్ని కోర్టు గుర్తించింది. సెల్‌ఫోన్లు వినియోగించుకునే అవకాశం ఇవ్వడమే కాకుండా, పోలీసు అధికారి కార్యాలయాన్నే స్టూడియోగా వాడుకునేలా అనుమతించడం వల్ల నేరాలు మరింత పెరిగే అవకాశం ఉందని కోర్టు హెచ్చరించింది.

కెనడాలో విద్యార్థులకు ఆహారం కొరత?

న్యూఢిల్లీ, అక్టోబరు 30: కెనడాలో అంతర్జాతీయ విద్యార్థులకు ఉచిత ఆహార సదుపాయాన్ని నిరాకరించాలని గ్రేటర్ వాంకోవర్ ఫుడ్ బ్యాంక్ తీసుకున్న నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా ఆహారం ధరలు, నిరుద్యోగం పెరుగుతున్న నేపథ్యంలో ఫుడ్ బ్యాంకులపై ఆధారపడేవారి సంఖ్య గణనీయంగా పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ఈ నిర్ణయం భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపనుంది. కెనడాలో జీవన వ్యయం భారీగా పెరగడంతో అంతర్జాతీయ విద్యార్థులు ఎక్కువగా ఫుడ్ బ్యాంకులపైనే ఆధారపడుతున్నారు. ఈ ఏడాది మార్చిలో దాదాపు 20 లక్షల మందికి పైగా విద్యార్థులు ఫుడ్ బ్యాంక్‌లను ఆశ్రయించారు.

కేంద్ర పింఛనుదారులకు పెంచిన 3% డీఏ మంజూరు

న్యూఢిల్లీ, అక్టోబరు 30: పెన్షనర్లకు పెంచిన 3 శాతం కరువు భత్యాన్ని (డీఏ) మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం ఆదేశాలిచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు డీఏను 3 శాతం పెంచుతూ ఈ నెల 16 కేబినెట్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇది ఈ ఏడాది జూలై 1 నుంచే అమల్లోకి వస్తుంది. ఈ పెంపుతో డీఏ 50 నుంచి 53 శాతానికి చేరనుంది. పెన్షన్, పెన్షనర్స్ సంక్షేమ విభాగం ఉత్తర్వులిచ్చినట్టు సిబ్బంది మంత్రిత్వ శాఖ పేర్కొంది.

జనవరి 5న గ్రూప్-2 మెయిన్స్

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 మెయిన్స్ రాత పరీక్షను వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన నిర్వహించనున్నట్టు రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) వెల్లడించింది. దాదాపు లక్ష మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరు కానున్న నేపథ్యంలో రాబోయే డీఎస్సీ పరీక్ష, పదో తరగతి, ఇంటర్మీడియట్ బోర్డ్ పరీక్షలను పరిగణనలోకి తీసుకుని గ్రూప్-2 రాతపరీక్ష తేదీని నిర్ణయించినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి జె.ప్రదీప్‌కుమార్ తెలిపారు.

దక్షిణ మధ్య రైల్వేకు
రూ.25 వేల జరిమానా
ఏసీ, నీరు తగినంత లేదని ప్రయాణికుడి ఫిర్యాదు

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైలులో తగినంత నీరు, ఏసీ సదుపాయం కల్పించలేదని దక్షిణ మధ్య రైల్వేకు వినియోగదారుల కమిషన్ రూ.25 వేల జరిమానా విధించింది. విశాఖపట్నానికి చెందిన మూర్తి తన కుటుంబంతో కలిసి తిరుపతి వెళ్లడానికి తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలులో థర్డ్ ఏసీ టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. ఆయన ఈ ఏడాది జూన్ 5న విశాఖపట్నం నుంచి రైలు కదిలే ముందు ఆయన సీట్లు 3ఏ కోచ్ నుంచి 3ఈ కోచ్‌కు మార్చినట్టు అధికారులు తెలిపారు. టాయిలెట్లలో తగినంత నీరు రాకపోవడం, ఏసీ కోచ్‌లో ఏసీ తక్కువగా ఉండడం, పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో ఆయన దువ్వాడ స్టేషన్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే వారు పెద్దగా స్పందించలేదు. దాంతో మూర్తి వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. వారి విచారణలో పైపుల్లో ఎయిర్ బ్లాక్ కావడం వల్ల నీరు తగినంత రాలేదని అధికారులు వివరించారు. రైలులో సౌకర్యవంతమైన ప్రయాణానికి తగిన ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత సంస్థపై ఉందని, ఫిర్యాదు చేసినా స్పందించనందున ప్రయాణికుడికి రూ.25 వేల పరిహారంతో పాటు, కోర్టు ఖర్చుల కింద మరో రూ.5 వేలు కలిపి రూ.30 వేలు చెల్లించాలని కమిషన్ ఆదేశించింది.

శ్రీవారి అన్నప్రసాద వితరణ విరాళం పెంపు

▸▸ ఒక్క రోజుకు 44 లక్షలకు పెంచుతూ టీటీడీ నిర్ణయం

తిరుమల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి అన్నప్రసాదం ఒక్క రోజు వితరణ విరాళాన్ని టీటీడీ పెంచింది. గతంలో రూ.38 లక్షలున్న విరాళాన్ని రూ.44 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు అన్నప్రసాదాన్ని అందించేందుకు ఒక రోజు విరాళ పథకాన్ని కొన్నేళ్ల కిత్రం ప్రారంభించింది. ధరలు పెరుగుతున్న క్రమంలో అల్పాహారం కోసం రూ.10 లక్షలు, మధ్యాహ్నం, రాత్రి భోజనం కోసం రూ.17 లక్షల చొప్పున మొత్తం రూ.44 లక్షలకు పెంచుతూ టీటీడీ నిర్ణయం తీసుకుంది.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కె.ఎస్.లక్ష్మణరావు

విజయవాడ(గవర్నర్‌పేట), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గం పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కె.ఎస్.లక్ష్మణరావును ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, వి.బాలసుబ్రహ్మణ్యం ప్రకటించారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే)లో బుధవారం ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, పెన్షనర్స్, ప్రజాసంఘాల సమావేశం జరిగింది. ప్రస్తుత పీడీఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావును రానున్న ఎన్నికల్లో కూడా నిలపాలని ఏకగ్రీవంగా సమావేశం తీర్మానించింది.

బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు

ఇద్దరు మృతి.. ఐదుగురికి తీవ్ర గాయాలు



తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో పిడుగుపడి దగ్ధమైన బాణసంచా తయారీ కేంద్రం

రాజమహేంద్రవరం/ఉండ్రాజవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగుపడి సంభవించిన ప్రమాదంలో ఇద్దరు మహిళలు సజీవ దహనమయ్యారు. మరో ఐదుగురు తీవ్రం గా గాయపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని సూర్యారావుపాలెంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. తణుకు మండలం వెంకట్రాయపురానికి చెం దిన వేగిరోతు రామశివాజీ రెండేళ్ల కిందట ఇక్కడ బాణసంచా తయారీ కేంద్రం ఏర్పాటు చేశారు. సాయి ఫైర్‌వర్క్స్ పేరిట ఏర్పాటు చేసిన ఈ కేంద్రం లో మందుగుండు సామగ్రి తయా రు చేస్తున్నారు. యజమాని రామశివాజీతోపా టు ఆయన భార్య శ్రీవల్లి సహాయంగా ఉంటారు. వారితోపాటు ప్రతీరోజూ తణుకు, ఇతర ప్రాంతాలకు చెందిన కూలీలు ఆటోలో వచ్చి పని చేస్తుంటారు. బుధవారం నిర్వాహకులైన భార్యాభర్తలతోపాటు మొత్తం 18 మంది పనిలోకి వచ్చారు. ఈ ప్రాంతంలో కొన్ని రోజులుగా పొడి వాతావరణం ఉండగా.. బుధవారం మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా మారిపోయింది. ఉరుములతో కూడిన భారీ వర్షం పడింది. సాయంకాలం సుమారు 5.15 గంటలకు కొబ్బరి చెట్టు మీద పిడుగు పడి, మంటలు వ్యాపించి సమీపంలోనే ఉన్న ఫైర్‌వర్క్స్‌కు అంటుకున్నాయి. దీంతో భారీ విస్ఫోటం జరిగి కేంద్రం మొత్తం భస్మమైంది. యజమాని భార్య వేగిరోతు శ్రీవల్లి(42)తోపాటు గుమ్మడి సునీత (35) సజీవ దహనమయ్యారు. కడిమి కుమారి (50), చుక్క పెద్దింట్లు(45), మందలంక కమలరత్నం (40), నీలం లక్ష్మి (45), విప్పర్తి వేంకటేశ్వరరావు(50) తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని తణుకు ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి ఏలూరు ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తదితర అధికారులు పరిశీలించారు. పేలుడు సంఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారందరికీ మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. మృతుల కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ చెప్పారు.

పిడుగుపాటు మరణాలపై సీఎం విచారం

బాణాసంచా తయారీ కేంద్రంపై పిడుగుపడి ఇద్దరు మహిళలు మృతి చెందడంపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

మెడికల్ కాలేజీకి యల్లాప్రగడ పేరు పెట్టండి

▸▸ డిప్యూటీ సీఎం పవన్ లేఖ... సీఎం సానుకూల స్పందన

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత వైద్య శాస్త్రవేత్త, తెలుగు తేజం డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు పేరును ఏదైనా ప్రభుత్వ వైద్య కళాశాలకు పెట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రతిపాదించారు. ఈ మేరకు బుధవారం సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. ప్రపంచానికి పలు ఔషధాలు అందించిన శాస్త్రవేత్త యల్లాప్రగడ సుబ్బారావు స్వస్థలం భీమవరమని, రాజమండ్రిలో విద్యాభ్యాసం చేశారన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఏలూరు, రాజమండ్రి ప్రభుత్వ వైద్య కళాశాల్లో ఒకదానికి ఆయన పేరు పెడితే సముచితంగా ఉంటుందని కోరారు. ఈ లేఖను సీఎం చంద్రబాబు ఆరోగ్యశాఖకు పంపించి, పరిశీలించాలని సూచించారు.

ఉద్యోగం రాలేదని యువతి ఆత్మహత్య

బెళుగుప్ప, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎవరిపైనా ఆధారపడవద్దని ఎంతో కష్టపడి చదివి, ఉద్యోగ ప్రయత్నాలు చేసినా ఉద్యోగం సాధించలేకపోయానన్న వేదన ఆ యువతిని ప్రశాంతంగా ఉండనివ్వలేదు. అనంతపురం జిల్లా బెళుగుప్ప మండలం జీడిపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు, నాగమణి దంపతుల కూతురు నవ్య(22) ఉద్యోగం రాలేదని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుధవారం ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. నవ్య బీటెక్ పూర్తి చేసింది. ఉద్యోగం కోసం హైదరాబాద్‌లో ఆరు నెలలు శిక్షణ తీసుకుంది. పలుమార్లు ఇంటర్వ్యూలకు హాజరైనా ఉద్యోగం రాలేదు. ఈ క్రమంలో ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్న ఓ బ్రోకర్ మోసగించాడు. దీంతో ఇక ఉద్యోగం రాదని భావించిన నవ్య.. ఆత్మహత్య పాల్పడింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ


మన బంగారం మంచిదే...

ధనత్రయోదశి నాడు వందటన్నులకుపైగా బంగారం మనదేశంలోకి అడుగుపెట్టిందట. మనలో చాలామందికి బంగారం అంటే సాక్షాత్తూ లక్ష్మీదేవే. వెలుగులీనే దీపావళికి బంగారు వన్నెలద్దాలని రిజర్వ్‌బ్యాంక్ కూడా అనుకొని ఉంటుంది. లండన్‌లోని 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్'నుంచి ఈ బంగారం రప్పించి, మనదేశంలో సురక్షితమైన నిల్వకేంద్రాల్లో రిజర్వుబ్యాంక్ భద్రపరిచింది. బంగారంతో వెలకట్టలేనంత అనుబంధం ఉన్న సమాజంలో, బంగారానికి సంబంధించిన ఏ వార్త అయినా, మిగతారోజులకంటే ఈ ధనత్రయోదశి, దీపావళి సందర్భాల్లో మరింత మెరిసిపోతుంది. బంగారంలాంటి వార్తలతో, ప్రత్యేక కథనాలతో దంతేరాస్‌కు బాగా ముందునుంచే మీడియా మనలను ముంచెత్తుతోంది. తులం బంగారానికి సైతం సామాన్యుడు తూగలేని పరిస్థితులున్నా, దీపావళి తారాజువ్వల్లాగా నిముషానికోరేటుతో అది అందనంత ఎత్తుకు ఎగిరిపోతున్నా, అందివస్తుందన్న ఆశ, అందుకోవాలన్న తపన ఎన్నటికీ ఉంటాయి.

ఇప్పుడు రిజర్వ్‌బ్యాంక్ దగ్గర 855టన్నుల బంగారం నిల్వలున్నాయని, అందులో ఓ ఐదువందల టన్నులు ఇక్కడ, మిగతాది ఇంకా లండన్‌లోని రెండు బ్యాంకుల్లోనూ ఉన్నాయని విన్నప్పుడు చాలామందికి 1990లనాటి పరిస్థితి గుర్తుకువస్తున్నది. ఆ రోజులు తలుచుకుంటే కాస్తంత బాధగా ఉంటుంది కానీ, ఆ కష్టాలన్నీ అధిగమించి ఇప్పుడు ఇంత బంగారాన్ని పోగేసుకున్నందుకు గర్వంగా కూడా ఉంటుంది. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థనుంచి అప్పుతెచ్చి దేశాన్ని ఆర్థికసమస్యలనుంచి కాపాడాలని ఆర్థిక నిపుణులు సలహాచెప్పారు. ఆయన సరే అన్నప్పటికీ, విధాన నిర్ణయంలో జాప్యం జరిగిందని, ఇంతలో ఎన్నికలు రావడంతో ఆయన వెనుకడుగువేశారని అంటారు. ఆ తరువాత ప్రధానిగా వచ్చిన వీపీ సింగ్ 'ఖజానా ఖాళీ' అని ప్రకటించారు కానీ, ఏడాదిన్నరలోనే దిగిపోవాల్సివచ్చింది. చంద్రశేఖర్ ఏలుబడిలో ప్రధానమంత్రికి ఆర్థికసలహాదారుగా ఉన్న మన్మోహన్ సింగ్, ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా చొరవచూపడంతో ఐదుబిలియన్ డాలర్ల స్వల్పకాలిక రుణం తీర్చడానికి తొలిసారిగా స్మగ్లర్లనుంచి స్వాధీనం చేసుకున్న కొద్దిపాటి బంగారాన్ని స్విట్జర్లాండ్ బ్యాంక్‌లో తాకట్టుపెట్టి, అప్పు ఎగవేతదారుడిగా చెడ్డపేరు రాకుండా ప్రభుత్వం ప్రయత్నించింది. కానీ, ఆర్థికసంక్షోభం తీవ్రమై, అతి తక్కువ విదేశీమారక నిల్వలతో, నెలరోజులు కూడా దేశాన్ని నడపలేని ఆ గడ్డు పరిస్థితులనుంచి బయటపడటానికి ఆ తరువాత రిజర్వ్‌బ్యాంక్ దగ్గరున్న బంగారాన్ని రహస్యంగా దేశం దాటించి రెండు విదేశీబ్యాంకుల్లో తనఖాపెట్టిన సందర్భం ఎన్నటికీ మరిచిపోలేనిది. మనదేశంలో వ్యవసాయ, వ్యాపార కుటుంబాలవారికి బంగారం ఓ అలంకరణగా, హోదాగా కంటే ఆపదలో తమను ఆదుకొనే ఓ ఆపన్నహస్తం. కరగని, తరగని ఆస్తి. ఆర్థికంగా బాగున్నప్పుడు కూడబెట్టుకోవడానికీ, అవసరమైనప్పుడు తాకట్టుపెట్టుకొని, కష్టాల కడలిని ధైర్యంగా ఈది ఆవలి ఒడ్డుకు చేరడానికి సహకరించే ఓ శక్తి. ఆభరణాలను ఇలా వాడుకోవడం మనకు కొత్తేమీ కాదు కానీ, ప్రభుత్వం బంగారాన్ని తనఖాపెట్టడం మాత్రం మనకు అప్పట్లో చాలా అవమానంగా తోచింది. ఆ తరువాత అమెరికా యుద్ధ విమానాలకు చమురుపోసి, అంతర్జాతీయ ద్రవ్యనిధినుంచి భారీగా రుణం పొంది, కష్టాలనుంచి గట్టెక్కిన విషయం తెలిసిందే. ఆ అప్పుతో పాటుగా వచ్చిన ఆంక్షలకు అనుగుణంగా, దేశ ఆర్థికాన్ని పీవీ–మన్మోహన్ ద్వయం సంస్కరణలబాట పట్టించడం, ఒకప్పుడు బంగారాన్ని తనఖాపెట్టిన దేశం ఇప్పుడు అంతర్జాతీయ విపణిలో దానిని భారీగా కొనుగోలుచేయగలస్థాయికి చేరుకోవడం ఒక గొప్ప పరిణామం.

ప్రాంతీయ ఉద్రిక్తతలు, యుద్ధాలు హెచ్చుస్థాయిలో ఉన్నకాలం కనుక, డాలర్ బలహీనపడినా, కరెన్సీ విలువలు కాస్తంత కదిలినా బంగారాన్ని మించిన భద్రత మరేమీ ఉండదు. అది దేశమైనా, కుటుంబమైనా కల్లోలాలనుంచి కాపాడేశక్తి ఆ లోహానికే ఉంది. కాకపోతే ఇటీవలికాలంలో ఆభరణాలమీద ప్రేమ తగ్గిందని, దానిని ఇతరత్రారూపాల్లో కొనిదాచుకోవడం మాత్రం అలాగే ఉందని వార్తలు వింటున్నాం. ప్రపంచంలో అత్యధికబంగారం భారతీయుల దగ్గరే ఉందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ఎప్పటినుంచో అంటోంది. ఎవరేమనుకున్నప్పటికీ, ప్రాచీనకాలంనుంచి మన దేహాన్ని, సాహిత్యాన్ని, భాషని, ఆలోచనలని మెరిపించి, మురిపిస్తున్న మన బంగారం మంచిదే.

అంధకార ప్రపంచంలో 'అప్పో దీపో భవ'!


akbar

> అసత్యం నుంచి సత్యంలోకి, చీకటి నుంచి వెలుగులోకి మృత్యువు నుంచి అమృతత్వంలోకి నడిపించమని వేదకవి కోరుతున్నాడు. బృహదారణ్యక ఉపనిషత్తులోని ఈ సందేశంలోని 'తమసోమా జ్యోతిర్గమయ' అన్న పంక్తి ఆంధ్రజ్యోతికి తొలినాటి నుంచి కరదీపికగా ఉంది. ఎరుకను మించిన వెలుగు లేదు. చీకటిని వెలిగించడంలో అక్షరానికి మించిన జ్యోతి లేదు. ఈ అక్షర కాంతి నిరంతరంగా 'ఆంధ్రజ్యోతి' పాఠకులపై వర్షిస్తూనే ఉండాలి!.


▪ కె. శ్రీనివాస్

సందర్భం

పద్నాలుగేళ్లు అరణ్యవాసం చేసిన రాముడు, సీతాలక్ష్మణులతో తిరిగి వస్తున్నాడంటే అయోధ్య ప్రజలు తమ ఆనందాన్నంతా ప్రమిదల్లోకి ఒంపి దీపాలు వెలిగించారట. అయోధ్య దేదీప్యమానమైందట. వియోగం ఎప్పుడూ చీకటే. కలయిక ఎప్పుడూ వేడుకే.

రాముడి కథకూ, చారిత్రక బుద్ధుడి కథకూ ఎందుకో ఎన్నో పోలికలు! కుటుంబాన్ని, రాజ్యాన్ని, దేశాన్ని వదిలి సత్యాన్వేషణకై వెళ్లిన సిద్ధార్థ గౌతముడు, మానవ దుఃఖాలకు కారణాలను, నివారణలను తెలుసుకుని బుద్ధుడయ్యాక, తల్లిదండ్రులు, పుట్టిన నేల పిలిచిందని సందర్శనకు వస్తుంటే, కళ్లల్లో వత్తులు వేసుకుని చూస్తున్న కపిలవస్తు, వీధులన్నిటిలోనూ వెలుతురు ముగ్గులేసి స్వాగతించిందట! ఆ శాక్యప్రజలకు తెలుసు బుద్ధుడు ఉండిపోవడానికి రావడం లేదు, రాజ్యం ఏలడానికీ రావడం లేదు, తన మీద బెంగనే కాదు, బెంగలన్నిటినీ తీర్చడానికి వస్తున్నాడు!

ఆశ్వయుజ, కార్తీకమాసాలలో వచ్చే పండుగలకు అనేక కథనాలున్నాయి. రావణవధ జరిగింది దసరా అంటారు. కురుక్షేత్ర యుద్ధంలో పాండవులకు విజయం లభించిన సందర్భం అంటారు. అశోకుడు బౌద్ధంలోకి పరివర్తన చెందిన రోజు విజయదశమి అంటారు. పెద్దలను స్మరించుకోవడం, పూలపండుగ చేసుకోవడం, జమ్మి ఆకులు పంచుకోవడం, ఉపవాసనిష్ఠలు, వనభోజనాలు, అనేక సందర్భాలతో ఈ రెండు నెలల కాలం కిక్కిరిసిపోతుంది.

పండగల వెనుక ఉన్న కథలేమైనా, ఈ రెండు మాసాల శరదృతువు, ఎంతో ఆహ్లాదకరమైన కాలం. "శారదరాత్రులుజ్జ్వల లసత్తర తారక హారపంక్తుల"తో అలంకృతమయ్యాయని నన్నయ రాశాడు. వెదజల్లిన కర్పూరపు పుప్పొడిలాగా ఉంటుందట వెన్నెల. వర్ష రుతువు ముగిసి, జలాశయాలు నిండి, పూలవెల్లువతో నేల నేల అంతా ఉప్పొంగిపోతుంది. మబ్బులు లేని ఆకాశాలు, మెరిసే నక్షత్రాలు, కాటుకపొగల కృష్ణపక్షాలు, తుళ్లింతల తేరు మీద రాత్రింబవళ్లు సవారీ చేస్తాయి. మనకు అమావాస్యతో నెలముగుస్తుంది కదా, నేటి దీపావళి తరువాత కార్తీకం కదా? దేశంలో చాలా మందికి, ముఖ్యం ఉత్తరాదికి, పున్నమి నుంచి పున్నమికి నెల. వాళ్లకు కార్తీకం ఇప్పటికే మొదలై పక్షం గడిచింది! కాలపు లెక్కలకేమి గానీ, ఈ రెండు మాసాల మీద కమ్మినదొక జన, వన జాతరల జమిలి రుతువు!

పర్వదినం అంటే, ఒకే సంతోషం అందరి కళ్లలోనూ వెలగడం కదా! లోకకంటకుడు ఎవరో హతుడయ్యాడని, ఎంతో జననష్టం జరిగే యుద్ధంలో విజయం దక్కిందని పండగ చేసుకోవడంలో ఏదో అసౌకర్యం ఉన్నది. శాంతి, కరుణలు నిండిన ఉల్లాసంలో ఉత్సాహంలో కదా సంబరమున్నది! చెడు మీద మంచి విజయంగా ఆ పురాణకథలను చూడాలి అంటారు. ఆ విజయం హింస ద్వారానో, శిక్షించడం ద్వారా, బలవంతంగా నిర్మూలించడం ద్వారానో జరిగినప్పుడు, అక్కడ ఏదో అపజయం కూడా స్ఫురించడం లేదా? మూలకారణాన్ని కాక, వ్యక్తీకరణను మాత్రమే తొలగించే పని ఎవరు చేసినా అది అసంపూర్ణమే. అటువంటప్పుడే, ధర్మసంస్థాపనకు పదే పదే సంభవామి తప్పదని హామీలు పూచీలు ఇచ్చుకోవలసి వస్తుంది. ఒక్క దుష్ట శిక్షణ కూడా చేయకుండానే గౌతమబుద్ధుడు కొత్త ధర్మాన్ని స్థాపించాడే, అనేక ఆదర్శాలను వ్యాపింపజేశాడే? అది ఎట్లా సాధ్యపడింది?

కానీ, ఏది ధర్మం? ఏది మంచి? ఏది చెడుగు? ఓ మహాత్మా ఓ మహర్షీ? ఎవరు ఎవరికి కంటకుడో ఏమో? యుద్ధంలో ఏ పక్షానిది న్యాయమో ఎవరు తేల్చాలి? రాసిన పురాణాలైనా, చరిత్రలైనా విజేతల కథనాలే కదా! ఐదు దశాబ్దాల కిందట శ్రీకాకుళం ఆదివాసులకు అత్యంత ఆప్తులైన ఉద్యమకారులను పోలీసులు కాల్చిచంపినప్పుడు, ఒక పత్రిక 'నరకాసుర వధ' అన్నపేరుతో సంపాదకీయం రాసింది. భూమిపుత్రుడు కదా నరకుడు, ఏ ప్రయోజనాల యుద్ధంలో అతను దేనికి చనిపోయాడో? ఆగ్రహాలను, ప్రతీకారాలను కాక, లోలోపల ప్రేమదీపాలను వెలిగించగల రోజులే హర్షరుతువులై, జీవనోత్సవాలైతే ఎంత బాగుండును! పండుగలు కేవలం భక్ష్యభోజ్యాలకు, పూజాతతంగాలకు పరిమితం కాక, ఆయా సందర్భాలలో దాగిన విలువలను తరచి చూడగలిగితే ఎంత సార్థకంగా ఉండును? లేదా, మనిషి తను కాలక్రమంలో సమకూర్చుకుని, దృఢపరచుకున్న కొత్త ఆశయాలకు, లక్ష్యాలకు, నీతికి అనుగుణమైన కొత్త పండుగలను కనిపెడితే, కరకుదనమూ రోషకషాయిత రౌద్రమూ కాక, మానవ ఆదిమ అమాయకత్వాన్ని పులుముకున్న దైవరూపాలనూ ఆవిష్కరిస్తే, వేడుకలు ఎంత దయగా ఉండేవి?

ద్వేషంతో ఎవరినైనా, దేన్నైనా గెలవాలని ప్రయత్నించినప్పుడల్లా, ద్వేషమే గెలుస్తుంది. అట్లాగే, ద్వేషాన్ని ద్వేషంతో ఎప్పుడూ తొలగించలేము. న్యాయమైన ఆగ్రహాన్ని, పదిమంది మీద ప్రేమతో పుట్టే ప్రతి ఘటనను కూడా బలప్రయోగంతో అణగార్చలేరు. వ్యక్తి స్వార్థమో, వర్గ, జాతి స్వార్థాలో, ఆక్రమణలో అపహరణలో కొందరిని ఆధిక్యంలోకి అనేకులను అధీనతలోకి నెట్టవచ్చు. దుర్మదంతో ఒకరు దౌర్జన్యం చేయవచ్చు. మరొకరు బక్కకోపం చూపవచ్చు. పరస్పరత కలిగిన సోదరత్వం మిగిలితే, మనుషులకీ తామసాలే అక్కర లేదు! గౌరవప్రదమైన మనుగడ కోసం, కాళ్ల కింద చారెడు నేల కోసం మనిషి పడే తపన, అందుకు అడ్డుపడే అత్యాశలు, వీటి మధ్యే అరిషడ్వర్గాలు! పోరాటాలు యుద్ధాలు సంగ్రామాలు! అప్పుడప్పుడు ఎవరో ఒకరు, ఏదో ఒక సమూహం సంచారిణీ దీపశిఖల్లాగా, లోకం మీదకు లిప్తకాలపు వెలుగులు విసిరి వెళ్లిపోతారు! సృష్టిలో చీకటి సర్వవ్యాపితం, గాఢం, అనంతం అని, వెలుగు మాత్రం స్వల్పం, స్థానికం అంటాడు కార్ల్ సాగన్! .."లోన జ్వలియించుచున్న మహానలమునకొక విస్ఫులింగమె కాద యీ యుత్సవాగ్ని" అంటూ దీపావళిని అంతర్ బహిర్ యుద్ధారావం చేశారు కవి వేదుల.

మనిషి భయాలన్నీ చీకటితోటల్లోనే సంచరిస్తుంటాయి. చీకటంటే భయమున్నవారే చావుకు భయపడతారని స్టీఫెన్ హాకింగ్ అన్న మాట మరింత భయపెడుతుంది. దేవుడనేవాడు పోతన ఊహించినట్టు పెంజీకటికి ఆవల ఉంటాడేమో, మన అపరిచితత్వపు భయాలను పారదోలడానికి ఏదో ఒక శక్తి లేకపోతే ఎట్లా? ఈ మహాసృష్టిలో, అన్ని జీవులకంటె అధికులమనుకునే మనుషులకే దేవుడు! తక్కిన అన్ని చరాచరాలూ అటానమస్! అబద్ధం, అజ్ఞానం, అధికారం, ఆధిక్యం, అహంకారం... చీకటికి ఎన్నో పర్యాయపదాలు, అర్థం మాత్రం ఒకటే.! కార్తీకరాత్రులు దీపాలంకరణకు బాగుంటాయి కానీ, కాలంలోను, స్థలంలోను, మానవహృదయంలోను ప్రమిదలు చీల్చలేని కటికచీకటి రాత్రులు పరచుకుని ఉన్నాయి. పసిపాపల నిదురకనులపై క్షిపణులు, స్ఫటికాకాశాల నిండా ఘాటెక్కిన గంధక ధూమాలు, అడవిసిరుల కోసం కడుపుకోతలు, రుతువులన్నీ చెరిగిపోయే విషవాయు విన్యాసాలు, బుసకొట్టే గోడలు, మృత్యుక్రీడలు... మానవ నిశీథిని నిండా నీలి నీడలు! తానే దీపం కావడం సరే, కనీసం తాను మనిషి కాగలడా? కాగలదా? తానే చీకటి కాకుండా కాపాడుకోగలడా? వెలుగులను ప్రేమించడం వడ్డించిన విస్తరి లాంటి విలాసం కాకుండా కాపాడుకుంటుందా? చీకటి వీక్షణలను గుప్పించి, చీకటినే నిశ్వసించి, వెలుతురు పొరలకు తూట్లు పొడవకుండా ఉండగలదా?

"అప్పో దీపో భవ" అన్నాడు తథాగతుడు. తనతోనే తనను అంటిపెట్టుకుని గడిపిన ఆనందుడికి మరణశయ్య మీద ఇచ్చిన సందేశం అది. అదే ఆయన చివరిమాట కూడా.

> హృదయాలను కపిలవస్తు చేసుకుని, ముస్తాబు చేసుకోవాలి. ఎవరో జ్ఞాని నడచివస్తాడని కాదు. కరిమబ్బు లేని కార్తీక ఆకాశం లాగా మనసును నిర్మలం చేసుకుని మనలోకి మనమే నడిచి రావడం కోసం. శాంతి పూసే వేళన ఆ మాత్రం దీపాలంకరణ చేసుకోవాలి!

నీకు నువ్వే దీపం! 'జ్ఞాన సంబుద్ధికి వేరే మార్గం లేదు, పరాధీనత కుదరదు. నీలోపలి దీపాన్ని నువ్వే కనుగొనాలి! ఈ మాటలకు కోటానుకోట్ల పుటల వ్యాఖ్యానాలు వచ్చాయి. మనిషి చేతన మీద అపారమైన భారం మోపుతున్నట్టు కనిపించే ఈ సందేశం, మనుషుల మధ్య అత్యంత సహజ కరుణను పునరుద్ధరించడం.. అనాయాసపు, అవలీల లక్ష్యం కాదని గుర్తు చేస్తుంది. కోట్ల కాగడాలు వెలిగించినా చెదిరిపోనంత చీకటి లోకాన ఉన్నదంటాడు గుడిపాటి వెంకట చలం.

హృదయాలను కపిలవస్తు చేసుకుని, ముస్తాబు చేసుకోవాలి. ఎవరో జ్ఞాని నడచివస్తాడని కాదు. కరిమబ్బు లేని కార్తీక ఆకాశం లాగా మనసును నిర్మలం చేసుకుని మనలోకి మనమే నడిచి రావడం కోసం. శాంతి పూసే వేళన ఆ మాత్రం దీపాలంకరణ చేసుకోవాలి!

అసత్యం నుంచి సత్యంలోకి, చీకటి నుంచి వెలుగులోకి మృత్యువు నుంచి అమృతత్వంలోకి నడిపించమని వేదకవి కోరుతున్నాడు. బృహదారణ్యక ఉపనిషత్తులోని ఈ సందేశంలోని 'తమసోమా జ్యోతిర్గమయ' అన్న పంక్తి ఆంధ్రజ్యోతికి తొలినాటి నుంచి కరదీపికగా ఉంది. ఎరుకను మించిన వెలుగు లేదు. చీకటిని వెలిగించడంలో అక్షరానికి మించిన జ్యోతి లేదు. ఈ అక్షర కాంతి నిరంతరంగా "ఆంధ్రజ్యోతి" పాఠకులపై వర్షిస్తూనే ఉండాలి!

ఆధార్ లేకపోతే ఆదివాసీలకు విద్యాహక్కు ఉండదా!

దేశ రాజ్యాంగం గురించి ఏ మాత్రం తెలిసినవారికైనా అందులో ప్రాథమిక హక్కులు అనే చాప్టర్ ఒకటి ఉంటుదని; ఆ హక్కులకు భగం కలిగేలా చట్టాలు చేసే అధికారం పార్లమెంట్‌కు లేదా శాసనసభలకు కూడా లేదని; ఈ విషయంలో రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రి.. ఎవరూ ఎలాంటి కార్యనిర్వాహక ఆదేశాలు ఇవ్వలేరని తప్పక తెలుస్తుంది. ఆర్టికల్ 21 జీవించే హక్కుకు, వ్యక్తి స్వేచ్ఛకు హామీ ఇస్తుంది. ఇప్పుడు ఆర్టికల్ 21–A ప్రాథమిక హక్కులలో ఒక భాగం. 6 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సుగల బాలబాలికలకు ఉచితంగా, తప్పనిసరిగా విద్యను బోధించాలని అది చెపుతుంది. ఆ వయస్సు బాలలకు విద్యా హక్కును ప్రాథమిక హక్కుగా రాజ్యాంగం గుర్తిస్తున్నది.

సీదరపు సంగీతకు ఇప్పుడు ఐదు సంవత్సరాలు. తండ్రి లక్కు, తల్లి రోజా. వారిది బర్నగూడ గ్రామం, పట్టుచెన్నూరు పంచాయితీ, సాలూరు మండలం. ఆదివాసీల కోసం అంటూ ఏర్పాటు చేసిన 'మన్యం పార్వతీపురం' జిల్లా వారిది. సంగీత అమ్మ చనిపోయింది. తానిప్పుడు బడికి వెళ్లలేదు. ఎందుకంటే తనకు ఆధార్ కార్డు లేదు. లచ్చన, పార్వతిల బిడ్డ పూనురు శిరీష, కొత్తూరు గ్రామం, సాలూరు మండలం, అదే మన్యం జిల్లా. ఉప్మా బడి అని పిలిచే అంగన్‌వాడికి శిరీష వెళ్ళలేదు. ఎందుకంటే తనకూ ఆధార్ లేదు. కొండగొర్రె స్పందనది మరో చిత్రమైన కేసు. తాను పార్వతీపురం బాలికల జూనియర్ కాలేజీలో చేరింది. అయితే కాలేజీ యాజమాన్యం ఆమె పదవ తరగతి సర్టిఫికెట్‌లోను, ఆధార్‌లోను పుట్టిన తేదీల మధ్య కొన్ని నెలల తేడా ఉన్నట్లు గుర్తించి అది సరి చేసుకు రమ్మని పంపేసారు. ఆమె తల్లిని తీసుకొని ఆధార్ సెంటర్‌కు వెళ్ళింది. ఆధార్‌లో మార్పుచేయాలంటే జనన ధ్రువపత్రం కావాలని అన్నారు. అందులో ఐదు నెలల తేడా వుంది. కనుక సరిచేయడం కుదరదు. సంగీత చదువు సాగాలంటే ముందు జనన ధ్రువపత్రంలో పుట్టిన తేదీ మారాలి, తరువాత పదవ తరగతి సర్టిఫికెట్‌లో మారాలి, ఆ తర్వాత ఆధార్‌లో మారాలి. ఈ మార్పులు ఎప్పటికి పూర్తి అవుతాయో తెలీదు. వీరందరూ ఆదివాసీ బిడ్డలు. బిడ్డ పుట్టినప్పుడు తిథి, వార, రాశి, గోత్రాలు చూసుకొని, రాసుకొనే సమాజం కాదు వారిది.

రాజగారి ఏడు చేపల కథలాగా– ఈ ఆదివాసీ పిల్లలకు ఆధార్ ఎందుకు లేదని విచారిస్తే తెలిసిన విషయం– వీరి తల్లులు బిడ్డలను ఇంటి వద్దనే కన్నారట. అంటే ఆసుపత్రికి రాలేదు. అక్కడికి ఎందుకు రాలేదంటే వారికి రహదారి లేదు. ఆసుపత్రిలో పురుడు కాలేదు గనుక వారు జనన ధ్రువపత్రం ఇవ్వరట. సదరు ధ్రువపత్రం లేదు గనుక ఆధార్ నమోదు అవ్వదట. ఆధార్ లేదు గనుక వారికి బడిలో, అంగన్‌వాడిలో ప్రవేశం లేదు. ఫలితంగా ఆర్టికల్ 21ఎ వారికి రద్దు చేయబడింది. ఒక్క ఆధార్ కార్డు ముక్క రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులపై పైచేయి సాధించింది.



రాజగారి ఏడు చేపల కథలాగా– ఈ ఆదివాసీ పిల్లలకు ఆధార్ ఎందుకు లేదని విచారిస్తే తెలిసిన విషయం– వీరి తల్లులు బిడ్డలను ఇంటి వద్దనే కన్నారట. అంటే ఆసుపత్రికి రాలేదు. అక్కడికి ఎందుకు రాలేదంటే వారికి రహదారి లేదు. ఆసుపత్రిలో పురుడు కాలేదు గనుక వారు జనన ధ్రువపత్రం ఇవ్వరట. సదరు ధ్రువపత్రం లేదు గనుక ఆధార్ నమోదు అవ్వదట. ఆధార్ లేదు గనుక వారికి బడిలో, అంగన్‌వాడిలో ప్రవేశం లేదు. ఫలితంగా ఆర్టికల్ 21ఎ వారికి రద్దు చేయబడింది. ఒక్క ఆధార్ కార్డు ముక్క రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులపై పైచేయి సాధించింది.

చింతల దేవిది మరో చిత్రమైన సమస్య. ఆ బాలిక ఆసుప్రతిలోనే జన్మించింది. అయినా ఆధార్ కార్డు లేదు. ఎందుకంటే ఆసుపత్రి నుండి గడువు లోగా ధ్రువపత్రం తీసుకోలేదు గనుక ఇప్పుడు ఇవ్వరట. జనన ధ్రువపత్రం లేదు గనుక ఆధార్ లేదు. ఆధార్ లేని వారిని రాజ్యాంగమే కాదు దేవుడు కూడా కాపాడలేడు. దేవి అమ్మానాన్నలైన తవుడు, కొత్తమ్మలకు అలా ధ్రువపత్రం వెంటనే తీసుకోవాలని తెలీదు. దాని అవసరం ఒకటి ఉంటుందని కూడా తెలీదు. వారిది పత్రాల సమాజం కాదు, ఆదివాసీ మాట సమాజం.

అసలు సమస్య వేరే ఉంది. ఆసుపత్రిలోనే పురుడు పోసుకోవాలని, జననం జరిగిన వెంటనే ధ్రువపత్రం తీసుకోవాలని, ఆధార్ లేకపోతే బడిలోనూ, అంగన్‌వాడిలోనూ ప్రవేశం లేదన్న నియమాలు ఎవరిని ఉద్దేశించి చేశారు? మైదాన ప్రాంత ప్రజలను దృష్టిలో పెట్టుకొని చేశారు. అవే నియమాలను, యథాతథంగా ఆదివాసీ ప్రాంతలకు అన్వయించారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు, రాజ్యాంగం అమలులోకి వచ్చి 74ఏళ్ళు కావస్తున్నా రహదారులు లేని కొండ ప్రాంతాలు, ఆదివాసీ ఆవాస గ్రామాలు వందల సంఖ్యలో ఉన్నాయి. మరి ఆసుపత్రిలో ప్రసవం జరగలేదని మీరు ఎవరిని శిక్షిస్తున్నారు? ఒకవేళ ఆసుపత్రిలో కాన్పు జరిగినా గడువులోగా జనన ధ్రువపత్రం తీసుకోలేదని ఆదివాసీ బిడ్డలను శిక్షించే అధికారం మీకు ఎవరు ఇచ్చారు? నోటరీ అఫిడవిట్ తెస్తే తప్ప ధ్రువపత్రం ఇవ్వమని ఇప్పుడు చెపుతున్నారు. ఆ నోటరీ ఎక్కడ ఉంటాడో, అందుకు ఎంత ఖర్చు అవుతుందో ఆదివాసీ అమ్మా నాన్నలకు తెలుస్తుందా?

సాధారణ ప్రాంతాలకు ఉద్దేశించిన నియమాలను, విధానాలను, ఉత్తర్వులను, చట్టాలను (పార్లమెంట్ లేదా శాసనసభలు చేసే చట్టాలను) ఏజెన్సీ ప్రాంతాలకు వర్తింపజేసే సమయంలో, ఆదివాసీ ప్రాంతాల ప్రజల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకొని, వాటిలో మార్పు చేసే, లేదా వాటి అమలును పాక్షికంగా లేదా పూర్తిగా నిలిపివేసే విశేషమైన అధికారాలను రాజ్యాంగం 5వ షెడ్యూల్ రాష్ట్ర గవర్నర్‌లకు ఇచ్చింది. అందుకే 5వ షెడ్యూల్‌ను బి.డి.శర్మ రాజ్యాంగంలో రాజ్యాంగం అన్నారు. ఇంతటి శక్తివంతమైన రాజ్యాంగ హక్కు ఆదివాసీలకు ఉన్నప్పుడు, మైదాన ప్రాంతాల కోసం రూపొందించిన జనన, మరణ ధ్రువపత్రాల మంజూరీ నియమాలను నేరుగా ఆదివాసీ ప్రాంతాలకు ఎలా అన్వయిస్తారు? ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకే లేనప్పుడు, ఆధార్ కార్డు లేదని విద్యా హక్కును అడ్డుకొనే అధికారం ఎవరు ఇచ్చారు? గత ఏడాది సెప్టెంబర్‌లో, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ 22 మండలాల్లో సర్వే చేయిస్తే 12,470 మంది బాలబాలికలకు జనన ధ్రువపత్రాలు లేవని తేలింది. తూర్పు కనుమలతో నిండిన ఈ జిల్లాలో నిజానికి ఇది లెక్కకు రాని చాలా తక్కువ సంఖ్య. కలెక్టర్ సర్క్యులర్ ఇస్తూ– ఆదివాసీల నుండి నోటరీ ధ్రువపత్రం అడగవద్దని ఆదేశాలు ఇచ్చారు. ఈ నెల 22న అదే జిల్లా కలెక్టర్ అలాంటిదే మరొక అర్జెంట్ ఉత్తర్వు ఇచ్చారు. ఈ లోగా విద్యా సంవత్సరంలో ఐదు నెలలు గడిచిపోయింది. ఈ ఉత్తర్వులు సమస్యకు పూర్తి పరిష్కారం కాదు. ఆదివాసీలకు అనుగుణంగా జనన/ మరణ ధ్రువపత్రాల మంజూరు నిబంధనలను మార్చాలి. ఇందుకు గిరిజన సంక్షేమ శాఖ చొరవ తీసుకోవాలి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన సంక్షేమశాఖ దేశంలో ఒక పటిష్టమైన, ఆదర్శవంతమైన మంత్రిత్వ శాఖగా ఉండేది. ఎస్.ఆర్. శంకరన్, ఇ.ఎ.ఎస్. శర్మ, బి.ఎన్. యుగంధర్ వంటి ఎందరో అధికారులు ఆదివాసీల హక్కులను కాపాడేందుకు అవసరమైతే ముఖ్యమంత్రులతో సైతం తలపడేవారు. పాలకులకు రాజ్యాంగాన్ని గుర్తు చేసేవారు. ఆదివాసీ ప్రాంతాలు లేదా 5వ షెడ్యూల్ ప్రాంతాలు అనే ఒక ప్రత్యేకమైన రాజ్యాంగ ప్రాంతం ఒకటి ఉందని పాలన వ్యవస్థ మరచిపోవడం మొదలుపెట్టి చాలా కాలం అయ్యింది. 1995లో డాక్టర్ బి.డి. శర్మ "ఆదివాసీ ప్రాంతాలు కనుమరుగు కానున్నాయా?" (Whither Tribal Areas?) అనే పుస్తకం రాశారు. ఆదివాసీ ప్రాంతాలు ఉన్నాయనే విషయాన్ని పాలకులు ఎలా మార్చిపోతున్నదీ ఆయన వివరించారు. ఈ మతిమరుపు జబ్బును ఎలా వదిలించాలన్నది నేడు ఆదివాసీ సమాజం ముందు ఉన్న పెద్ద సవాలు.

▪ పి.ఎస్. అజయ్‌కుమార్

బారక్‌పూర్‌లో రగిలిన స్వాతంత్ర్యాగ్ని

ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే అంటే 1824లోనే మన దేశంలో సిపాయిల తిరుగుబాటుకు బీజం పడింది. బ్రిటిష్ అధికారులకు వ్యతిరేకంగా భారతీయ సైనికులు చేసిన తిరుగుబాటు ఇది. ఈస్టిండియా కంపెనీ సైన్యం మొదటి ఆంగ్లో బర్మా యుద్ధంలో పోరాడుతున్నప్పుడు ఇది జరిగింది. ఈ తిరుగుబాటులో 180 మంది సిపాయిలు వీరమరణం పొందారు. 12 మందిని బ్రిటిష్ అధికారులు ఉరి తీశారు. ఆంగ్లేయులకు ఎదురు తిరిగి అసువులు బాసిన వారి త్యాగం నిరుపమానమైనది. రెండు శతాబ్దాల తర్వాత కూడ నాటి వీరులను స్మరించుకొని అంజలి ఘటించాల్సి ఉంది. వారి రుణం మనం తీర్చుకోలేనిది.



మొదటి ఆంగ్లో–బర్మా యుద్ధ సమయంలో 1824 అక్టోబరులో బర్మా భూభాగంలోకి ప్రవేశించడం కోసం బెంగాల్ స్థానిక పదాతిదళానికి చెందిన మూడు రెజిమెంట్ల సైనికులను 800 కి.మీ. దూరం కవాతు చేయాలని బ్రిటిష్ అధికారులు ఆదేశించారు. ఈ రెజిమెంట్లు అప్పటికే దాదాపు 1600 కి.మీ. కవాతు చేసుకొంటూ మధుర నుండి కోల్‌కత సమీపంలోని మిలటరీ కంటోన్మెంట్ అయిన బారక్‌పూర్ వరకు వచ్చాయి. అక్కడి నుండి తిరిగి మరల చిట్టగాంగ్ వరకు కవాతు చేయాలని ఆదేశించడంతో సిపాయిలు ఎదురు తిరిగారు. (పైగా ఈ రెజిమెంట్లలో ఎక్కువగా హిందూ సైనికులు ఉన్నారు.) సముద్ర ప్రయాణం పట్ల కూడ వారికి అభ్యంతరాలు ఉన్నాయి. అప్పటికే అలసిపోయిన సైనికులు, ఎడ్లు కూడ లేకపోవడం వల్ల తమ సామానును తామే మోసుకొని తిరిగి బయలుదేరడానికి నిరాకరించారు. వీరి అభ్యంతరాలను పట్టించుకోకుండా కంపెనీ వారు తమ సంచులను వీపు మీద మోసుకెళ్ళాలని ఆదేశించడంతో వారిలో అసహనం పెరిగిపోయింది.

1824 నవంబర్ 1న కవాతు మొదలు పెట్టాలని అధికారులు ఆదేశించారు. తమకు ఎడ్లను సమకూర్చాలని లేదా రెట్టింపు బత్తా చెల్లించాలని సిపాయిలు డిమాండ్ చేశారు. దానికి నిరాకరించిన బ్రిటిష్ అధికారి ఎడ్వర్డ్ పాగెట్ సైనికులు తమ ఆయుధాలను వదిలేయాలని కోరారు. అందుకు సైనికులు ఒప్పుకోకపోవడంతో ఆయన యూరోపియన్ దళాలకు చెందిన రెజిమెంట్లను, ఫిరంగులను రప్పించాడు. నవంబరు 2వ తేదీన వెనుక నుండి తిరుగుబాటుదారులపై కాల్పులకు తెగబడ్డారు. ఆంగ్లేయ అధికారులు ఆకస్మికంగా జరిపిన కాల్పులలో సిపాయిలు, పౌరులు... మొత్తం 180 మంది అసువులు బాసారు. తదనంతర పరిణామాలలో తిరుగుబాటు నాయకులైన అనేకమందిని ఉరి తీశారు. ఈ విధంగా ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వం దమన నీతిని ప్రదర్శించింది.

బిందీ తివారీ నాయకత్వంలో జరిగిన ఈ 'బారక్‌పూర్ తిరుగుబాటు' చరిత్రాత్మకమయినది. నవంబర్ 9న బిందీ తివారీని అరెస్ట్ చేసి, మరుసటి రోజు ఉరితీసి ఆయన శరీరాన్ని బహిరంగంగా గొలుసులతో వేలాడదీశారు. ఈ విషయం బయటికి పొక్కకుండా మీడియాలో వార్తలు రాకుండ వలసప్రభుత్వం జాగ్రత్తలు తీసుకొంది. కానీ ఇది జరిగిన 6 నెలల తర్వాత లండన్‌లోని 'ఓరియంటల్ హెరాల్డ్' ఒక కథనం ప్రచురించి, బ్రిటిష్ అధికారుల దమననీతిని తీవ్రంగా ఖండించింది. బిందీ తివారీ భారతీయ సైనికులకు ఒక ఆరాధ్య దైవం అయ్యాడు. ఆరు నెలల తర్వాత ఆయన్ను, ఉరితీసిన ప్రాంతంలో సైనికులు, స్థానికులు కలిసి ఒక ఆలయాన్ని నిర్మించారు. అది 'బిందిబాబా దేవాలయం'గా ప్రసిద్ధి పొందింది.

ఈ బారక్‌పూర్ తిరుగుబాటు జరిగిన 33 సంవత్సరాల తర్వాత 1857 మార్చి 29న ఇదే బారక్‌పూర్ కంటోన్మెంట్‌లో సిపాయి మంగళ్‌పాండే నాయకత్వంలో మరో తిరుగుబాటు మొదలైంది. అదే ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంగా ఖ్యాతికెక్కింది. 1857లో బ్రిటిష్ అధికారులను భారతీయ సిపాయిలు హతమార్చ దానికి బారక్‌పూర్ తిరుగుబాటే వారికి ప్రేరణ ఇచ్చింది.

• డా. పి.సి.సాయిబాబు

(నవంబరు 2: బారక్‌పూర్ తిరుగుబాటుకు రెండు శతాబ్దాలు)

'స్వర్ణకాంతులు – దివ్యదీపాలు!'

'స్వర్ణభారత' మంటప ద్వారాలకు చక్కగా –
జాతీయతా దీపాల తోరణాలు కట్టండి!
హరితకాంతులొలుకు సౌభాగ్య దీపాలను –
ఇంటింటా – పసిడిగుమ్మాలపై తీర్చండి!

ఆసేతుహిమాచలం దివ్యంగా ప్రజల –
గుండెల్లో వెలిగే దీపాలు – సమతామమతగీతాలు!
దేశమాత ముంగిట ధీరంగా వెలిగే దీపాలు –
భారత వీరజవానుని శౌర్యవిజయ ధ్వజాలు

పంట పొలాల్లో తలలూపే – సస్యశ్యామల దీపాలు –
అన్నదాతల – కష్టజీవుల – స్వర్ణశుభోదయరేఖలు
పల్లెపల్లెల్లో తళతళలాడే – సంస్కృతీదీపాలు –
ఆత్మీయడా – సౌహార్ద్రతా క్షీరతరంగాలు

యువజనుల హృదయాల్లో వెలిగేదీపాలు –
భావిభారత భాగ్యోదయ విజయాశీస్సులు
పసిడి బాలల లేతమనస్సుల్లో వెలిగే దీపాలు –
పూలతోటలో తిరుగాడే – బాలబాహుజీలు

స్వాతంత్ర్యవజ్రభారతి – ముంగిట వెలిగే దీపాలు –
సువర్ణ సుప్రభాత – జనగణమన విజయకిరణాలు
దేవాలయ ప్రాంగణాల్లో వెలిగే – సువర్ణ దీపాలు –
"సర్వేజనాః సుఖినోభవంతి" – అనే దివ్యాశీస్సుమాలు

– కళ్యాణశ్రీ



వెలుగులు విరజిమ్ముతూ...

నిజమే
లక్ష్మీబాంబులా
పేలుతుందనుకున్నపుడల్లా
తుస్సుమంటూ ఆరిపోతుంది

సీమటపాకాయల్లా
చిటపటలాడుతూ గొలుసుకట్టుగా
పేలుతుందనుకున్నపుడు
తుస్సు తుస్సుమంటూ
టప్ టప్ మంటూ
చిట్లిపోయి మధ్యలోనే తెగిపోతుంది

మతాబులా వెలగాలనో
పెన్సిల్లా మెరవాలనో
తలపోసినపుడల్లా
వెలిగినట్టే వెలిగి
ఆరిపోయిన కాకరపువ్వొత్తిలా
పడివుండటమూ సర్వసాధారణమే
అస్తిత్వం భూచక్రంలా
తన చుట్టూ తాను తిరిగి తిరిగి
ఉన్నచోటే ఆరిపోయి ఆగిపోవటమూ
మామూలే

బతికుండే క్షణాలన్నీ
పాంబిళ్లలా బుసకొట్టీ బుసకొట్టీ
బూడిదవటమూ తప్పని పరిస్థితే

సమస్యలు చిచ్చుబుడ్లయి
చిరచిరలాడినా
జీవించే క్షణాలతోనే
లోపలి ముఖాల్ని వెలిగించుకోవాలి

జీవితమెప్పుడూ
లక్ష్మీబాంబులానే పేలదు
చాలాసార్లు
తుస్సు తుస్సుమంటూనే
ఆరిపోవచ్చు



అయినా
తారాజువ్వలా
వెలుగులు విరజిమ్ముతూ
చీకటి నింగికెగరాల్సిందే
అనేక అమావాస్యల తరువాత
ఒక దీపావళి తప్పక వస్తుందని
నమ్మి తీరాల్సిందే

– చిత్తలూరి

నిత్యదీపావళి

సీ. శాంతికి నెలవౌచు సర్వంసహాస్థలి
అలరారుచుండు గదా మతాబు
ఉప్పరమంటెడు ఊహలకిరవౌచు
తనియుచుండును గదా తారజువ్వ
అల్లరిపిల్లలకద్దంబు తానౌచు
తనరారుచుండు గదా సిసింద్రి
గమ్యము చేరని కాంక్షలకుద్దియై
చిందులాడును గదా చిచ్చుబుడ్డి
గీ. వెలయు కాకరపువ్వులు వెన్నముద్ద
ప్రిదిలి ప్రేలుటపాసులు ముదమొసంగు
నట్టి భూచక్రములు వీథులందునిండ్ల
యందు దీపావళిని కనువిందుచేయు
గీ. చెడునశించి ధర్మము విలసిల్లుకతన
వసుధ దీపావళినిలిచె పర్వముగను
జాగృతికిది మూలంబగు జాతికెపుడు
కాలమేదైన ధర్మంబు కాచు కడకు
గీ. హృదయమొకటి ప్రమిదకాగ ఎలమి ఆశ
యమ్ము వత్తికాగ ధృతి తైలమ్ము కాగ
లక్ష్యమూపైని దీపమై రమ్యకాంతి
తోడ రాజిల్లు జీవనోద్యోగమందు
గీ. అబల ఆ–సత్యభామయి అలరుచుండ
పురుషుడా కృష్ణుడై పెనుపొందుచుండ
నరకులుందురే? ధరయెల్ల నాకమగును
సత్య నిత్యదీపావళి సందడించు

– మంకు శ్రీను

ఇరులబాధల పోద్రోలి..

సీ. దీపకాంత వెల్గు దేదీప్యమానమై
చీకట్ల వెతలను చెరిగివేయ!
వరలక్ష్మి వ్రతదీక్ష వరమిచ్చెనోయిన
సతిపతిసఖ్యత్ సందడింప!
నరకంపు భయదంపు నరకుడు వెడలగా
జననాడి దెల్పెడి శబ్దతతులు!
వడగళ్ళు–వరదల్లు వ్యథలెన్నొ సల్పినా
ధీజనధీరతా తేజసదులు!
తే. నేటి దీపావళీదెచ్చెనిట్టిసిరులు
ఆంధ్రసీమకు కొంగ్రొత్త భాగ్యమీయ
ఇరులబాధల పోద్రోలి తరగనట్టి
సౌఖ్యవెలుగులు నింపగనాఖ్యఫణితి!

– మోదుకూరు రాధాకృష్ణశర్మ

రాకెట్లమంటల సాక్షిగా

నీ అపజయాల/ జ్ఞాపకతీరాల నిశీథిని
అలుపెరగని నీ ప్రయత్నాల
క్రాకర్స్ వెలుగులో మాయం చెయ్..!
అంతరిక్ష హద్దులను చెరిపేస్తూ
దీపావళి రాకెట్లమంటల సాక్షిగా
నీ కలలకు జ్ఞాన శిఖరంపై ప్రాణం పోయ్..!
నిరాశ, నిస్పృహల శూన్యాన్ని
లక్ష్మి బాంబుల ధ్వని వర్షంతో తడిపేసేయ్..!
చిచ్చుబుడ్ల కిరణాలతో అంతులేని
మానవత్వపు ఆనందాన్ని అందరికీ పంచెయ్..!
ఈ పండుగ దినం నుండైనా..
పర్యావరణ పరిరక్షణపై అడుగువేయ్..!
చెట్లే సంరక్షణే మానవజాతి చరిత్రకు
సాక్ష్యమనే పాఠాన్ని అమలుచేయ్..!!

– ఫిజిక్స్ అరుణ్ కుమార్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

భూమి భారాన్నంతా మోసే భూదేవి దీపం వేడిని భరించలేదట! అందుకే నేల మీద దీపాన్ని నేరుగా పెట్టకూడదు. వేడి నేలకు తగలకూడదు. ప్రమిదను మరో ప్రమిదలో పెట్టి దీపాన్ని వెలిగించడంలో ఆంతర్యం అదే.



మానవుడి జీవితం చీకటి వెలుగుల సమాహారం. చీకటి- దుఖానికి, అజ్ఞానానికి.. వెలుగు ఉత్సాహానికి, జ్ఞానానికి ప్రతీకలుగా భావిస్తారు. చీకటిని పారద్రోలి వెలుగు వైపు పయనించే పండుగ కాబట్టే దీపావళికి భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్లో అంతటి ప్రాముఖ్యం ఏర్పడింది. దీపావళి వేడుకలు వేదకాలం నుంచీ ఉన్నాయి. వీటి గురించి రామాయణ, భారత, భాగవతాలలో ప్రస్తావన ఉంది.

జీవితమే దీపావళి



జగద్గురువైన ఆదిశంకరులు షణ్మత స్థాపన చేసి, పంచాయత పూజా విధానాన్ని ఏర్పాటు చేసినప్పుడు... స్కంధుడికి ప్రతీకగా దీపారాధనను ఏర్పాటు చేశారు. అందుకే ఏ శుభకార్యం ప్రారంభించినా... ముందుగా దీపారాధన చేస్తారు. దీపం అగ్నికి సంకేతం. కార్యాలను నిరోధించడానికి ప్రయత్నించే ప్రతికూల శక్తులను పారద్రోలాలనేది దీపారాధనలోని ఆంతర్యం. అంతే కాదు. సృష్టి, స్థితి, లయలకు దీపంతో సంబంధం ఉంది. దీపంలో కనిపించే నీలం, తెలుపు, ఎరుపు రంగులు త్రిమూర్తులకు ప్రతీకలనీ, అదే విధంగా విద్య, శక్తి, ఐశ్వ ర్యాలను ప్రసాదించే సరస్వతి, దుర్గ, మహాలక్ష్మి.. దీపకాంతిలో కొలువై ఉన్నారనేది నమ్మకం. అందుకే దీప దర్శనం సకల పాపాలనూ పోగొడుతుందని అనేక మంది భావిస్తారు. ఆ దీపానికి పూజలు చేస్తారు.

రాత్రి దీపాల ప్రాముఖ్యం

ప్రతి రోజుకూ రెండు సంధ్యలు ఉంటాయి. చంద్రుడు వెళ్లిపోయి.. సూర్యుడు ఉదయించటానికి మధ్య ఉండే సంధ్యను- 'ప్రాతఃసంధ్య' లేదా 'ఉదయ సంధ్య' అంటారు. సూర్యుడు అస్తమించి.. చంద్రోదయం నడుమ ఉండే సంధ్యను 'సాయం సంధ్య' అంటారు. ఉదయ సంధ్యా సమయంలో ఇంట్లో ఉన్న భగవంతుడి ముందు దీపాన్ని వెలిగించి ఆరాధిస్తారు. సాయంత్రం వేళల్లో సూర్యుడు అస్తమిస్తూ తన శక్తిని దీపంలో నిక్షేపించి వెళ్తాడు కాబట్టి ఆ దీపానికి నమస్కరిస్తారు. మన శాస్త్రాల ప్రకారం ఈ రెండింటివల్ల కలిగే పుణ్యం ఒకటే!

మహాలక్ష్మీ స్వరూపం

దీపం ఐశ్వర్యం అయితే అంధకారం దారిద్ర్యం. దీపం ఉన్న చోట సంపద ఉంటుంది. అందుకే దీపాన్ని మహాలక్ష్మీ స్వరూపంగా కొలుస్తారు. లక్ష్మీ దేవి సకలైశ్వర్యప్రదాయని కాబట్టి- 'దీప లక్ష్మీ నమోస్తుతే' అంటూ దీపాన్ని మహాలక్ష్మీ స్వరూపంగా భావించి పూజలు చేస్తారు. దీపంలో కనిపించే ఎర్రని కాంతి సృష్టికర్త అయిన బ్రహ్మకూ, నీలి కాంతి విష్ణుమూర్తికీ, తెల్లని కాంతి పరమ శివుడికీ ప్రతీకలుగా భావిస్తారు.

కర్టెన్లతో కనువిందుగా...

ఇంటి అందాన్ని ద్విగుణీకృతం చేయడంలో డోర్ కర్టెన్లు ముందుంటాయి. ఎండ, దుమ్ము, ధూళి నుంచి ఇంటిని కాపాడతాయి. ప్రతి ఒక్కరూ వారి అభిరుచి ప్రకారం గుమ్మానికి, కిటికీలకు రంగు రంగుల కర్టెన్లు వేస్తుంటారు. కర్టెన్ రంగుల ఎంపికలో కూడా వాస్తు నియమాలు ఉన్నాయని చాలామందికి

స్మార్ట్ హోమ్



తెలియదు. ఇంటి సభ్యులు ధన ధాన్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలంటే ఏ దిశలో ఏ రంగు కర్టెన్ వేయాలో తెలుసుకుందాం!

- కుటుంబ సభ్యుల మధ్య ప్రేమాభిమానాలు పెరగాలంటే దక్షిణం వైపున్న గదులకు ఎరుపు రంగు కర్టెన్లు వేయాలి.
- పడమర, వాయువ్యం దిశల వైపున్న గదులకు, కిటికీలకు తెల్లని చిన్న ప్రింట్లు ఉన్న కర్టెన్లు వేస్తే ఆ ఇంట్లో ఉండేవారి శ్రమకు తగ్గ ఫలితం దక్కుతుంది. ఇల్లు ప్రకాశవంతంగా కూడా ఉంటుంది.
- పడకగదికి నారింజ, గులాబీ, నీలం, క్రీమ్ కలర్ కర్టెన్లు లేదంటే ఏవైనా లేత రంగులవి వేస్తే మనసు ప్రశాంతంగా ఉంటుంది. బంధం బలపడుతుంది.
- వాస్తు ప్రకారం ఆకుపచ్చ రంగు అత్యంత శుభప్రదమైంది. ఇంటి గుమ్మానికి, తూర్పువైపున్న గదులకు, స్టడీ రూమ్‌కు ఆకుపచ్చని కర్టెన్లు వేస్తే చేపట్టిన ప్రతి పనిలో విజయం లభిస్తుంది. ఇంట్లో పాజిటివ్ ఎనర్జీ, చదువుకునే పిల్లలకు ఏకాగ్రత పెరుగుతాయి.
- ఉత్తరం దిశలో ఉన్న గుమ్మానికి, లివింగ్ రూమ్‌కు నీలి రంగు కర్టెన్లు వేస్తే ఇంటి సభ్యుల కలలు నెరవేరుతాయి. అప్పుల బాధ తొలగిపోతుంది.
- పూజగదికి పసుపు రంగు కర్టెన్ వేయాలి. ఈ రంగు ఇంటి సభ్యుల్లో సహనం, జ్ఞానం, ఆధ్యాత్మిక భావనలను కలిగిస్తుంది.

అంతర్గతంగా ప్రకాశించాలి

మన ప్రాచీన సంప్రదాయాలు, సంస్కృతి ఎంతో జ్ఞానాన్ని, వివేకాన్ని ప్రతిబింబిస్తాయి. దీపావళి పండుగ అనంతరం ప్రారంభమయ్యే కార్తీక మాసమంతా... ప్రజలు తమ ఇళ్లను దీపాలతో అలంకరిస్తారు. అంతర్గతంగా మనలోని చీకటిని తొలగించుకోవడానికి జ్ఞానమనే దీపం కావాలని ఇది సూచిస్తుంది.

విశేషం



ప్రపంచంలోని చీకటిని ఒక్కరే తొలగించలేరు. ఈ చీకటిని పారద్రోలేందుకు, ప్రతి ఒక్కరూ తమ లోపలి నుంచి ప్రకాశించాలి. తమలోని అంతర్గత కాంతిని ఇతరులతో పంచుకోవాలి.

రావణ వధ అనంతరం శ్రీరాముడు అయోధ్యకు, స్వదేశానికి తిరిగివచ్చినందుకు గుర్తుగా దీపావళి జరుపుకుంటారు. అంతేకాదు, మరొక రాక్షస రాజు నరకాసురుని మరణాన్ని కూడా దీపావళి పండుగ సూచిస్తుంది. అతనితో ముడిపడిన అందమైన కథ ఒక ఒకటి ఉంది.

శ్రీ కృష్ణుని చేతిలో ఓడిపోయి చనిపోబోతుండగా, జీవితాంతమూ తాను చేసిన పాపాలు గుర్తుకువచ్చి నరకాసురునికి పశ్చాత్తాపం కలిగింది. అప్పుడతడు, తాను జీవించినంత కాలమూ అష్టకష్టాలూ అనుభవించిన ప్రజలు, తాను చనిపోతున్నందుకు గుర్తుగా దీపాలు వెలిగించి ఆనందంగా గడపాలని శ్రీకృష్ణుడిని కోరుకున్నాడు. కృష్ణుడు అనుగ్రహించాడు. ఆ విధంగా శ్రీకృష్ణుని వరం వలన నరక చతుర్దశి పండుగరోజు అయింది.

నరకాసురుడు పదహారు వేలమంది స్త్రీలను తన వద్ద బందీలుగా ఉంచుకున్నాడు. అతని మరణానంతరం వారందరికీ దిక్కు తోచక ప్రాణత్యాగానికి నిశ్చయించుకున్నారు. తమ ఇంటిపేరు ఇప్పుడు నరకాసురుడితో ముడిపడి ఉన్నందున, తాము పుట్టినింటికి తిరిగివెళ్లినా ప్రజలు ఆదరించరని, తమపై రాళ్లు రువ్వుతారని, కాబట్టి చనిపోవడమే మేలని వారు రోదించారు. అపుడు శ్రీకృష్ణుడు వారిని ఓదార్చి, 'ఆనాటి నుంచి మిమ్మల్ని నా భార్యలుగా స్వీకరిస్తున్నాను. మీరు నన్ను మీ భర్తగా చెప్పుకోండి. ఆ విధంగా నా ఇంటి పేరు మీకు వస్తుంది. మీరు సురక్షితంగా ఉంటారు' అని చెప్పాడు. అలా నరకాసురుడి రాణులంతా గోపికలుగా మారి శ్రీకృష్ణుని మహిమలను గానం చేస్తూ జీవించారు.

దీపావళి అంటే కేవలం దీపాలు వెలిగించడం మాత్రమే కాదు, దానిలో అంతకు మించిన అర్థం ఉంది. బుద్ధ భగవానుడు చెప్పినట్లుగా, 'మీకు మీరే వెలుగుగా ఉండండి. మనలో ప్రతి ఒక్కరమూ ఒక దీపం మాత్రమే వెలిగిస్తే సరిపోదు. ప్రపంచంలోని చీకటిని ఒక్కరే తొలగించలేరు. ఈ చీకటిని పారద్రోలేందుకు, ప్రతి ఒక్కరూ తమ లోపలి నుంచి ప్రకాశించాలి. తమలోని అంతర్గత కాంతిని ఇతరులతో పంచుకోవాలి. మీరే ప్రకాశం, వెలుగు అని గుర్తించడమే దీపావళి యొక్క సారాంశం. అందుకే బుద్ధుడు సంఘాన్ని సృజించాడు. దాని ద్వారా అనేక మనస్సులు జ్ఞానంతో వెలిగిపోతాయి. ఎక్కువమంది ప్రజలు జ్ఞానంలోకి మేల్కొన్నప్పుడు, మనం సంతోషకరమైన, దివ్యమైన సమాజాన్ని సృష్టించగలుగుతాము. దాని కోసం మనం ప్రపంచంలోని నలుమూలలకూ జ్ఞానాన్ని వ్యాపింపజేయాలి.

జీవితంలో మనం వివిధ రకాల వ్యక్తులతో సంభాషిస్తాము. కొందరితో మనం కలిసిపోతాం, మరికొందరితో కలవము. కొందరు మీకు వ్యతిరేకంగా మారవచ్చు. లేదా మీరే వారికి వ్యతిరేకంగా మారవచ్చు. ఏదేమైనా, చివరికి మీరు వారిని ఇష్టపడకపోవచ్చు. ఈ విధంగా మనస్సు రాగద్వేషాలలో చిక్కుకుపోతుంది. అందుకే ఈనాటికీ చాలా గ్రామాల్లో, అందరికీ, బద్ధ శత్రువులకు కూడా ఈ రోజున మిఠాయిలు పంచే సంప్రదాయం ఉండటం మీరు చూడవచ్చు. కాబట్టి మీరు ఎవరినైనా మీ శత్రువుగా, లేదా మీకు నచ్చని వ్యక్తి అని భావిస్తే, వారితో మీరు మిఠాయిలు పంచుకున్నప్పుడు, మీరు వారిని కలిసినప్పుడు, ఆ చేదు భావన కరిగిపోతుంది. హృదయం మృదువుగా మారుతుంది. మనస్సు.. ప్రేమ, సానుకూలత, వేడుకలతో నిండిపోతుంది. దీపావళి అంటే మనకు గతంలో ఇతరులపై కలిగిన బాధను, కోపాన్ని, ద్వేషాన్ని సమష్టిగా విడిచిపెట్టి, చీకటి నుంచి వెలుగులోకి వెళ్లడం.

జ్ఞానంలో లేని వారికి సంవత్సరానికి ఒక్కరోజే దీపావళి. కానీ జ్ఞానులకు ప్రతి క్షణమూ, ప్రతి రోజూ దీపావళి. ఏ వేడుకైనా సేవా స్ఫూర్తి లేకుంటే అసంపూర్ణంగా ఉంటుంది. భగవంతుడి నుంచి మనకు లభించిన వాటన్నిటినీ ఇతరులతో పంచుకోవాలి. అదే నిజమైన వేడుక. వేడుక అంటే అన్ని భేదాలను తొలగించుకుని, ఆత్మానందంలో మునిగి తేలడం. ఈ జ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకుని, మానవాళికి సేవ చేయడానికి సంకల్పాన్ని తీసుకుంటూ ఈ దీపావళిని జరుపుకోండి.

మీ హృదయంలో ప్రేమ దీపాన్ని, మీ ఇంటిలో సమృద్ధి అనే దీపాన్ని, ఇతరులకు సేవ చేసేందుకు కరుణ అనే దీపాన్ని, అజ్ఞానపు చీకటిని పారద్రోలడానికి జ్ఞాన దీపాన్ని వెలిగించండి.



- గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్


నవ్య | చిత్రజ్యోతి

నందమూరి వంశం నుంచి నాలుగో తరం



నందమూరి వంశం నుంచి నాలుగో తరం నటుడు వెండి తెరపైకి రాబోతున్నాడు. లెజండరీ నటుడు ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు, జానకీరామ్ తనయుడు నందమూరి తారక రామారావు హీరోగా ఎంట్రీ ఇవ్వనున్నాడు. వైవిఎస్ చౌదరి దర్శకత్వం వహిస్తున్నారు. న్యూ టాలెంట్ రోర్స్ పతాకంపై యలమంచిలి గీత ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు, నిర్మాత అశ్వనిదత్ చేతుల మీదుగా 'ఎన్టీఆర్ తొలి దర్శనం' పేరుతో హీరో ఫస్ట్ లుక్ గ్లింప్స్ బుధవారం జరిగిన కార్యక్రమంలో రిలీజ్ చేశారు. పొడవాటి జుట్టు, ధృడమైన శరీరాకృతితో అందంగా కనిపించారు చిన్న ఎన్టీఆర్. అర్థవంతమైన పాత్రలను ఎన్నుకుని ప్రేక్షకులను అలరిస్తాననీ, పరిశ్రమకు విధేయుడిగా ఉంటాననీ పెద్ద ఎన్టీఆర్‌పై ప్రమాణం చేశారు ఈ చిన్న ఎన్టీఆర్. 18 నెలల పాటు దర్శకుడు వైవీఎస్ చౌదరి ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో శిక్షణ పొందానని తెలిపారు. ఈ సినిమాలో చిన్న ఎన్టీఆర్ సరసన వీణా రావు కథానాయికగా నటిస్తున్నారు. ఈ సందర్భంగా వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ 'పెద్దాయన ఎన్టీఆర్‌తో జగత్ విఖ్యాతమైన సినిమాలు తీసి.. ఆయన కీర్తి ప్రతిష్ఠలను ఎంతో ఇనుమడింపజేసే ప్రయాణంలో మా గురువుగారైన రాఘవేంద్రరావు ఎంతో కృషి చేశారు. అలాగే అన్నగారి చేతుల మీదుగా అశ్వనీదత్‌గారి వైజయంతీ మూవీస్ సంస్థ ప్రతిష్ఠాపించగా ఎంతో ఎత్తుకు ఎదిగింది. ఎన్టీఆర్ చేతి చలవ అలాంటిది. అలాంటి ఇద్దరి ఆశీస్సులతో మరొక ఎన్టీఆర్ అద్భుతమైన ఇన్నింగ్స్ ప్రారంభించబోతున్నాడు. ఈ మహానుభావులిద్దరికీ రామారావు గారితో అనుబంధం ఉంది. పండితుల వేద మంత్రాల సాక్షిగా ఈ పెద్దలిద్దరితో ఈ నందమూరి తారక రామారావు షో రీల్‌ని పరిచయం చేయించడం నా అదృష్టంగా భావిస్తున్నా' అని అన్నారు.

డిసెంబర్ నాలుగున వివాహం



అక్కినేని నాగచైతన్య, శోభిత ధూళిపాళ్ల వివాహ ముహూర్తం ఖరారైంది. డిసెంబర్ నాలుగున వీరిద్దరూ వివాహం చేసుకోనున్నట్లు అక్కినేని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు 8న నాగచైతన్య, శోభితల నిశ్చితార్థం జరిగింది. అప్పట్లో పెళ్లి తేదీని ప్రకటించకపోయినప్పటికీ డిసెంబర్‌లో వివాహం ఉంటుందని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. సరిగ్గా వారం రోజుల క్రితం శోభిత పెళ్లి పనులు మొదలయ్యాయని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. దాంతో త్వరలోనే వీరి వివాహం ఉంటుందని అందరూ అనుకుంటున్న తరుణంలో చిత్రజ్యోతి ఈ విషయమై అక్కినేని కుటుంబ సభ్యులను సంప్రదించగా వారు ఈ వార్తను ధ్రువీకరించారు.

ఎంతో సంతృప్తిని ఇచ్చింది



వెంకీ అట్లూరి దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి జంటగా నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ఈ గురువారం గ్రాండ్ రిలీజ్ అవుతున్న సందర్భంగా నాగవంశీ మీడియాతో ముచ్చటించారు. 'విడుదలకు ముందే సినిమాపై భారీ స్థాయిలో అంచనాలు ఏర్పడినందుకు సంతోషంగా ఉంది. మంచి సినిమా చేశామనే సంతృప్తి అరుదుగా కలుగుతుంది. అలాంటి సంతృప్తిని 'లక్కీ భాస్కర్' కలిగించింది. మనిషి డబ్బు సంపాదించాలనుకున్నప్పుడు ఎంత దూరమైనా వెళ్తాడు అనే కథాంశంతో ఈ చిత్రం రూపొందింది. బాక్సింగ్ నేపథ్యంలో థ్రిల్లర్ జానర్‌లో ఉండే ఫ్యామిలీ సినిమా ఇది. సినిమా చూస్తున్న ప్రతి ప్రేక్షకుడూ భాస్కర్ గెలవాలని కోరుకుంటాడు. భాస్కర్ పాత్రలో తమని చూసుకుంటారు. కథానాయకుడు ఈ సినిమాలో ఎవరినీ మోసం చేయడు. తన తెలివి తేటలతోనే ఎదుగుతాడు. ఇది సందేశాత్మక చిత్రం కాదు. తెలుగులో వస్తున్న ఒక విభిన్న చిత్రం' అని నాగవంశీ తెలిపారు.

కిరణ్ సక్సెస్ స్టోరీ నాకు ఇన్‌స్పిరేషన్

నాగచైతన్య



హీరో కిరణ్ అబ్బవరం నటించిన భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమా 'క'. ఈ గురువారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో నాగచైతన్య పాల్గొన్నారు. 'నేను ఇంట్రోవర్ట్ పర్సన్‌ను. కొత్త వాళ్లతో పెద్దగా కలవను. రీసెంట్‌గా కిరణ్ చెన్నైలో కలిశాడు. ఆయనతో మాట్లాడిన కొద్ది సేపటికే చాలా దగ్గరి ఫ్రెండ్‌లా అనిపించాడు. కిరణ్ ఇన్‌స్పైరింగ్ జర్నీకి నేను నంబర్ వన్ ఫ్యాన్‌ను. ఎందుకంటే నేను ఇండస్ట్రీలో ఫ్యామిలీ బ్యాగ్రౌండ్‌తో మంచి ప్రొటెక్షన్‌తో వచ్చాను. తనకు ఎవరి సపోర్ట్ లేదు. స్వతహాగా ఎదిగాడు. కిరణ్ సక్సెస్ స్టోరీ నాకు ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తుంది. ఇండస్ట్రీకి వచ్చే ఎంతో మందికి కిరణ్ స్ఫూర్తిగా నిలుస్తారు. ఇలాంటి హీరోలు సక్సెస్ కావాలి. 'క' సినిమా ట్రైలర్ చూశాను. తప్పకుండా బ్లాక్ బస్టర్ అవుతుంది' అని నాగ చైతన్య అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'మూవీ ప్రీ రిలీజ్‌కి నాగ చైతన్య వంటి వారు రావడం ఆనందంగా ఉంది. ఆయన పాజిటివిటీతో మాకు మంచి జరుగుతుందని కోరుకుంటున్నాం. నాకు సినిమానే ప్రాణం. అందుకే ఏ ఉద్యోగం చేసినా మనసు సినిమావైపే లాగేది. అలా ఇండస్ట్రీకి వచ్చాను. సక్సెస్ వచ్చింది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో సుజిత్, సందీప్, నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి, హీరోయిన్లు నయన్ సారిక, తన్వీరామ్ పాల్గొన్నారు.


నేడే విడుదల
31
10
24
DULQUER SALMAAN
లక్కీ భాస్కర్
VENKY ATLURI
NAGA VAMSI S - SAI SOUJANYA
GV PRAKASH KUMAR
TELUGU - MALAYALAM - TAMIL - HINDI - KANNADA


SRICHAKRAAS ENTERTAINMENTS
SMT. CHINTA VARALAXMI PRESENTS
KA PRODUCTIONS
నేడే
విడుదల


నేడే
విడుదల
SRIIMURALI
బఘీర
PRODUCER VIJAY KIRAGANDUR
SCREENPLAY DIALOGUE DIRECTION DR. SURI
STORY PRASHANTH NEEL


GALLA MANJUNATH PRESENTS
RADHAKRISHNAA PRODUCTION COMPANY
NOV 8TH
GRAND REALESE
WORLDWIDE
SATHISH BABU IN
జాతర
PRODUCED BY DWARAMPUDI RADHAKRISHNA REDDY
A FILM BY SATHISH BABU RATAKONDA


FROM TODAY
RELEASING
WORLDWIDE
KAMAL HAASAN
SONY PICTURES INTERNATIONAL PRODUCTIONS
SIVAKARTHIKEYAN
అమరన్
RAJKUMAR PERIASAMY
GV PRAKASH KUMAR
PRODUCED BY KAMAL HAASAN • SONY PICTURES INTERNATIONAL PRODUCTIONS • R. MAHENDRAN


PAKKAA ENTERTAINER
FRIDAY FRAMEWORKS
CHETAN MADDINENI
దీపావళి శుభాకాంక్షలు
ధూం ధాం
WORLDWIDE RELEASING
NOV 8TH
IN THEATRES
SPECIAL THANKS TO OUR DISTRIBUTORS
NIZAM : SHASHI (MYTHRI MOVIE DISTRIBUTORS)
WEST : LVR (ADITHYA FILMS)
VIZAG AND KRISHNA : SAI BABU (ANNAPURNA STUDIOS)
EAST : SIVARAM (VINTAGE CREATIONS)
GUNTUR : VMR (PADMAKAR CINEMAS)
NELLORE : HARI (HARI PICTURES)
CEEDED : ABHISHEK REDDY (SHILPAKALA ENTERTAINMENTS)
AZAR : USA
NARENDRA : KENYA
ANAND CHUKKA : AUSTRALIA


VYRA ENTERTAINMENTS
Happy
DIWALI
VARUN TEJ
MATKA
WRITTEN & DIRECTED BY KARUNA KUMAR
PRODUCED BY DR. VIJENDER REDDY TEEGALA RAJANI TALLURI
IN CINEMAS
14.11.24





కొత్తూరు తాడేపల్లిలోని నగర వనం

నగర వరం

- రా..రమ్మంటూ ప్రకృతి ప్రేమికులను పిలుస్తోన్న 'నగర వనం'
- వర్షాలకు పచ్చదనం పరచుకున్న ప్రకృతి సౌందర్యం
- ఆకర్షిస్తున్న ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, చిన్నారుల క్రీడా మైదానం
- క్యూ కడుతున్న విజయవాడ నగర వాసులు



వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో వాకింగ్ ట్రాక్‌పై పెరిగిన పిచ్చిమొక్కలు

ప్రకృతి ప్రేమికులకు వరం విజయవాడ శివారు కొత్తూరు తాడేపల్లిలోని నగర వనం. తొలి మంచు తెరల మాటున పరచుకున్న పచ్చని అందాలు పర్యాటకుల మనస్సు దోచుకుంటున్నాయి. స్వచ్ఛమైన ఇక్కడి వాతావరణం శారీరక, మానసిక ఒత్తిడుల నుంచి ఉపశమనం కల్పిస్తోంది. భవానీ ద్వీపం, కొండపల్లి ఖిల్లా, మూలపాడు బటర్ ఫ్లై పార్క్ తర్వాత ప్రకృతి రమణీయ ప్రదేశంగా గుర్తింపు పొందింది. చిన్నారుల క్రీడా మైదానం, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్ తదితర సౌకర్యాలు చిన్నారులు, వాకర్లు, ట్రెక్కర్లను ఆకర్షిస్తున్నాయి. ప్రకృతి ప్రసాదిత సహజ నగర వనం మరింత అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

10

పిన్నెల్లి అండతో రెచ్చిపోయారు

పల్నాడు పోలీసుల తీరుపై అనేక ఆరోపణలు

- హైకోర్టు న్యాయవాది వేధింపుల వెనుక వైసీపీ ఒత్తిళ్లు
- వేధింపుల్లో కీలక సూత్రధారిగా డీఎస్పీ పల్లంరాజు
- ఆయన చెప్పినట్టు చేసిన ఎస్ఐ రబ్బానీ, కానిస్టేబుల్ వెంకటరావు
- పల్లంరాజుపై ఆది నుంచి ఆరోపణలు

విజయవాడ, కాకినాడలో అనేక అక్రమాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) విజయవాడలో హైకోర్టు న్యాయవాది హరిబాబును పల్నాడు పోలీసులు వేధించడం వెనుక అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హస్తం ఉందని తెలుస్తోంది. ఆయన అండదండలు చూసుకుని అప్పటి గురజాల డీఎస్పీ ఎ.పల్లంరాజు, పిడుగురాళ్ల ఎస్ఐ రబ్బానీ, కానిస్టేబుల్ వెంకటరావు వీరంగం వేశారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. హరిబాబుపై జరిగిన వేధింపులకు సంబంధించి పిడుగురాళ్ల పీఎస్‌లో నమోదైన కేసు విజయవాడ పటమట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగుచూస్తున్నాయి. చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన పోలీసులు పిన్నెల్లి అనుచరుడు కర్నాటి వీరభద్రరావు వైపు వకల్తా తీసుకున్నారు. హరిబాబు నుంచి వీరభద్రరావు తీసుకున్న అప్పును తిరిగి ఇప్పించకపోగా అతడి ఆస్తులను బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించారు. దీనితోపాటు హరిబాబు వద్ద నుంచి రూ.కోటి వరకు లాగేశారు. ఈ విషయాలన్నీ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వాటితోపాటు డీఎస్పీ పల్లంరాజు పోలీసు ఉద్యోగంలో అడుగుపెట్టినప్పటి నుంచి చేసిన అక్రమాల చిట్టా తాజాగా బయటకు వస్తోంది.

విజయవాడలో పల్లంరాజు మార్కు

పల్లంరాజు 1991లో ఎస్ఐగా పోలీస్ శాఖలో అడుగుపెట్టారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత నుంచి ఆయన సర్వీసు మొత్తం విజయవాడలో సాగింది. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి చెందిన పల్లంరాజు 20 ఏళ్లకుపైగా విజయవాడలో పనిచేశారు. ఎస్ఐగా కవిషనరేట్‌లో పోస్టింగ్ తీసుకుని ఇక్కడే ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఇన్‌స్పెక్టర్‌గా పటమట, టాస్క్‌ఫోర్స్ వంటి కీలక పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. నాడు విజయవాడలో జరిగిన భూవివాదాల కేసుల్లో సెటిల్‌మెంట్లు చేసి లక్షలాది రూపాయలను వసూలు చేశాడన్న ఆరోపణలు ఉన్నాయి. నీతి నిజాయితీగా పనిచేసి ఒక మార్కును వేయించుకున్న అధికారులకంటే కమిషనరేట్‌లో పల్లంరాజు మార్క్ ఎక్కువగా కనిపిస్తోంది. పోలీస్ శాఖలో ఎవరిని కదిపినా పల్లంరాజు గురించి పెద్ద చిట్టా విప్పుతున్నారు. ఈయన ఇక్కడ పనిచేసినప్పుడే భారీగా ఆస్తులను కూడబెట్టుకున్నట్టు సమాచారం. విజయవాడలో ఉన్న ప్రముఖ రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలతో పాటు అక్రమాలకు పాల్పడే మాఫియాలతో ఈయనకు ఇప్పటికీ సంబంధాలు ఉన్నాయని చెప్పుకుంటున్నారు. పోలీస్‌శాఖలో పల్లంరాజును అతడి స్నేహితులు బిగ్‌షాట్ అని ముద్దుగా పిలుచుకుంటారని.. దీన్ని బట్టి ఆయన ఏ స్థాయిలో ఉన్నారో ఇట్టే తెలుస్తోంది.

కాకినాడలోనూ అదే దూకుడు

డీఎస్పీగా పదోన్నతి పొందిన ఈయనకు కాకినాడలో పోస్టింగ్ ఇచ్చారు. 2014 నుంచి 2019 వరకు అక్కడ అనేక అక్రమాల బాగోతాలు నడిపినట్లు సమాచారం. అక్కడ సీసీఎస్ డీఎస్పీగా పనిచేశారు. విశాల్ గున్నీ ఎస్పీగా ఉన్నప్పుడు క్రికెట్ బెట్టింగ్ కేసులను పల్లంరాజుకు అప్పగించారు. ఆ సమయంలో అక్కడే అదనపు ఎస్పీగా పనిచేసిన రవిశంకర్‌రెడ్డికి విధేయుడిగా మారారు. విశాల్ గున్నీ అప్పగించిన బాధ్యతలతో పల్లంరాజు తనకు తాను ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఏదైనా ఒక కేసును దర్యాప్తు చేస్తున్న అధికారికి సహాయకులుగా ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు ఉంటారు. పల్లంరాజు అనధికారికంగా ఎస్పీ స్పెషల్ పార్టీ పేరుతో ఒక టీంను ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. ఒక క్రికెట్ బుకీని అరెస్టు చేసి వారానికి పైగా రహస్య ప్రదేశంలో ఉంచారని, ఆ బుకీ ద్వారా ఇతర బుకీలకు ఫోన్లు చేయించి కోట్లాది రూపాయలను వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ డబ్బులతోనే విజయవాడకు చెంతనే ఉన్న తాడేపల్లిలో ఖరీదైన స్థలాన్ని కొనుగోలు చేసి మొక్కల ప్రేమికుడిగా మారినట్టు తెలిసింది. ఈ స్థలంలో ఈయన ఒక నర్సరీని నడుపుతున్నట్టు సమాచారం. ఈ స్థలాన్ని ఈయన కొనుగోలు చేయలేదని, ల్యాండ్ సెటిల్‌మెంట్‌లో కానుకగా తీసుకున్నారన్న ప్రచారం కూడా నడుస్తోంది. 2019 తర్వాత కూడా కాకినాడలో పనిచేయాలని పల్లంరాజు భావించారని, అయితే అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఈయన్ను పనికట్టుకుని మరీ బదిలీ చేయించినట్టు తెలిసింది. చంద్రశేఖర్‌రెడ్డికి అనుచరులుగా ఉన్న బుకీలను వేధించి కోట్లాది రూపాయలు వసూలు చేయడమే దీనికి కారణమని సమాచారం.

పిన్నెల్లి అనుచరుడిగా అవతారం!

రవిశంకర్‌రెడ్డి పల్నాడు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయనే స్వయంగా పల్లంరాజును గురజాల డీఎస్పీగా రప్పించుకున్నారని సమాచారం. ఇక్కడికి వచ్చిన తర్వాత పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి అనుచరుడిగా పనిచేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగానే హైకోర్టు న్యాయవాది హరిబాబుపై సర్వీసు రివాల్వర్ గురిపెట్టి మరీ ఆయన ఆస్తులు కర్నాటి వీరభద్రరావు పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించినట్టు బాధితుడు ఆరోపిస్తున్నాడు. ఎస్ఐ రబ్బానీ, కానిస్టేబుల్ వెంకటరావు పలుదఫాలుగా హరిబాబు నుంచి రూ.కోటి వరకు వసూలు చేశారని, ఈ డబ్బులను ఈ ముగ్గురు కలిసి పంచుకున్నారని ప్రచారం నడుస్తోంది. కేసు దర్యాప్తు ముందుకు సాగే కొద్దీ ఈ డబ్బుల లెక్కలు తేలడం ఖాయమని అధికారులు చెబుతున్నారు.

ఆర్టీసీలో పదోన్నతుల రగడ



సంస్థలో వేల సంఖ్యలో ఖాళీగా పోస్టులు

- అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు, పదోన్నతులు
- ఉద్యోగులకు మాత్రం ప్రభుత్వ అనుమతి, సాంకేతిక సాకుతో నిలుపుదల
- అర్హత పరీక్షలు ఉత్తీర్ణులై ఏళ్లు గడిచినా ఇవ్వని పోస్టింగ్
- ఉన్నతాధికారుల ద్వంద్వ వైఖరిపై ఉద్యోగుల ఆగ్రహం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ)లో పదోన్నతుల రగడ నడుస్తోంది. అధికారులకో న్యాయం.. ఉద్యోగులకో న్యాయం అన్నట్టుగా ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సంస్థలో డిప్యూటీ మెకానిక్‌లు, అసిస్టెంట్ మేనేజర్లు, ఏడీ, పీడీ, ఓపీడీ, ఎంఈడీ, ఎస్పీడీ, మ్యాట్ తదితర విభాగాల్లో వందలాది మందికి చాలా ఏళ్లుగా పదోన్నతులు ఇవ్వడం లేదు. ఈ విభాగాలలో పనిచేసే వారికి పదోన్నతులు ఇవ్వటానికి ఉన్నతాధికారులు అనేకసాంకేతిక కారణాలు చూపిస్తున్నారని బాధిత ఉద్యోగులు వాపోతున్నారు. ఇటీవల కాలంలో ఖాళీల భర్తీ పేరుతో సంస్థలో పనిచేసే చాలా మంది అధికారులను తాత్కాలిక ఇన్‌చార్జిలుగా నియమించడంతో పాటు పదోన్నతులను కల్పించారు. అధికారుల పదోన్నతుల విషయంలో ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు రాలేదని, ఉద్యోగుల విషయంలో ఎందుకు సాంకేతిక ఇబ్బందులు వస్తున్నాయని ఉద్యోగులు ప్రశ్నిస్తు న్నారు. సంస్థలో పదోన్నతులను అందుకునేందుకు అవసరమైన పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన వారు చాలా మంది ఉన్నారు. సీనియారిటీ ప్రకారం పదోన్న తులకు అర్హులైన వారు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. వీరంతా కూడా తమకు పదోన్నతులు వస్తాయన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. ఏళ్ల గడుస్తున్నా పదోన్నతులు రాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇప్పుడు పదోన్నతులు రాకపోతే తీరని అన్యాయం జరుగుతుందని లబోదిబోమంటున్నారు. ఉన్నతాధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

> ఆర్టీసీలో అధికారులు, ఉద్యోగుల పదోన్నతుల విషయంలో ఉన్నతాధికారులు వ్యవహార శైలి అనేక విమర్శలకు దారితీస్తోంది. ఖాళీగా ఉన్న పోస్టుల్లో అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు, పదోన్నతులు ఇస్తున్న వీరు అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణులై పదోన్నతి కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ఉద్యోగులకు మాత్రం పదోన్నతి కల్పించడానికి అనేక సాకులు చెబుతున్నారు. ఉన్నతాధికారుల ద్వంద్వ వైఖరిపై ఉద్యోగుల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీలో పదోన్నతుల రగడ చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వ అనుమతి, సాంకేతిక కారణాల సాకు..

ప్రభుత్వ రంగ సంస్థ నుంచి ప్రభుత్వశాఖగా మారిన క్రమంలో ఆయా విభాగాల ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని, కొన్ని సాంకేతిక కారణాలు కూడా ఉన్నాయని సాకు చెబుతూ ఉన్నతాధికారులు తప్పించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ అనుమతి కావాలంటే ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదించాలి. అలాంటి ప్రయత్నం ఉన్నతాధికారుల నుంచి జరగటం లేదు. దీంతో బాధిత ఉద్యోగులలో తీవ్ర నిరాశ, అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చే వరకు తాత్కాలిక ఇన్‌చార్జిలుగా అయినా బాధ్యతలు అప్పగిస్తే.. ఆయా పోస్టులలో పని విధానాన్ని వీరు తెలుసుకోవటంతో పాటు, నైపుణ్యం, అనుభవం కూడా పెంచుకునే అవకాశం ఉంటుంది. దీనిపై ఏపీపీటీడీ గుర్తింపు సంఘం ఈయూ తరఫున రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామోదరరావు, నరసయ్యలు ఆర్టీసీ ఎండీకి మంగళవారం లేఖ రాశారు. ఈ లేఖపై ఉన్నతాధికారులు స్పందిస్తారో లేదో వేచి చూడాల్సిందే!

ఇది అన్యాయం

ఆర్టీసీలో ఉన్న ఖాళీల్లో అర్హులైన అధికారులకు పదోన్నతులు ఇచ్చిన విధంగానే కిందిస్థాయి ఉద్యోగులకు కూడా పదోన్నతులు ఇవ్వాలి. కేటగిరీల వారీగా మొత్తం మూడు వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భర్తీ చేయకపోవడంతో పనిభారంతో అల్లాడిపోతున్నారు. కనీసం పదోన్నతులు అయినా ఇస్తే ఉత్సాహంతో పనిచేస్తారు. పదోన్నతుల విషయంలో అధికారులు, ఉద్యోగులను వేర్వేరుగా చూడటం తగదు. వెంటనే ఈ సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

- పలిశెట్టి దామోదరరావు, ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఎస్‌డీఆర్ఎఫ్ మాక్ డ్రిల్







నీటి ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజల ప్రాణాలు రక్షించడంలో ఎస్‌డీఆర్ఎఫ్ ఎటువంటి పాత్ర వహిస్తుందనే విషయాన్ని విజయవాడలోని పున్నమిఘాట్ వద్ద కృష్ణానదిలో బుధవారం నిర్వహించిన మాక్ డ్రిల్ ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించింది. ఈ సందర్భంగా జీరోకట్ ఎయిట్ సర్కిల్ బోట్ ఆపరేషన్, బోట్ రెస్క్యూవ్, కాంపాక్ట్ జంపు, క్యూబా డైవ్, సెర్చ్ ఆపరేషన్ తదితర ప్రాణ రక్షణ విన్యాసాలను సిబ్బంది ప్రదర్శించారు. ఏపీఎస్పీ బెటాలియన్ కమాండర్ డాక్టర్ కె. నాగేష్‌బాబు పర్యవేక్షించారు.

రాత్రి పది తర్వాత టపాసులు కాల్చొద్దు

● సీపీ రాజశేఖరబాబు



విజయవాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ కమిషనరేట్ పరిధిలో దీపావళి సందర్భంగా టపాసులు రాత్రి పది గంటల తర్వాత కాల్చొద్దని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు విజ్ఞప్తి చేశారు. అందరూ సంతోషంగా దీపావళిని జరుపుకోవాలని కోరారు. సాధ్యమైనంత వరకు పర్యావరణహిత టపాసులను కాల్చాలన్నారు. అత్యవసర సమయాల్లో 101 (ఫైర్ స్టేషన్), 112, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మహిళా ఉద్యోగిపై వేధింపులు.. విచారణ ప్రారంభం

విజయవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహిళా ఉద్యోగిపై వేధింపుల విషయమై రైల్వేలో అంతర్గత విచారణ ప్రారంభమైంది. డివిజనల్ పర్సనల్ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి తనను విభాగాధికారి వేధిస్తున్నాడని కొద్ది రోజుల కిందట రైల్వే మంత్రికి, దక్షిణ మధ్య రైల్వే జీఎంకు ఫిర్యాదు చేశారు. ఆపైన బీజేపీ ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరికి కూడా ఫిర్యాదు ఇచ్చారు. వరుస ఫిర్యాదులతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు అంతర్గత విచారణకు ఆదేశించారు. ప్రాథమికంగా సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ (సీనియర్ డీసీఎం), అడిషనల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, రాష్ట్ర ప్రభుత్వ ఎన్‌జీఓ ఒకరితో త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఈ నెల 26వ తేదీన ప్రాథమిక విచారణ చేపట్టింది. బాధిత మహిళ గతంలో ఇదే అధికారి మరో కేసుకు సంబంధించి మహిళల వేధింపు కేసులో సాక్షిగా ఉండటం గమనార్హం. డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) కార్యాలయం ఈ ఫిర్యాదుపై ఆరోపణలు వచ్చిన అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ కేసునైనా నిష్పక్షపాతంగా విచారణ జరుపుతారా లేదా అన్నది వేచి చూడాల్సిందే.

బాణసంచా వ్యాపారుల ఆశలపై వాన



కొనుగోలుదారులతో బాణసంచా దుకాణాలు కిటకిట

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బాణసంచా వ్యాపారులను వర్షం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. పండుగకు ముందు రోజున రికార్డు స్థాయిలో బాణసంచా వ్యాపారం జరుగుతుందని ఆశించారు. అయితే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వ్యాపారం బాగానే సాగినా కీలకమైన సాయంత్రం వేళ వర్షం కారణంగా ఇబ్బంది ఎదురైంది. రాత్రి మాత్రం వ్యాపారం యథావిధిగా సాగింది. పండుగ రోజు వ్యాపారం పైనే వ్యాపారులు ఆశలు పెట్టుకున్నారు.

అంతర్ కళాశాలల తైక్వాండోలో

పీబీ సిద్ధార్థ విద్యార్థులకు గోల్డ్

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 30: కైకలూరులోని డిగ్రీ కళాశాలలో కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల తైక్వాండో పురుషుల ఛాంపియన్‌షిప్‌లో విజయవాడ మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్‌సైన్సు కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు బంగారు పతకాలతో సత్తా చాటారు. దీంతో నవంబరు 6 నుంచి 9 వరకు అమృత్‌సర్‌లోని జీఎన్‌డీ యూనివర్సిటీలో జరిగే ఆలిండియా తైక్వాండో ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. స్వర్ణాలు సాధించిన డి. సాయి ప్రశాంత్, పి. విక్టర్ ఆదిత్య, ఎస్. రోహిత్, కె. కృష్ణవంశీ, పి దుర్గాప్రసాద్, కె.కుమార్‌లను ప్రెసిడెం ట్ డాక్టర్ సి. నాగేశ్వరరావు, సెక్రటరీ పాలడుగు లక్ష్మణ రావు, కన్వీనర్ ఎస్. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వి. బాబూరావు, డీన్ రాజేష్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ టీవీటీ కృష్ణారెడ్డిలు క్రీడాకారులను అభినందించారు.


పీబీ సిద్ధార్థ టీమ్‌ను అభినందిస్తున్న యాజమాన్యం

పర్యావరణ హితం కోరుతూ కళాజాతా



పటమట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దీపావళిని ప్రతి ఒక్కరూ ఆనంద దీపావళిగా చేసుకోవాలని పర్యావరణ హితంగా జరుపుకోవాలని కోరుతూ బుధవారం నగరంలో పలుచోట్ల కళాజాతాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి విజయవాడ ప్రాంతీయ కార్యాలయం ఆదేశానుసారంగా జాగ్రత్తలపై ప్రజలను ఆకట్టుకునే కళాజాతాలు, వీధి నాటకాలను కళాబృందం ప్రదర్శించారు.

వెలుగు పూల దీపావళి

పాఠశాలలు, కళాశాలల్లో టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్న విద్యార్థులు


సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో రంగవల్లులు దిద్దుతున్న విద్యార్థినులు

విజయవాడ కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో బుధవారం దీపోత్సవ్, వెజిటబుల్ కార్వింగ్, థాళీ డెకరేషన్, మట్టితో బొమ్మలు తయారు చేయడం వంటి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు రంగురంగుల పువ్వులు, దీపాలతో ముగ్గులను అలంకరించి కనువిందు చేశారు. గెలుపొందిన వారికి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేశారు. సాంస్కృతిక విభాగపు అధ్యాపకురాలు డాక్టర్ జేవీఎస్ఎస్‌కే దీప్తి పాల్గొన్నారు.

లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో..

మొగల్రాజపురం: మొగల్రాజపురం సిద్ధార్థ నగర్‌లో ఉన్న లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో బుధవారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్కేవి మాట్లాడుతూ చిన్నారులు దీపావళి పండగను ఎంతో ఉత్సాహంగా జరుపుకోవాలని అనుకుంటారని తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకుని పిల్లలు మందుగుండు సామాగ్రి కాల్చేటపుడు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అనంతరం దీపావళి పండగ విశిష్టతను తెలిపేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పిల్లలు, వారి తల్లిదండ్రులతో టపాసులు, చిచ్చుబుడ్లు, కాకరపువ్వొత్తులు కాలుస్తూ సందడి చేశారు.

కృష్ణలంక ఐడియల్ స్కూల్‌లో...

కృష్ణలంక: కృష్ణలంక ఐడియల్ స్కూల్‌లో బుధవారం దీపావళి సంబరాలు చిన్నారులు ఘనంగా నిర్వహించారు. ఎల్‌కేజీ నుంచి 5వ తరగతి విద్యార్థులతో టపాసులు కాల్పించారు. ఉపాధ్యాయులు లక్ష్మీదేవికి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్ సుధాకరరెడ్డి, ప్రిన్సిపాల్ రామకోటేశ్వరరావు, కరస్పాండెంట్ దేవినేని వరలక్ష్మి, ఇన్‌చార్జి కనకదుర్గ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాయి మేధా కోచింగ్ సెంటర్‌లో...

లబ్బీపేట: ప్రతి ఒక్కరు పర్యావరణ అనుకూలమైన దీపావళి జరుపుకోవాలని సాయి మేధా కోచింగ్ సెంటర్ విజయవాడ బ్రాంచ్ డైరెక్టర్ మజ్జిగ బాలకృష్ణ పిలుపునిచ్చారు. నగరంలోని సాయి మేధా కోచింగ్ సెంటర్‌లో బుధవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్లగా ఎంతో మంది విద్యార్థులను ర్యాంకర్లుగా తీర్చిదిద్దామని, కేవలం విద్యార్థులకు కోచింగ్ ఇవ్వడమే కాకుండా మన సంస్కృతి సంప్రదాయలను తెలియజేసే పండుగల ఔన్నత్యాన్ని వారికి వివరిస్తామని తెలిపారు. కులాలు, మతాలకు అతీతంగా అన్ని పండుగలను ఘనంగా జరుపుతామని, ముఖ్యంగా మన పండుగల విశిష్టతను నేటి యువత తెలుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సెట్ 2025 ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ క్లాసులు నవంబరు మొదటి వారంలో ఒక బ్యాచ్, రెండో బ్యాచ్‌కు సంబంధించిన క్లాసులు ప్రారంభం కానున్నయని తెలిపారు. అనంతరం విద్యార్థులు నూతన వస్త్రాలు ధరించి పండుగ శోభ తీసుకురావడమే కాకుండా ప్రత్యేక పూజలు నిర్వహించి టపాసులు కాల్చారు.


లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో


కృష్ణలంక ఐడియల్ స్కూల్‌లో


సాయి మేధా కోచింగ్ సెంటర్

పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలి

పీవోడబ్ల్యూ నేత పద్మ ● ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన

గవర్నర్‌పేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశంలో, రాష్ట్రంలోనూ మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, పని ప్రదేశాల్లో ఉద్యోగినులు, మహిళా కార్మికుల పట్ల లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేయాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి పి. పద్మ అన్నారు. ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సమీపంలో నిరసన జరిగింది. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ మహిళలు పనిచేసే చోట్ల మహిళల భద్రతా కమిటీలు ఏర్పాటు చేసి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉందన్నారు. ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చాక మహిళలపై అత్యాచారాలు మరింతగా పెరిగాయని, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె. పోలారి, రాష్ట్ర కమిటీ సభ్యుడు డి. శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు మునిశంకర్, మహిళా సంఘం నేతలు దుర్గ, రాధ తదితరులు పాల్గొన్నారు.


పాత బస్టాండ్ సమీపంలో ధర్నా చేస్తున్న ఇఫ్టూ, పీవోడబ్ల్యూ నేతలు

స్థాయీ సంఘంలో 7అంశాలకు ఆమోదం


మాట్లాడుతున్న నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి

చిట్టినగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరపాలకసంస్థ స్థాయీ సంఘం సమావేశంలో 7అంశాలకు ఆమోద ముద్రవేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్థాయీ సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో 10అంశాలపై చర్చించి 7అంశాలను ఆమోదించారు. ఒక అంశం రికార్డు చేయడంతోపాటు పరిపాలన పరమైన అంశాలకు సంబంధించి ఒక అంశాన్ని ధ్రువీకరించారు. ఒక అంశాన్ని వాయిదా వేశారు. నగరపాలక సంస్థ వర్క్ డివిజన్-2కు చెందిన రూ. 5లక్షల లోపు నామినేషన్ 25 పనులను వాయిదా వేశారు. వర్క్ డివిజన్-3 చెందిన 151 నామినేషన్ పనుల్లో ఒకటి మినహా 150 నామినేషన్ పనులకు ఆమోద ముద్ర వేశారు. అయితే వర్క్ డివిజన్-2 చెందిన నామినేషన్ పనులను వాయిదా వేయటంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. సర్కిల్-2 పరిధిలో అజిత్ సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్, యాంటీ రాబిస్ వాక్సినేషన్, యానిమల్ బర్త్ కంట్రోల్ ఆపరేషన్స్ జరుపుటకు 220 డాగ్ కెన్నెల్స్ నిర్మించాల్సి ఉండగా 100 డాగ్ కెన్నెల్స్ నిర్మించడానికి రూ. 45.06 లక్షలతో అంచనాలను స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. వీటితో పాటు గుప్తా సెంటర్‌లో నిర్మించిన నూతన షాపులకు టెండర్‌లు నిర్వహించారు. వాటిలో హెచ్చుపాటదారులకు షాపులు అప్పగిస్తూ ఆమోదించారు. అయితే నాలుగు షాపులకు రెండింటికి సింగిల్ టెండర్‌ను ఆమోదించారు. దీనిపై పలు విమర్శలు తలెత్తున్నాయి. సమావేశంలో పలువురు కమిటీ సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎంపీ దీపావళి శుభాకాంక్షలు

వన్‌టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వెలుగుల పండగ దీపావళి ప్రజల జీవితాలలో సరికొత్త కాంతులు నింపాలని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) తెలుగు ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో వెన్నెల వెలుగు తెలుగు లోగిళ్లలో ప్రసరిస్తుందన్నారు.



ఘనంగా దుర్గమ్మతల్లికి సంబరం

వన్‌టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి దుర్గాఘాట్ వద్ద వ్యాపారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 25వ సంవత్సరం దుర్గమ్మతల్లి సంబరం మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దేవతోటి నాగరాజు దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెస్ట్ జోన్ ఏసీపీ దుర్గారావు అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గమ్మను దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.శివరామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు బి.లీలాకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు కళాశాలలో దీపావళి వేడుకలు

వన్‌టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగను పురస్కరించుకుని కొత్తపేటలోని పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంసీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో కళాశాల కార్యదర్శి సీఏ అమర సుధీర్, కోశాధికారి రాజ రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలి శాస్త్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరకాసురుడిని వధించిన ఆనందంలో ప్రజలు దీపావళి చేసుకుంటారని తెలిపారు. విద్యార్థులు అలంకరణలు, రంగవల్లులతో కూడిన దీపాలంకరణ, రంగు రంగుల వస్త్రధారణలతో ఆలరించారు. కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు నిర్వహించిన సత్యభామ చేతిలో నరకాసురుడి వధ ఘటన కళ్లకు కట్టినట్లుగా చూపారు.

దీపావళి ముందుగానే వచ్చింది

● ఎమ్మెల్యే బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు దీపావళి పండుగ ముందుగా వచ్చిందని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరిపేటలోని టీడీపీ కార్యాలయంలో దీపం పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి మహిళలకు స్వీట్లు అందించారు. అనంతరం అర్హులైన మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లను అందజేశారు. ఉమా మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి చరిత్రలో నిలిచిపోతారన్నారు. నేతలు నాని, కనకారావు, సత్యనారాయణ, ఈశ్వరి, రాణి, శృతి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందిపై ఆగ్రహం

● పారిశుధ్య నిర్వహణలో అలసత్వం సహించేది లేదు
● కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్చరించారు. 43,45 డివిజన్ల పరిధిలో ఊర్మిళానగర్, కబేళా పరిసర ప్రాంతాల్లో కమిషనర్ బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడాన్ని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ధ్యానచంద్ర ఆదే శించారు. అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్సు) డి.చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, సిటీ ప్లానర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు డంప్ అవుతున్నా..తొలగించరు

● బెంజిసర్కిల్ వజ్ర కాంప్లెక్సు వెనుక చెత్త పడేస్తున్న వైనం
● తొలగించని పారిశుధ్య సిబ్బంది


కాంపెక్సు వెనుక గోడ పక్కనే పేరుకున్న వ్యర్థాలు

(పటమట, ఆంధ్రజ్యోతి)
బెంజిసర్కిల్ ప్రాంతంలో వ్యర్థాలు తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. బెంజిసర్కిల్ బస్టాప్ వెనుక వజ్ర కమర్షియల్ కాంప్లెక్సు వద్ద ఉన్న వాణిజ్య వ్యాపారసంస్థలు, అందులో నిర్వహిస్తున్న హోటల్, బేకరి నుంచి నిత్యం ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ వస్తువులు, థర్మాకోల్, ఆహార పానీయాలు వ్యర్థాలు, మురుగు కాంప్లెక్సు వెనుక ప్రహరీ పక్కనే వేస్తున్నారు. మురుగునీరు ప్రవహిస్తూ ఆ ప్రదేశమంతా దుర్గంధభరితంగా మారింది. పక్కనే ప్రముఖ కార్పొరేట్ కళాశాల, సర్వోత్తమ గ్రంథాలయం ఉన్నాయి. మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్య వైఖరి వలన వాటిని తరలించే లోపు మురుగు నుంచి దుర్గంధం వెదజల్లుతోంది. శానిటరీ సిబ్బందికి చెబితే రెండు రోజులు శుభ్రం చేస్తున్నారని, తర్వాత యథావిధిగానే ఉంటోందని స్థానికులు అంటున్నారు. ఈ ప్రాంతం వీధి కుక్కలకు, దోమలకు ఆవాసంగా మారింది, నగరంలో వ్యాపార, వాణిజ్య కేంద్రం అయిన బెంజిసర్కిల్ ప్రాంతంలో లక్షల సంఖ్యలో ప్రజలు వస్తూపోతుంటారు. ఈ నేపథ్యంలో అధికారుల నిర్లక్ష్యంపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శానిటేషన్ పనులు చేపట్టాలి

సర్వోత్తమ గ్రంథాలయానికి వెళ్లే పాఠకులకు, నారాయణ కాలేజి విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. శానిటేషన్ సిబ్బంది వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలి

-మోతుకూరి అరుణ్‌కుమార్, సామాజిక కార్యకర్త

కాటాల స్టాంపింగ్ లేకపోతే పెనాల్టీ



పటమటలో కాటాల స్టాంపింగ్ చేస్తున్న సిబ్బంది

లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ మునిరాజు

మొగల్రాజపురం/ మధురానగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాలలో ఉపయోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాటాలకు నిర్ణీత గడువులోగా స్టాంపింగ్ చేయకుండా ఉపయోగించినట్లు తనిఖీల్లో బయట పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు పెనాల్టీలు విధిస్తామని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ మునిరాజు హెచ్చరించారు. జిల్లా లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ కృష్ణచైతన్య ఆదేశాల మేరకు నగరంలో సర్కిల్-2 పరిధిలో పటమట, గుణదల, మొగల్రాజపురం, లబ్బీపేట, మాచవరం, చుట్టుగుంట, గాంధీనగర్, గవర్నర్‌పేట, మధురానగర్, సత్యనారాయణపురం ప్రాంతాల్లో రేషన్ దుకాణాల్లో ఎలక్ట్రానిక్ కాటాలను బుధవారం తనిఖీ చేశారు. సంవత్సరానికి ఒకసారి ప్రభుత్వానికి కట్టాల్సిన ఫీజును ఆన్‌లైన్‌లో డీలర్‌లతో కట్టించి, కాటాలను పూర్తిగా పరిశీలించి కాలిబరేషన్ సరిచూసి సీళ్లు వేశారు. మిగిలిన ప్రాంతాల డీలర్లు కూడా కాటా సీళ్ల కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు. నవంబరు నుంచి శాఖాపరమైన తనిఖీల్లో కాటాలకు సీళ్లు వేయలేదని గుర్తిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బుడమేరు బాధితులకు పరుపు, దుప్పటి కిట్ల పంపిణీ



బాధితులకు కిట్లను అందిస్తున్న బార్ మాజీ అధ్యక్షుడు వి.గురునాథం, బార్ ప్రధాన కార్యదర్శి అరిగెల తదితరులు

విజయవాడ లీగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సిటీ సివిల్ కోర్టుల ఆవరణలో బుధవారం ఏలూరు ఫ్లాష్ టీం, విజయవాడ ఫ్లాష్ టీం, రాధారంగా మిత్రమండలి ఆధ్వర్యంలో న్యాయవాది యర్రంశెట్టి శ్రీనివాసరావు సౌజన్యంతో బుడమేరు వరద బాధితులు 200 మందికి పరుపు, దుప్పటి, గోడ గడియారం కిట్లను న్యాయవాదులు అందజేశారు.

సింగ్‌నగర్, కండ్రిక, పాయకాపురం, రాజీవ్‌నగర్ తదితర ప్రాంత వరద బాధితులకు దాదాపు 200 మంది సుమారు రూ.4 లక్షల విలువైన సామాగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో బార్ మాజీ అధ్యక్షుడు వి.గురునాథం, బెజవాడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరిగెల శివరాంప్రసాద్, సీనియర్ న్యాయవాదులు పడవల ఏడుకొండలు, నరహరిశెట్టి నర్సింహారావు, పీడీఎస్ నారాయణ, ఏలూరు సిటీ 23వ డివిజన్ కార్పొరేటర్ సాంబ, మల్లి, జనసేన కిరణ్, మేకల వెంకటేశ్వరరావు, నామాల కోటేశ్వరరావు, వేముల శ్రీనివాస్, ఏలూరు ఫ్లాష్ టీం, విజయవాడ ఫ్లాష్ టీం మమ్మీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగులు నీతి,నిజాయితీతో పనిచేయాలి



సీబీఐ అధికారుల ర్యాలీ

అడిషినల్ ఎస్పీ సీఆర్ దాస్

ఆటోనగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజం నిర్మించడంలో ప్రజలు భాగస్వామ్యమవ్వాలని, ప్రతి ఉద్యోగి నీతి నిజాయితీ, కార్యదక్షతతో పనిచేసి ప్రజలకు సేవలు అందించాలని అడిషినల్ ఎస్పీ సీఆర్ దాస్ అన్నారు. బుధవారం ఆటోనగర్ సీబీఐ అమరావత్ యూనిట్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్నస్ వీక్‌లో భాగంగా అవగాహన ర్యాలీని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం వరకు నిర్వహించారు. అవినీతి రహిత సమాజం నెలకొల్పాలని ప్లకార్డ్స్ చేతబూని నినదించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి చేస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబరు 1800 42500100, 08662550461ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు మధుసూదన్, దబాస్, ఇన్‌స్పెక్టర్లు టి. నరేష్, ఎం.గణేష్, సీబీఐ అధికారులు, సిబ్బంది, పలు శాఖల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో ప్రజల బెంబేలు

(భారతీనగర్, ఆంధ్రజ్యోతి)

కాలనీ మెయిన్, అంతర్గత రోడ్డుల్లో వీధికుక్కల స్వైరవిహారంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడో డివిజన్‌లోని ఎల్ఐసీ కాలనీ, జయప్రకాష్‌నగర్, ఫిల్మ్ నగర్ కాలనీ, వరలక్ష్మీనగర్, భారతీనగర్, శ్రీనివాస్ నగర్ బ్యాంక్ కాలనీ, విజయలక్ష్మీ కాలనీల్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఈ కాలనీలో మెయిన్, అంతర్గత రోడ్డుల్లో వీధికుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రాత్రి వేళల్లో వీధి కుక్కలు పెద్దగా అరుస్తూ స్థానికులను భయానికి గురిచేస్తున్నాయి. రాత్రివేళ రోడ్డులో వెళ్లే ద్విచక్ర వాహనదారుల వెంట పడుతున్నాయి.



ఈ సందర్భంగా వాహనం మీద నుంచి కింద పడి పలువురు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధాశ్రమానికి మైక్‌సెట్ బహూకరణ



వృద్ధాశ్రమానికి మైక్‌సెట్ అందజేస్తున్న నలంద ప్రిన్సిపాల్ అనురాధ, విద్యార్థినులు

లబ్బీపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో 2016 నుంచి ఎకోఫ్రెండ్లీ దీపావళి నిర్వహించడమే కాకుండా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు నలంద కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. నలంద కళాశాలలో బుధవారం ఎన్‌సీసీ 4ఎ గర్ల్స్ బెటాలియన్ విద్యా ర్థినులు దీపావళి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు కళాశాలలో వారం రోజుల పాటు వెయ్యికి పైగా మోడల్స్‌లో మట్టి ప్రమిదలు అలంకరించి ఎగ్జిబిషన్ నిర్వహించారని తెలిపారు. ప్రమిదలు అమ్మగా వచ్చిన రూ.30వేలతో కానూరులోని వృద్ధాశ్రమానికి మైక్‌సెట్ అందజేశారని తెలిపారు. వృద్ధాశ్రమంలోని వారితో కలిసి దీపావళి వేడుకలు జరుపుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ కో- ఆర్డినేటర్ ఎస్.కే.రఫియా బేగం పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం తొలగిస్తే పోరాటమే

డీబీపీ జాతీయ అధ్యక్షుడు కృష్ణస్వరూప్



ధర్నాచౌక్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్వరాజ్య మైదానంలోని అంబేడ్కర్ విగ్రహం, మ్యూజియంను రాష్ట్ర ప్రభుత్వం తొలగించే ప్రయత్నం చేస్తే జాతీయస్థాయిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడతామని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ హెచ్చరించారు. బుధవారం ఆయన అంబేడ్కర్ విగ్రహం, మ్యూజియాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సామాజికన్యాయ శిల్పి అన్నారు. ఈ విగ్రహం, మ్యూజియం తొలగించి 20 ఎకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మ్యూజియంలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మ్యూజియంను సక్రమంగా నిర్వహించాలన్నారు. పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల కృష్ణబాబు, లీగల్‌సెల్ కన్వీనర్ ఉప్పాడ రామచంద్రరెడ్డి, మీడియా విభాగం జిల్లా ఇన్‌చార్జ్ అంజిబాబు పాల్గొన్నారు.

త్రిశక్తిపీఠంలో 2 నుంచి మహాలింగార్చన

కృష్ణలంక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): త్రిశక్తిపీఠంలోని కాళీమాత ఆలయంలో నవంబరు 2వ తేదీ నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు మహాలింగార్చన అనగా పుట్టమన్నుతో చేసిన మృలింగములకు విశేష అర్చన, అభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్‌కుమార్, ఆలయ ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 9.30 గంటల వరకు ఈ పూజలు జరుగుతాయని తెలిపారు. పూజలు చేయదలచిన భక్తులు నెలరోజుల అభిషేకానికి రూ.1,500 చెల్లించి రశీదు పొందాలని వారు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 555



నగర వరం

రా.. రమ్మంటూ ప్రకృతి ప్రేమికులను పిలుస్తోన్న 'నగర వనం'

● పచ్చదనం పరుచుకున్న ప్రకృతి సౌందర్యం ● ఆకర్షిస్తున్న ఓపెన్ జిమ్, వాకింగ్, జాగింగ్ ట్రాక్స్ ● కొత్తూరు తాడేపల్లికి క్యూ కడుతున్న నగరవాసులు

తొలి మంచు కురిసింది... పచ్చదనం పరుచుకుంది. ఇక్కడి ప్రకృతి సౌందర్యాన్ని చూసి ఏ ఊటీనో.. కొడైకెనాల్ అనుకోకండి! ఇటీవల కురిసిన వర్షాలకు 'నగరవనం' పచ్చదనాన్ని పరచుకుంది. ప్రస్తుతం చలికాలం ప్రారంభమవటంతో తొలి మంచు తెరలు తెరలుగా పడుతుండగా పచ్చటి సౌందర్యం రా.. రమ్మంటూ ప్రకృతి ప్రేమికులను పిలుస్తోంది. విజయవాడ శివారు కొత్తూరు తాడేపల్లిలోని 'నగరవనం'లోని ప్రకృతి దృశ్యాలు మనల్ని అబ్బుర పరుస్తున్నాయి. కొండ సాణువులపై సహజసిద్ధంగా ఏర్పడిన ప్రకృతి సోయగాలతో అలరారుతున్న ప్రాంతం శీతాకాలం ప్రారంభం కావటంతో వాకింగ్, జాగింగ్‌లు చేసేవారితో కళకళలాడుతోంది. ఇక్కడికొస్తున్న పర్యాటకులను దృష్టిలో పెట్టుకుని దీని అభివృద్ధికి అటవీశాఖ అధికారులు తుదిమెరుగులు దిద్దుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

రాష్ట్ర విభజన తర్వాత రాజధాని అమరావతి చెంతనే ఉన్న విజయవాడ చుట్టుపక్కల పర్యాటకంగా చెప్పుకునే ప్రదేశాలు పెద్దగా ఏమీ లేవు. భవానీ ద్వీపం, కొండపల్లి రిజర్వు ఫారెస్ట్, మూలపాడు బటర్ ఫ్లై పార్క్ తర్వాత నగరం వనం మాత్రమే పచ్చటి ప్రకృతి రమణీయ ప్రాంతాలుగా ఉన్నాయి.

స్థానికంగా కాకుండా ఒక రాష్ట్ర రాజధాని స్థాయిలో ఇలాంటి ప్రకృతి రమణీయ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తద్వారా పర్యాటకరంగానికి మేలు జరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుత ప్రభుత్వం అందుకు తగిన కృషి చేస్తోంది.

పర్యాటక శాఖ నుంచి తప్పించి..

రాష్ట్ర ప్రభుత్వం నూతన పర్యాటక పాలసీలకు శ్రీకారం చుడుతున్న తరుణంలో ఇలాంటి ప్రాంతాలను అటవీశాఖ పర్యవేక్షణ నుంచి తప్పించటం మంచిదన్న వాదనలు వినిపిస్తున్నాయి. నగర వనా న్ని అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయటానికి అటవీశాఖ పర్యవేక్షణలో కాకుండా పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు గానీ, సీఆర్‌డీఏ లేదా అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ)ల్లో దేనికైనా ఒకదానికి అప్పగించాలన్న వాదనలు తెరపైకి వస్తున్నాయి. ఈ సంస్థల ద్వారానే పర్యాటకాభివృద్ధి పరుగులు పెట్టే అవకాశం ఉంది. త్వరితగతిన నిధులు, చక్కటి నిర్వహణ కూడా తోడవుతుంది.

నగరవనం అభివృద్ధికి అడుగులు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దీని అభివృద్ధికి బీజం పడగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలోని ఐదేళ్లూ నిర్లక్ష్యంగా వదిలేయటంతో నగరవనం అభివృద్ధి గాడి తప్పింది. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో నగరవనం అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. అభివృద్ధి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఈ ప్రాంతంలోకి వచ్చి ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. ప్రధానంగా నగర వనంలో దట్టంగా చెట్లు పెనవేసుకుపోయి ఉండటం, వాటి మధ్యన జాగింగ్, వాకింగ్ ట్రాక్‌లు అభివృద్ధితో పర్యాటకులు స్వచ్ఛమైన గాలి వీచే ప్రకృతి నడుమ గడిపే అవకాశం వచ్చింది.

నగర వనంలో ఎన్నెన్నో ప్రత్యేకతలు

కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరం వాతావరణం కాలుష్య కోరల్లో చిక్కుకుంది. ఈ పరిస్థితుల్లో ఇక్కడికి వచ్చి స్వచ్ఛమైన ఆక్సీజన్‌ను పీల్చుకోవటం అనేది వెలకట్టలేనిది. దీని కోసం ఎంతో మంది ట్రెక్కర్లు, వాకర్లు పెద్దసంఖ్యలో నగర వనానికి వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఓపెన్ జిమ్‌ను అద్భుతంగా అభివృద్ధి చేశారు. వాకింగ్, జాగింగ్ పూర్తయ్యాక ఓపెన్ జిమ్‌లో ప్రాక్టీసు చేసుకోవచ్చు. వీటన్నింటి తర్వాత కష్టపెట్టిన శరీరానికి కాస్తంత స్వచ్ఛమైన గాలిని







ఆస్వాదించటానికి కొన్ని షెల్టర్స్ ఏర్పాటు చేశారు. రాతి గుహ, బోటు హౌస్ తరహాలో కొన్ని షెల్టర్స్ ఉన్నాయి. ఇక్కడ కూర్చుని ప్రకృతి రమణీయతను ఆస్వాదిస్తుంటే అప్పటి వరకు కష్టించిన శరీరానికి ఉపశమనంతో పాటు, మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఒంటికి, దీర్ఘకాలిక ఆరోగ్యానికి మంచిది.

జంగిల్ క్లియరెన్స్ పూర్తి చేయాలి

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన వాటిలో గత ఐదేళ్లూ సరైన నిర్వహణ లేక వినియోగంలోకి రావటం లేదు. చుట్టూ గడ్డి, పిచ్చి మొక్కలుండటంతో విష సర్పాలు పొంచి ఉన్నాయేమోనని జాగర్లు, వాకర్లు ఆందోళన చెందుతున్నారు. ముందుగా జంగిల్ క్లియరెన్స్‌ను పూర్తి చేయాలి. వనం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించిన నేపథ్యంలో వీటినీ ఆధునీకరించనున్నారు. ఇంకా మరిన్నో ప్రత్యేకతలు సంతరించుకోనున్నాయి. ఈ ప్రాజెక్టు అభివృద్ధికి ఒక మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేయాల్సిన అవసరం ఉంది. గత ఐదేళ్ల నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాంతం నిర్మానుష్యంగా మారటంతో సంఘ విద్రోహ శక్తులకు స్థావరంగా మారింది. బీరు సీసాలు, సిగరెట్ పీకలు ఎక్కడ పడితే అక్కడ ఉన్నాయి. ఇటువంటి వాటిని దృష్టిలో పెట్టుకుని నగర వనంలో సెక్యూరిటీని మరింత పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఆహ్లాదంగా ఉంది.. వాకర్స్

పచ్చని చెట్ల మధ్య వాకింగ్ చేస్తుంటే ఎంతో ఆహ్లాదంగా ఉంటోంది. నగర వాసులకు ఇలాంటి ప్రకృతి వనాలు ఎంతో అవసరం. ఇటీవల కురిసిన వర్షాలకు కొత్త చెట్లతో పచ్చదనం మరింత పెరిగింది. కాకుండా జాగింగ్ చేసేటప్పుడు విష సర్పాలేమైనా ఉంటాయేమోనన్న అనుమానం ఉంది. ఇందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

పిల్లలు ఆడుకోవడానికి బాగుంది

అభివృద్ధి చెందిన నగరాలతో పోలిస్తే మన విజయవాడలో ఇటువంటి పార్కులు లేవు. ఉన్నా అరకొరే. ఈ నగరవనాన్ని కూడా ఇటీవలే తెరిచారు. వాకింగ్, జాకింగ్‌కు ఎంతో అనుకూలంగా ఉంది. ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకోవడానికి ఆట పరికరాలు ఎన్నో ఉన్నాయి. దీన్ని మరింత అభివృద్ధి చేస్తే సందర్శకుల సంఖ్య మరింత పెరుగుతుంది.



వ్యవసాయ పనిముట్లకు ఎన్యూమరేషన్ చేయించాలి

● ఏపీ రైతు సంఘం

గవర్నర్‌పేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు ప్రతినిధుల బృందం బుధవారం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్‌ను కలిసి కృష్ణానది, బుడమేరు వరదల్లో నష్టపోయిన కౌలు రైతులు, సన్న, చిన్నకారు రైతుల వ్యవసాయ మోటార్లు, ఆయిల్ ఇంజన్లు, వ్యవసాయ పరికరాలను ఎన్యుమరేషన్ చేసి నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం సమర్పించింది. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య, ప్రభాకరరెడ్డి, సహాయ కార్యదర్శి శివశంకర్, కౌలురైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు పాల్గొన్నారు.



దుర్గగుడిలో మహాలక్ష్మియాగం చేస్తున్న అర్చకులు, అధికారులు, భక్తులు

దుర్గగుడిలో మహాలక్ష్మియాగం

వన్‌టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ధనత్రయోదశి సందర్భంగా దుర్గగుడిలో బుధవారం మహాలక్ష్మీయాగం నిర్వహించారు. వేద పండితులు, అర్చకస్వాములు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిప్యూటీ ఈవో రత్నరాజు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మహాలక్ష్మీ అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మీ యాగం నిర్వహించారు. పూర్ణాహుతి యాగం ముగిసిన తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అవినీతికి పాల్పడితే చట్టపరమైన చర్యలు

● ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సుప్రజ

మొగల్రాజపురం, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఉన్నత భావాలతో పనిచేయాలని అవినీతికి పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ఇ.సుప్రజ చెప్పారు. అవినీతి నిరోధక శాఖ, స్థానిక కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల సంయుక్తంగా ఈ నెల 28 నుంచి నిర్వహిస్తున్న కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రాస్పరిటీ అనే శీర్షికతో అవగాహన వారోత్సవాల్లో భాగంగా బుధవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వాధికారులకు సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగమనేది ఒక బాధ్యతని చెప్పారు. తమ బాధ్యతను నిర్వర్తించగానికి ప్రభుత్వం ప్రజలు చెల్లించే పన్నుల నుంచి జీతభత్యాలు ఇస్తోందన్నారు. అయినా చాలా చోట్ల కొందరు ఉద్యోగులపై ఆరోపణలు వస్తుంటాయని వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా లంచాలివ్వకుండా ఎవరన్నా అడిగితే వెంటనే తమకు టోల్ ఫ్రీ నెంబరు 1064కు లేదా 944044057కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఎ. సునీత అధ్యక్షత వహించగా ఇన్‌స్పెక్టర్ జీవీవీ సత్యనారాయణ, ఎంవీఎస్ నాగరాజు, ఇతర ప్రభుత్వాధికారులు, పాల్గొన్నారు.

డీఎంఈ ఆఫీస్‌లో షార్ట్ సర్క్యూట్

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ సంభవించింది. బుధవారం ఉదయం యథావిధిగా విధులకు హాజరైన శానిటేషన్ సిబ్బంది డీఎంఈ చాంబర్‌ను శుభ్రం చేసేందుకు వెళ్లారు. అక్కడ లైట్లు, ఫ్యాన్లతో పాటు ఏసీ ఆన్ చేశారు. మరుక్షణంలోనే మంటలు వ్యాపించాయి. ఏసీ కిందనే సోఫా ఉండడంతో మంటలు సోఫాకు అంటుకుని తద్వారా డీఎంఈ చాంబర్ మొత్తం వ్యాపించాయి. శానిటేషన్ సిబ్బంది ఉన్నతాధికారులతో పాటు ఫైర్ కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. వారు ఆఘమేఘాలపై వచ్చి మంటలను ఆర్పారు. డీఎంఈ చాంబర్ మొత్తం ధ్వంసమైంది. చాంబర్‌లోని ఫర్నిచర్, కంప్యూటర్లు, ప్రింటర్లు పాడయ్యాయి. అయితే డీఎంఈ కార్యాలయం మొత్తం ఈ- ఆఫీస్ విధానం అమలు చేస్తున్నారు కాబట్టి ఎలాంటి ఇబ్బంది లేదని డీఎంఈ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ కె.అప్పారావు తెలిపారు.

డ్వాక్రా సంఘాలకు మరింత చేయూత

● మంత్రి నారాయణ

వన్‌టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాలకు మరింత చేయూతనిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ అన్నారు. వచ్చే అయిదేళ్లలో పేదల ఆదాయం రెట్టింపు చేసేలా ప్రణాళికలు తయారు చేస్తున్నట్టు చెప్పారు. బుధవారం మహాత్మాగాంధీ రోడ్డులోని అమరావతి కన్వెన్షన్ హాల్‌లో మెప్మా స్వయం సహాయక సంఘాల ప్రొఫైలింగ్ యాప్‌పై ఒకరోజు శిక్షణ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి నారాయణ మాట్లాడుతూ డ్వాక్రా, మెప్మా సంఘాల సభ్యులకు సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తారని, వారి ఆర్థిక పరిస్థితి బాగుంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుపడుతుందని బలంగా నమ్ముతారన్నారు. ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు చేరువ కావాలంటే డేటా ప్రొఫైలింగ్ అవసరమన్నారు. దీనిద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యుల డేటా నవంబరుకు పూర్తి అవుతుందని, డిసెంబరు నెలాఖరు నాటికి డేటా బేస్ మొత్తం సిద్ధమవుతుందన్నారు. జనవరి నుంచి సభ్యుల డేటా ప్రకారం ప్రభుత్వం పథకాలు అమలు చేస్తామన్నారు. మెప్మా ఏపీలో 2,78,407 స్వయం సహాయక సంఘాలున్నాయని, మొత్తం సభ్యులు 28,56,651 మంది ఉన్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం అమరావతి రాజధాని పనులపై అశ్రద్ధ వహించిందని, అప్పట్లో ఇచ్చిన టెండర్లకు కాలపరిమితి పూర్తయిందని, అందుకే టెండర్లను రద్దు చేసి మళ్లీ కేబినేట్ ఆమోదంతో టెండర్లు పిలుస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ అంతా నవంబరు 15 నుంచి డిసెంబరు 15 వరకు పూర్తయి జనవరి నుంచి రాజధాని పనులు మొదలుపెడతామన్నారు. ఈ వర్క్‌షాపులో మెప్మా ఎండీ తేజ్ భరత్, జిల్లాల పీడీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న మంత్రి నారాయణ

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

ధర్నాచౌక్: సమాజహితానికి నిరంతరం కృషి చేస్తున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పి.నారాయణ తెలిపారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాల మంజూరు, వైద్యసేవలు, అర్హులైన వారికి అక్రిడిటేషన్ల మంజూరు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. తెలుగు జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో బుధవారం జరిగిన దీపావళి సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గత ప్రభుత్వం గద్దె దిగడానికి జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఎన్జీవో నేత విద్యాసాగర్, ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యూవీఎస్ రవికుమార్, ప్రధానకార్యదర్శి కోనేరు క్రాంతికుమార్, ఉమ్మడి కృష్ణాజిల్లా మహిళా అధ్యక్షురాలు ఎం.లీలావతి, ఉపాధ్యక్షుడు వై వై వరప్రసాద్, ఎన్జీవో నగరశాఖ ఆర్గనైజింగ్ సెక్రటరీ వీవీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యే.. జర్నలిస్టులకు టపాసులు, స్వీట్స్ పంపిణీ చేశారు.

బిడ్డ ప్రాణం పోయింది... నా ప్రాణమైన నిలపండి!

● మైలవరం ప్రభుత్వ వైద్యశాలలో బిడ్డను కోల్పోయిన తల్లి ఆవేదన
● ఆసుపత్రి వద్ద బాధితురాలి బంధువుల ఆందోళన

మైలవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కాన్పు కోసం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చింది. కడుపులోనే బిడ్డ చనిపోయాడని వార్త చెప్పారు వైద్యులు. నువ్వయినా బతకాలంటే విజయవాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లాల్సిందేనని చెప్పడంతో కన్నీళ్లను దిగమింగుకుంది. ప్రైవేటు వైద్యశాలలో కాన్పు చేయించుకునే స్తోమత లేక సర్కారు వైద్యశాలను నమ్మి వచ్చిన ఓ అభాగ్యురాలికి ఎదురైన చేదు అనుభవం ఇది. నా బిడ్డ ప్రాణం తీశారు. కనీసం నా ప్రాణమైనా కాపాడండంటూ కడుపులోనే చనిపోయిన బిడ్డను రెండు చేతులతో పట్టుకొని కన్నీరు మున్నీరుగా రోదిస్తోందా తల్లి. ఈ ఘటన మైలవరంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో బుధవారం జరిగింది. పట్టణానికి చెందిన కట్టా వరలక్ష్మి (25) గర్భవతి. గర్భం దాల్చినప్పటి నుంచి సీహెచ్‌సీలోనే వైద్యం చేయించుకుంటుంది. నెలలు నిండటంతో ఈనెల 29న సాయంత్రం ఆసుపత్రిలో జాయినయ్యింది. బుధవారం నొప్పులు రావడంతో కడుపులోనే బిడ్డ చనిపోయింది. సాయంత్రం 6.30 గంటలకు తల్లికి కూడా సీరియస్ అని విజయవాడ తీసుకెళ్లాలని వైద్యులు బంధువులకు తెలిపారు. దీంతో వైద్యుల నిర్లక్ష్యం వల్లే బిడ్డ చనిపోయిందని, ఉదయం నుంచి ఉంచి సాయంత్రం విజయవాడ వెళ్లమంటున్నారని బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. తాను పూర్తి బాధ్యత తీసుకొని తల్లిని విజయవాడలో చేర్పించి మెరుగైన వైద్యం అందిస్తానని డాక్టర్ జెరీష హామీ ఇవ్వడంతో బంధువులు ఆందోళన విరమించారు.



బాధితురాలితో కలిసి సీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు

బీపీ అధికంగా ఉండటం వల్లే: డాక్టర్ జెరీష

తల్లికి బీపీ అధికంగా ఉండటం వల్లే కడుపులో బిడ్డ చనిపోయింది. శస్త్రచికిత్స చేస్తే తల్లి ప్రాణానికి హాని జరుగుతుందనే ఉద్దేశంతోనే విజయవాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశాం. నేను వెళ్లి అన్ని చూసుకుంటాను. ఇందులో నా నిర్లక్ష్యం ఏమీ లేదు.

వాహన్ పోర్టల్‌లో సమస్యలు నిజమే!

● నవంబరు నెలాఖరు నాటికి పరిష్కారమౌతుందని భావిస్తున్నాం
● ఆంధ్రజ్యోతితో డీటీసీ మోహన్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



ఆంధ్రజ్యోతి, విజయవాడ: వాహన్ పోర్టల్‌లో సమస్యల కారణంగా వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నవంబరు నెలాఖరులోగా సమస్యలన్నీ పరిష్కారమౌతాయని ఆశిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా ఉప రవాణా కమిషనర్ (డీటీసీ) మోహన్ చెప్పారు. బుధవారం ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన 'పరిహాసంగా పరివాహన్' కథనంపై ఆయన స్పందించారు. దేశవ్యాప్తంగా రవాణా సేవలన్నింటినీ ఏకీకృత పోర్టల్‌లో సేవలందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పరివాహన్‌ను తెచ్చామన్నారు. ఈ పోర్టల్‌ను పరీక్షించేందుకు ప్రయోగాత్మకంగా ఎన్టీఆర్ జిల్లాను ఎంపిక చేసిందని, ఇందులో సాఫ్ట్‌వేర్ సమస్యలు చాలానే ఉన్నాయని, దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం వాస్తవమేనన్నారు. ఈ సమస్యలపై ఇప్పటికే రవాణా కమిషనర్ ఈ నెల 29న రాష్ట్రంలోని జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వాహన్ పోర్టల్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను నివేదించాలని ఆదేశించారన్నారు. నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్‌ఐసీ) బృందంతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. పోర్టల్‌ను నవీకరించే వరకు పోర్టల్‌లో జరగని లావాదేవీలు మాన్యువల్‌గా జరిపేందుకు విజ్ఞప్తి చేయగా కమిషనర్ సానుకూలంగా స్పందించారని, దీనిపై రెండు, మూడు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు.

చంద్రబాబుకు ఏఐఎంపీఎల్‌బీ కృతజ్ఞతలు

విజయవాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంటులో తిరస్కరించేందుకు సహాయ సహకారాలు ప్రభుత్వం నుంచి ఉంటాయని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబుకి ముస్లిమ్స్ పర్సనల్ లా బోర్డు రాష్ట్ర జనరల్ సెక్రటరీ మౌలానా మహమ్మద్ ఫజ్లులూర్ రహీం కృతజ్ఞతలు తెలిపారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రతినిధులు ఈనెల 23న చంద్రబాబును మైనార్టీ మంత్రి ఎండీ ఫరూక్ సమక్షంలో కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. వెనుకబడిన ముస్లింలకు 4శాతం కోటాను మంజూరుపై హర్షం వ్యక్తం చేశారు. సీఎంతో భేటీకి సహకరించిన మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎం.ఫరూక్ షుబ్లితో పాటు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

సామాజిక సేవలో అగ్రగామి రెడ్‌క్రాస్




మాట్లాడుతున్న ఫరిదా

వన్‌టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అత్యవసర సమయాల్లో సేవలందించే సంస్థల్లో రెడ్‌క్రాస్ అగ్రగామిగా కొనసాగుతుందని సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీఈవో ఏకే ఫరిదా అన్నారు. కేబీఎన్ కళాశాల, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో క్లైమేట్ యాక్షన్ అవగాహన సదస్సు కాలేజీ ఆవరణలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏకె ఫరిదా మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఒక అంతర్జాతీయ మానవతా ఉద్యమమన్నారు. విద్యార్థులను చైతన్యవంతులను చేసి, తద్వారా ప్రపంచాన్ని అవగాహన పరిచే దిశగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. తొలుత రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనంట్‌కు నివాళులర్పించారు. సొసైటీ స్టేట్ కో-ఆర్డినేటర్ బి.వి.ఎస్.కుమార్, హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, పి.ఓలు ఎన్.సాంబశివరావు, బేగం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ అధికారిగా వెంకటేశ్వర్లు

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ (ఏపీఎంఐపీ) ప్రాజెక్ట్ ఆఫీసర్ సీబీ హరినాథరెడ్డిని ఉద్యానశాఖ అదనపు డైరెక్టర్‌గా బదిలీ చేసి, అక్కడున్న ఎం.వెంకటేశ్వర్లును ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించింది. డిప్యూటేషన్‌పై పరస్పరం బదిలీ చేసినట్టు బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

కోకో జోన్ల ఏర్పాటుకు కమిటీ: ఏలూరు జిల్లాలో కోకో రైతులకు మద్దతుగా ఫ్యాక్టరీ జోన్ల కేటాయింపునకు ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఇద్దరు లేదా ముగ్గురు కోకో రైతులు, ఒకరు లేదా ఇద్దరు చొప్పున కోకో ప్రాసెసర్స్, ఆయిల్‌పామ్ ప్రాసెసర్స్, ఉద్యానశాఖ అదనపు సంచాలకులు, ఉద్యాన శాస్త్రవేత్త, జిల్లా ఉద్యాన అధికారితో కమిటీని ఏర్పాటు చేయాలని బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా.. రాష్ట్రంలో మత్స్యకారులు చేపల వేటకు నమోదు చేసుకున్న మర పడవలకు రాయితీ డీజిల్ సరఫరా కోసం కొత్తగా మరో 10 హెచ్ఎస్‌డీ ఔట్‌లెట్లకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.


Ministry of Home Affairs
Government of India
STATUE OF UNITY
एक भारत, श्रेष्ठ भारत.
A tribute to
Sardar Vallabhbhai Patel, on the occasion of his birth anniversary
National Unity Day 2024
PM Shri Narendra Modi will honour Sardar Patel with a floral tribute and address the nation
Various Programmes
• Rashtriya Ekta Divas Parade
• Indian Air Force fly past (Suryakiran)
• Daredevil riders show
• Traditional martial arts
• Gujarat Women Police Celebrate Nari Shakti by program on 'Atulya Bharat'
• NCC special show
• School band display
• Cultural programme
"The birth anniversary of Sardar Patel and National Unity Day is not just a date for us; rather, it is a celebration that showcases India's strength."
– PM Shri Narendra Modi
Date: 31st October, 2024 | Time: 07:15 AM | Venue: Ektanagar, Gujarat
Watch Live Telecast on DD NEWS



ఈ షేర్లే తారాజువ్వలు

పెట్టుబడులకు ఇదే అదును

ప్రస్తుతం స్టాక్‌మార్కెట్‌లో దిద్దుబాటు కొనసాగుతోంది. అయినా గత ఏడాది దీపావళితో పోలిస్తే నిఫ్టీ ఇప్పటి వరకు మదుపరులకు దాదాపు 25 శాతం లాభాలు పంచింది. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగే మూరత్ ట్రేడింగ్‌లో కొనేందుకు కొన్ని కంపెనీల షేర్లు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. సంవత్, 2081 ట్రేడింగ్ రోజు పెట్టుబడి లాభాల కోసం వివిధ బ్రోకరేజి సంస్థలు రికమండ్ చేసిన కొన్ని కంపెనీల షేర్ల వివరాలు ఇలా ఉన్నాయి

ఐసీఐసీఐ బ్యాంక్

సంవత్ 2080 నుంచి ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు 45 శాతం లాభాలు పంచాయి. 2021 ఫిబ్రవరితో పోల్చినా ఈ కౌంటర్ మదుపరులకు 158 శాతం లాభాలు పంచింది. ఈ షేర్లు బుధవారం రూ.1,312 వద్ద ముగిశాయి. ప్రస్తుతం దిద్దుబాటులో ఉన్న ఈ షేర్లను రూ.1,773 టార్గెట్‌తో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.1,215-1,150.

ఐటీసీ

ఐటీసీ షేరు కూడా ప్రస్తుతం ఆకర్షణీయంగానే కనిపిస్తోంది. బుధవారం రూ.491 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌కు రూ.460-445 వద్ద గట్టి మద్దతు కనిపిస్తోంది. వచ్చే ఏడాది కాలంలో రూ.633 టార్గెట్‌తో పొజిషన్లు తీసుకోవచ్చు. రెసిస్టెన్స్ రేంజి : రూ.545, రూ.579

మాక్రోటెక్ డెవలపర్స్

గత నాలుగు నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ షేరు బుధవారం రూ.1,182 వద్ద ముగిసింది. గత ఏడాది జూన్ తర్వాత ఈ కంపెనీ షేర్లు 20 నెలల సగటు కంటే దిగువన ట్రేడవడం ఇదే తొలిసారి. రూ.974 స్టాప్‌లాస్‌తో రూ.1,600 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. రెసిస్టెన్స్ రేంజి : రూ.1,310, రూ.1,380.

వరుణ్ బేవరేజెస్

ఈ కంపెనీ షేర్లు బుధవారం రూ.606 వద్ద ముగిశాయి. 2018 ఏప్రిల్‌లో రూ.37 వద్ద ట్రేడైన ఈ కంపెనీ షేర్లు, ఇప్పటి వరకు మదుపరులకు 1700 శాతం లాభాలు పంచాయి. రూ.527 వద్ద గట్టి మద్దతు లభిస్తోంది. టెక్నికల్ చార్టుల ప్రకారం చూస్తే ఈ షేరు రూ.922 వరకు పెరగవచ్చు. రెసిస్టెన్స్ రేంజి : రూ.727, రూ.800.

థైరోకేర్ టెక్నాలజీస్

ఈ షేర్లు బుధవారం రూ.949 వద్ద ముగిశాయి. ఈ ఏడాది జూలై నుంచి బ్రేకౌట్ కనిపిస్తోంది. గత నాలుగు నెలల్లోనే మదుపరులకు 53 శాతం లాభాలు పంచాయి. రూ.905పైన ట్రేడైనంత వరకు ఈ కౌంటర్‌లో అప్‌ట్రెండ్ కొనసాగుతుందని భావించవచ్చు. సంవత్ 2081లో కంపెనీ షేర్లు 47.2 శాతం లాభంతో రూ.1,400 వరకు పెరిగే అవకాశం కనిపిస్తోంది. రెసిస్టెన్స్ రేంజి : రూ.1,125, రూ.1,230. ఒకవేళ రూ.905 కంటే దిగువకు వస్తే రూ.850-790 మధ్య గట్టి మద్దతు లభిస్తుందని భావించాలి.

రిలయన్స్ ఇండస్ట్రీస్

ఆర్ఐఎల్ షేర్లు ఇప్పటికీ ఆకర్షణీయంగానే కనిపిస్తున్నాయి. 1:1 బోనస్ తర్వాత బ్రోకరేజి సంస్థలు మరింతగా ఈ కౌంటర్‌పై దృష్టి పెట్టాయి. ఈ గ్రూప్‌నకు వచ్చే 3-4 సంవత్సరాల్లో జియో, రిటైల్ వ్యాపారాలు మరింత దన్నుగా నిలవబోతున్నాయి. ఇది చాలదన్నట్టు హరిత ఇంధనాల పై సైతం కంపెనీ ప్రత్యేక దృష్టి పెట్టింది. దీంతో 2024-27 మధ్య కాలంలో ఆర్ఐఎల్ నికర లాభాలు ఏటా 15 శాతం వరకు పెరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం రూ.1,344 వద్ద ట్రేడవుతున్న ఆర్ఐఎల్ షేర్లు వచ్చే 6-12 నెలల్లో మదుపరులకు 28 శాతం వరకు లాభాలు పంచే అవకాశం ఉంది.

పవర్‌గ్రిడ్

పెట్టుబడులకు పెద్దగా ఢోకా లేకుండా, స్థిరమైన రాబడులు, లాభాల కోసం చూసే మదుపరులకు పవర్‌గ్రిడ్ కంపెనీ షేర్లు అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం కంపెనీ షేర్లు రూ.318 వద్ద ట్రేడవుతున్నాయి. వచ్చే 6-12 నెలల్లో రూ.383 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. పీఎస్‌యూ కావడంతో ఏటా వచ్చే లాభాల నుంచి మంచి డివిడెండ్ కూడా చెల్లిస్తోంది.

బజాజ్ ఫైనాన్స్

మదుపరులకు మంచి లాభాలు పంచిన అతి కొద్ది కంపెనీల్లో బజాజ్ ఫైనాన్స్ ఒకటి. ప్రస్తుతం రూ.6,955 వద్ద ట్రేడవుతోంది. వచ్చే ఆరు నుంచి 12 నెలల్లో రూ.8,552 టార్గెట్‌తో పొజిషన్లు తీసుకోవచ్చు.

ఐసిఐసీఐ లొంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్

ప్రైవేట్ బీమా కంపెనీల్లో మోటార్ ఇన్సూరెన్స్ మార్కెట్‌లో కంపెనీదే హవా. ఫైర్, ఇంజినీరింగ్, మెరైన్, లయబిలిటీ ఇన్సూరెన్స్‌లోనూ కంపెనీకి మంచి పట్టుంది. ప్రస్తుతం ఈ షేరు రూ.1,928 వద్ద ట్రేడవుతోంది. వచ్చే 6-12 నెలల్లో రూ.2,450 టార్గెట్‌తో మదుపరులు పొజిషన్లు తీసుకోవచ్చు.

జిందాల్ స్టీల్ అండ్ పవర్

దేశంలోని ప్రముఖ స్టీల్ కంపెనీ జిందాల్ స్టీల్ అండ్ పవర్ ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుతం 96 లక్షల టన్నులు. దీన్ని 2026 మార్చి నాటికి 159 లక్షల టన్నులకు విస్తరించే పనిలో ఉంది. కంపెనీ షేర్లు ప్రస్తుతం రూ.919 వద్ద కోట్ అవుతున్నాయి. వచ్చే ఆరు నుంచి 12 నెలల్లో రూ.1,150 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు.

స్వర్ణ శోభితం!

క్యూ3లో 18% పెరిగిన డిమాండు

248.3 టన్నులుగా నమోదు: డబ్ల్యూజీసీ



ముంబై: విపణిలో బంగారం ధరలు దూసుకుపోతున్నా డిమాండు ఏ మాత్రం తగ్గడంలేదు. ఈ ఏడాది జూలై- సెప్టెంబరు త్రైమాసికంలో దేశంలో పసిడి డిమాండ్ వార్షిక ప్రాతిపదికన 18 శాతం పెరిగి 248.3 టన్నులకు చేరుకుంది. విలువపరంగా డిమాండ్ 53 శాతం పెరిగి రూ.1,65,380 కోట్లుగా నమోదైనట్టు ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) వెల్లడించింది. అయితే కేంద్రం బంగారం దిగుమతిపై సుంకం తగ్గించడంతో స్వర్ణాభరణాల ధర గణనీయంగా తగ్గడం డిమాండ్ పునరుద్ధరణకు ప్రధానంగా దోహదపడిందని డబ్ల్యూజీసీ పేర్కొంది. గత ఏడాదిలో ఇదే కాలానికి గోల్డ్ డిమాండ్ 210.2 టన్నులుగా, విలువపరంగా రూ.1,07,700 కోట్లుగా నమోదైంది.

క్యూ4 ఆశావహమే

క్యూ3లో స్వర్ణాభరణాల విక్రయాలు 10 శాతం పెరిగి 171.6 టన్నులకు చేరాయి. మూడో త్రైమాసికంలో బంగారం డిమాండ్ ఇంత బలంగా ఉండడం 2015 తర్వాత ఇదే ప్రథమమని డబ్ల్యూజీసీ రీజినల్ సీఈఓ, ఇండియా సచిన్ జైన్ అన్నారు. ధనత్రయోదశి, పెళ్లిళ్ల సీజన్ కొనుగోళ్లతో నాలుగో త్రైమాసికంలోనూ డిమాండ్ బలంగానే ఉండనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

4 ఏళ్ల కనిష్ఠానికి వార్షిక డిమాండ్

పూర్తి ఏడాదికి డిమాండ్ 700-750 టన్నులకు పరిమితం కావచ్చని డబ్ల్యూజీసీ అంచనా. 2020 తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి. 2023లో గోల్డ్ డిమాండ్ 761 టన్నులుంది.

పసిడిలో పెట్టుబడులు పెరిగాయ్..

ఈ క్యూ3లో పసిడిలో పెట్టుబడులు 41 శాతం పెరిగి 76.7 టన్నులుగా నమోదైంది. 2012 తర్వాత మూడో త్రైమాసికంలో నమోదైన అత్యధిక ఇన్వెస్ట్‌మెంట్ ఇదే.

ప్రథమార్ధంలో పసిడి దిగుమతులు 21% అప్

ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో పసిడి దిగుమతులు 21.78 శాతం పెరిగి 2,700 కోట్ల డాలర్లకు (రూ.2,26,800 కోట్లు) పెరిగాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. మూడో త్రైమాసికంలో పసిడి దిగుమతి 87% పెరిగి 360.2 టన్నులకు చేరింది.

రూ.82,000 దాటిన బంగారం

దేశీయంగా బంగారం ధర సరికొత్త ఆల్‌టైం రికార్డు గరిష్ఠానికి పెరిగింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర మరో రూ.1,000 పెరిగి రూ.82,400కు చేరుకుంది. కిలో వెండి సైతం రూ.1,300 పెరుగుదలతో రూ.1.01 లక్షలకు ఎగబాకింది. ధనత్రయోదశి, దీపావళి కొనుగోళ్ల డిమాండ్‌తోపాటు అంతర్జాతీయంగా వీటి ధరలు గణనీయంగా పెరగడం ఇందుకు ప్రధాన కారణం.

2,800 డాలర్లకు ఔన్స్

ఇంటర్నేషనల్ మార్కెట్లోనూ బంగారం సరికొత్త జీవనకాల గరిష్ఠానికి ఎగబాకింది. ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం తొలిసారిగా 2,800 డాలర్లకు చేరగా.. వెండి 34.45 డాలర్ల స్థాయిలో ట్రేడయింది.

యూకే నుంచి భారత్‌కు లక్ష కిలోల బంగారం

న్యూఢిల్లీ, అక్టోబరు 30: ధనత్రయోదశి రోజు బంగారం కొంటే మంచిదని చాలామంది భావిస్తారు! తమకు ఉన్నంతలో ఎంతో కొంత వెచ్చింది పసిడి కొనుగోలు చేస్తారు! ఆర్బీఐకి అలాంటి సెంటిమెంటు ఉందో లేదో తెలియదుగానీ.. ధనత్రయోదశి తిథి ఉన్న అక్టోబరు 29న లండన్‌లోని 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్' నుంచి ఏకంగా 102 టన్నుల బంగారం తెప్పించింది! అంటే అక్షరాలా ఒక లక్షా రెండువేల కిలోల బంగారం!! ఆ బంగారాన్ని మన దేశంలోని అత్యంత సురక్షితమైన నిల్వ కేంద్రాల్లో భద్రపరిచింది. ఆర్బీఐ తాజా గణాంకాల ప్రకారం.. సెప్టెంబరు నెలాఖరునాటికి ఆర్బీఐ వద్ద ఉన్న బంగారం నిల్వలు 855 టన్నులు. అందులో 510.5 టన్నుల బంగారం మనదేశంలోని స్టోరేజీ కేంద్రాల్లోనే ఉంది. మరో 324 టన్నుల బంగారం ఇంకా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ వద్దే ఉంచింది (ఈ రెండు బ్యాంకులూ యూకేలోనే ఉన్నాయి). ఇంకో 20 టన్నుల బంగారాన్ని గోల్డ్ డిపాజిట్ పథకాల ద్వారా నిర్వహిస్తోంది. ఒకవైపు రష్యా-ఉక్రెయిన్ యుద్ధం.. మరోవైపు ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య సంఘర్షణ.. ఇజ్రాయెల్-ఇరాన్ నడుమ పెరుగుతున్న ఘర్షణ వాతావరణం.. ఇలా అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో విదేశాల్లో ఉన్న మన బంగారాన్ని ఆర్బీఐ కొన్నాళ్లుగా భారత్‌కు తీసుకొచ్చేస్తోంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	81,160 ▲	74,400 ▲	1,09,000 ▲
ముంబై	79,580 ▲	72,900 ▲	98,040 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

31వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	555
వరంగల్	537	గోదావరి	550
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	115	విజయవాడ	115
వరంగల్	115	గుంటూరు	118
కరీంనగర్	115	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	129
కర్నూలు	115	నెల్లూరు	129
విశాఖపట్నం	107	అనంతపురం	129
గోదావరి	115		

అదానీలకు సెబీ షోకాజ్ నోటీసులు

న్యూఢిల్లీ: గౌతమ్ అదానీ, ఆయన సోదరులు రాజేశ్, వసంత్ అదానీలకు సెబీ ఈ మధ్యనే షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఓ ఆంగ్ల మీడియా కథనం ఈ విషయాన్ని వెల్లడించింది. అలాగే, ప్రణవ్ అదానీ, ప్రణవ్ వోరా ఇంకా అదానీ గ్రూప్‌తో సంబంధం ఉన్న ధర్మేశ్ పరేఖ్, ఓపల్ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, గల్ఫ్ ఏషియా ట్రేడ్, ఎమర్జింగ్ ఇండియా ఫోకస్ ఫండ్, బెర్ముడా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఫండ్ గ్లోబల్ మాక్రో అసెట్ మేనేజ్‌మెంట్ కూడా సెబీ నుంచి నోటీసులు అందుకున్నట్లు కథనం పేర్కొంది. మొత్తంగా అదానీ గ్రూప్‌తో సంబంధం ఉన్న 32 సంస్థలు, 4 లిస్టెడ్ కంపెనీలకు సెక్యూరిటీల చట్టంలోని సెక్షన్ 11, 11బీ ప్రకారంగా సెబీ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

లాభాల స్వీకారంతో కుంగిన మార్కెట్

ముంబై: బుధవారం ఈక్విటీ మార్కెట్ లాభాల స్వీకారంతో కుంగిపోయింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాల షేర్లలో అమ్మకాలు జోరుగా సాగాయి. కార్పొరేట్ ఫలితాలు నిరాశావహంగా ఉండడం, విదేశీ నిధులు తరలిపోవడం సెంటిమెంట్‌ను దెబ్బ తీశాయి. ఫలితంగా సెన్సెక్స్ 426.85 పాయింట్లు నష్టపోయి 79942.18 వద్ద ముగియగా నిఫ్టీ 126 పాయింట్లు నష్టపోయి 24340.85 వద్ద ముగిసింది. స్టాక్ ఎక్స్ఛేంజిల వద్ద ఉన్న గణాంకాల ప్రకారం మంగళవారం విదేశీ ఇన్వెస్టర్లు రూ.548.69 కోట్ల విలువ గల షేర్లు విక్రయించారు. అయితే ఎఫ్ఐఐల అమ్మకాల జోరు తగ్గడం ఒక సానుకూలాంశమని పరిశీలకులంటున్నారు. "భారత షేర్లు అమ్ము, చైనా షేర్లు కొను" అనే వైఖరి ముగింపు దశకు వచ్చిందనేందుకు ఇది సంకేతమన్నది వారి అభిప్రాయం. దీనికి తోడు దేశీయ సంస్థలు, రిటైల్ ఇన్వెస్టర్ల నిధులు జోడై సమీప భవిష్యత్తులో మార్కెట్ ఉత్తేజం పొందవచ్చునని వారంటున్నారు.

అదానీ షేర్లు జూమ్: అదానీ గ్రూప్ షేర్ల మార్కెట్ విలువ ఈ వారంలో రూ.39,000 కోట్లు పెరిగి రూ.15.5 లక్షల కోట్లకు చేరింది. గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీల్లో 9 కంపెనీల మార్కెట్ విలువ గత మూడు రోజుల్లో గణనీయంగా పెరిగింది. రూ.23,268 కోట్ల విలువతో అదానీ ఎంటర్‌ప్రైజెస్ అగ్రగామిగా నిలవగా అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ రూ.9,440 కోట్లతో రెండో స్థానంలో ఉంది. గ్రూప్‌లో ఒక్క అదానీ పవర్ లిమిటెడ్ మాత్రమే నష్టపోయింది.

పరువు కోసం పోరాటం

ఒత్తిడిలో రోహిత్ సేన

- న్యూజిలాండ్‌కు భలే చాన్స్
- రేపటి నుంచి మూడో టెస్ట్



జైస్వాల్‌తో కోహ్లీ సరదా

ఉదయం 9.30 నుంచి జియో సినిమాలో..

ముంబై: పుష్కరం తర్వాత సొంతగడ్డపై టెస్ట్ సిరీస్ చేజార్చుకొన్న భారత్.. కనీసం పరువు దక్కించుకోవాలనుకొంటోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి వాంఖడేలో న్యూజిలాండ్‌తో జరిగే ఆఖరి, మూడో టెస్ట్‌లో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. మరోవైపు మూడు టెస్ట్‌ల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో నిలిచిన కివీస్ వైట్‌వా‌ష్‌తో సరికొత్త రికార్డు నెలకొల్పాలన్న ఆరాటంతో ఉంది. బెంగళూరు, పుణె టెస్టుల్లో టీమిండియా ఓటమికి ప్రధాన కారణం బ్యాటింగ్ వైఫల్యమే. గతంలో కూడా మన బ్యాటర్లు స్పిన్‌ను ఎదుర్కోవడంలో తడబడుతున్నా.. అశ్విన్, జడేజా తమ స్పిన్ మాయాజాలంతో ఆ లోటు కనిపించకుండా చేసేవారు. కానీ, కివీస్‌పై వీరిద్దరూ పెద్దగా ప్రభావం చూపలేకపోవడంతో.. బ్యాటింగ్ ఆర్డర్ బలహీనతలు బహిర్గతమయ్యాయి. సీనియర్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆటతీరు తీవ్ర విమర్శలకు గురవుతోంది. స్పిన్‌ను ఎదుర్కోవాలంటే చక్కని ఫుట్‌వర్క్ అవసరం. కానీ, రోహిత్ క్రీజులో చురుగ్గా కదల్లేకపోతున్నాడు. ఆడిన నాలుగు ఇన్నింగ్స్‌లో 2, 52, 0, 8 పరుగులు చేసిన హిట్‌మ్యాన్.. మూడుసార్లు బౌల్డ్ అయ్యాడు. దీంతో అతడి వయసుపై చర్చ మొదలైంది. రోహిత్ కెప్టెన్సీని కూడా సీనియర్లు తప్పుబడుతున్నారు. ప్రత్యర్థిపై వ్యూహాత్మకంగా ఒత్తిడి పెంచలేదని విమర్శిస్తున్నారు. కోహ్లీ కూడా పెద్దగా రాణించలేదు. ఒక్క అర్ధ శతకం మినహా మూడుసార్లు 0, 1, 17 పరుగులు మాత్రమే చేశాడు. దీంతో వీరిద్దరూ జట్టుకు భారంగా మారారంటూ సోషల్ మీడియాలో విమర్శలు మొదలయ్యాయి. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ ఫర్వాలేదనిపించినా.. పంత్, జడేజా, అశ్విన్ పెద్ద స్కోర్లు చేయకపోవడం జట్టును ఆందోళనకు గురి చేస్తోంది. సర్ఫరాజ్ ఒక్క ఇన్నింగ్స్‌తో మురిపించినా.. మెలికలు తిరిగే వికెట్‌పై బోల్తాపడుతున్నాడు. ఇక, బౌలింగ్‌లో జట్టు ఎంతగానో ఆధారపడిన ఆఫ్ స్పిన్నర్లు జడేజా, అశ్విన్ తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేశారు. బుమ్రా కూడా తనదైన మార్క్ వేయలేకపోయినా.. కుల్దీప్ స్థానంలో జట్టులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్ సత్తా చాటాడు. కాగా, ముంబై టెస్ట్‌కు పేసర్ ఆకాశ్‌దీప్ స్థానంలో హర్షిత్ రాణాను బరిలోకి దించే అవకాశం ఉంది.



లాథమ్

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, కోహ్లీ, రిషబ్ పంత్, సర్ఫరాజ్, జడేజా, అశ్విన్, వాషింగ్టన్ సుందర్, ఆకాశ్ దీప్/రాణా, బుమ్రా.

న్యూజిలాండ్: లాథమ్ (కెప్టెన్), కాన్వే, యంగ్, రచిన్, మిచెల్, బ్లండెల్ (కీపర్), ఫిలిప్స్, శాంట్నర్, సౌథీ, ఎజాజ్ పటేల్, ఓరోక్.

ఊడ్చేయాలని...

చరిత్ర సృష్టించిన న్యూజిలాండ్ ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడుతోంది. మూడో టెస్టును కూడా గెలిచి క్లీన్‌స్వీప్ చేసి వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలను మెరుగుపర్చుకోవాలనుకొంటోంది. ఎంతో అనుభవం ఉన్న కేన్ విలియమ్సన్ సిరీస్‌కే దూరమైనా.. అలవోకగా గెలిచారు. రచిన్ రవీంద్ర, కాన్వే, యంగ్, కెప్టెన్ లాథమ్‌తో బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. పుణె టెస్టులో శాంట్నర్ తన స్పిన్ మాయాజాలంతో మ్యాచ్‌ను శాసించాడు. అతడి నుంచి జట్టు మరోసారి అదే తరహా ప్రదర్శనను ఆశిస్తోంది. ఎజాజ్ పటేల్, ఫిలిప్స్‌తోపాటు పేసర్ ఓరోక్ కూడా చక్కని సహకారం అందిస్తున్నాడు. మొత్తంగా చూస్తే వరుస ఓటములతో రగిలిపోతున్న భారత్.. ఈ మ్యాచ్‌లో విరుచుకుపడే చాన్సుంది. కానీ, అదను చూసి దెబ్బతీయడానికి కివీస్ వ్యూహాలు రచిస్తోంది.

మళ్లీ స్పిన్ వికెట్

మూడో టెస్టుకు కూడా స్పిన్ వికెట్‌నే తయారు చేస్తున్నట్టు సమాచారం. టీమిండియా మేనేజ్‌మెంట్ కూడా కొన్ని సూచనలు చేసినట్టు తెలుస్తోంది. వాంఖడే ఎర్రమట్టి పిచ్ స్పిన్‌కు అనుకూలం. గత రెండు టెస్టుల్లో మెలికలు తిరిగే వికెట్‌పై తడబడినా.. మళ్లీ అదే తరహా వ్యూహాన్నే టీమిండియా అనుసరించనుందట. ఈ నేపథ్యంలో టాస్ కీలకం కానుంది.

35 మంది నెట్ బౌలర్లతో

కివీస్ స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కోవడానికి భారత జట్టు ముమ్మరంగా సాధన చేసింది. ముఖ్యంగా మూడో టెస్ట్‌కు కూడా మెలికలు తిరిగే పిచ్‌నే తయారు చేస్తారన్న వార్తలు వస్తుండడంతో.. ఆ దిశగా దృష్టి సారించింది. న్యూజిలాండ్ స్పిన్నర్ శాంట్నర్ భారత బ్యాటర్లను తీవ్రంగా ఇబ్బందిపెట్టాడు. ఈ నేపథ్యంలో మొత్తంగా 35 మంది నెట్ బౌలర్లతో మనోళ్లకు బంతులేయించారు. వీరిలో ఎక్కువ మంది స్పిన్నర్లే. బుధవారం జరిగిన నెట్ సెషన్‌లో భారత ఆటగాళ్లందరూ తీవ్రంగా శ్రమించారు. కోహ్లీ పూర్తిగా షాట్లు ఆడుతూ కనిపించాడు. క్రీజు వైట్‌లైన్లను ప్రత్యేకంగా పొడిగించి.. వేర్వేరు చోట్ల బంతులేస్తూ బ్యాటర్లను పరీక్షించారు. వికెట్‌పై ఉదయం పచ్చిక కనిపించినా.. తేమను బయటకు తీసేందుకు బరువైన రోలర్‌తో చదును చేశారు. అయితే, సాయంత్రానికి పిచ్‌పై కొద్దిగా నీళ్లు చల్లి మళ్లీ తేలికైన రోలర్‌తో చదును చేశారు.

స్వదేశంలో చివరిసారి 2000లో దక్షిణాఫ్రికా చేతిలో భారత్ 0-2తో వైట్‌వాష్‌కు గురైంది.

'పారిస్' క్వార్టర్స్‌కు బోపన్న జోడీ

పారిస్: టెన్నిస్ డబుల్స్ స్టార్ రోహన్ బోపన్న పారిస్ మాస్టర్స్ ఏటీపీ 1000 ఈవెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్నాడు. ఆస్ట్రేలియాకు చెందిన మాథ్యూ ఎబ్డెన్‌తో కలిసి డబుల్స్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరాడు. ప్రీక్వార్టర్‌ఫైనల్లో మూడోసీడ్ బోపన్న-మాథ్యూ జోడీ 6-4, 7-6 (7-5)తో మార్సెలో మెలో (బ్రెజిల్)-అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) జంటపై విజయం సాధించింది.

నితీశ్, ఈశ్వరన్‌పై దృష్టి

భారత్, ఆసీస్ 'ఎ' జట్ల మ్యాచ్ నేటినుంచి



నితీశ్

మాకే (ఆస్ట్రేలియా): భారత్ 'ఎ' జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో గురువారం నుంచి జరిగే నాలుగు రోజుల మ్యాచ్‌లో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో.. తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి, బ్యాటర్ అభిమన్యు ఈశ్వరన్, పేసర్ ప్రసిద్ధ్ కృష్ణపై ప్రధానం దృష్టి నిలిచింది. ఈ ముగ్గురు ఆస్ట్రేలియాతో జరిగే బోర్డర్-గవాస్కర్ టెస్ట్ సిరీస్‌కు ఎంపికైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా పిచ్‌లు, ఇక్కడి పరిస్థితుల్లో నితీశ్, ఈశ్వరన్, ప్రసిద్ధ్ ఎలా రాణిస్తారన్నది ఆసక్తికరం కానుంది. కంగారూలతో టెస్టులకు ఒకవేళ రోహిత్ దూరమైతే.. ఈశ్వరన్‌ను ఓపెనర్‌గా పంపాలని జట్టు మేనేజ్‌మెంట్ యోచిస్తోంది. ఇక, పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ సెలెక్టర్లు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఉవ్విళ్లూరుతున్నాడు. ప్రసిద్ధ్ ఈ మ్యాచ్‌లో రాణిస్తే..టెస్ట్ సిరీస్‌కు బుమ్రా, సిరాజ్‌తో పాటు మూడో పేసర్‌గా అతడిని ఆడించవచ్చు. ఆంధ్రకు చెందిన రికీ భుయ్ కూడా జట్టులో చోటు దక్కించుకున్నాడు. కెప్టెన్ రుతురాజ్, టాప్, మిడిలార్డర్ బ్యాటర్లు సాయి సుదర్శన్, పడిక్కళ్, పేసర్ యశ్ దయాల్, నవ్‌దీప్ సైనీ కూడా సత్తా చాటాలనుకుంటున్నారు.

ప్రీక్వార్టర్స్‌కు ఆయుష్, సతీశ్

సార్‌బ్రకెన్ (జర్మనీ): భారత షట్లర్లు ఆయుష్ శెట్టి, సతీశ్ కుమార్ కరుణాకరన్ హైలో ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ప్రీక్వార్టర్స్ చేరారు. బుధవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్లో ఆయుష్ 21-12, 21-17తో జోకిమ్ (ఫిన్లాండ్)పై, సతీశ్ 20-22, 24-22, 21-17తో భారత్‌కే చెందిన చిరాగ్ సేన్‌పై గెలుపొందారు.

మళ్లీ ఆర్సీబీ కెప్టెన్ విరాట్?

బెంగళూరు: వచ్చే ఐపీఎల్ సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సారథ్య బాధ్యతలను మళ్లీ విరాట్ కోహ్లీ చేపట్టే అవకాశముంది. మొదటిసారిగా 2013లో ఆర్సీబీ జట్టు పగ్గాలు స్వీకరించిన విరాట్.. 2021లో కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. అప్పటినుంచి డుప్లెసి జట్టు సారథిగా వ్యవహరిస్తున్నాడు. అయితే, ఈసారి డుప్లెసిని వదులుకోవాలని జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది. కెప్టెన్సీ బాధ్యతలను కొత్త ఆటగాడికి అప్పగించాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగానే గుజరాత్ టైటాన్స్‌కు చెందిన శుభ్‌మన్ గిల్‌ను ఆర్సీబీకి రప్పించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. కానీ, గిల్ మాత్రం తన పాత ఫ్రాంచైజీతోనే ఉండాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. దీంతో మళ్లీ కోహ్లీకే సారథ్యాన్ని అప్పగించాలని మేనేజ్‌మెంట్ నిర్ణయించుకున్నట్టు సమాచారం.

టాప్‌లో రబాడ

మూడో స్థానానికి బుమ్రా



దుబాయ్: ఐసీసీ టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత పేసర్ బుమ్రా మూడో స్థానానికి దిగజారాడు. బుధవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికా బౌలర్ రబాడ.. బుమ్రా నుంచి టాప్ ర్యాంక్ దక్కించుకున్నాడు. ఆసీస్ పేసర్ హాజెల్‌వుడ్ రెండో స్థానానికి ఎగబాకాడు. వెటరన్ స్పిన్నర్ అశ్విన్ రెండు ర్యాంకులు తగ్గి నాలుగో స్థానంలో నిలిచాడు. భారత్‌తో రెండో టెస్ట్‌లో 13 వికెట్లు సాధించిన కివీస్ స్పిన్నర్ శాంట్నర్ ఏకంగా 20 ర్యాంకులు మెరుగుపరుచుకొని 44వ స్థానం కైవసం చేసుకున్నాడు. బ్యాటింగ్ విభాగంలో పంత్ 11, కోహ్లీ 14వ ర్యాంక్‌కు దిగజారారు. ఆల్‌రౌండర్లలో అశ్విన్, జడేజా తమ తొలి రెండు స్థానాలను నిలబెట్టుకొన్నారు.

హిజాబ్ ధరిస్తే నిషేధిస్తారా?

- ఫ్రాన్స్‌ను ఆక్షేపించిన యూఎన్

పారిస్: పారిస్ ఒలింపిక్స్‌లో అథ్లెట్లు హిజాబ్ ధరించకుండా ఫ్రాన్స్ ప్రభుత్వం నిషేధం విధించడాన్ని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కౌన్సిల్ తప్పుబట్టింది. అలాగే హిజాబ్ వేసుకొనే ఆటగాళ్లను బహిష్కరించాలని ఫ్రెంచ్ ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ సంఘాలు నిర్ణయించడాన్ని కౌన్సిల్ తీవ్రంగా ఆక్షేపించింది. 'హిజాబ్ ధరించే ముస్లిం మహిళలు, బాలికలకు క్రీడా, సాంస్కృతిక రంగాలలో సమాన హక్కులు ఉండాలి. అలాగే ఫ్రెంచ్ సమాజంలో భాగమైన వారు..ఆ దేశానికి చెందిన అన్ని రంగాలలోనూ పాల్గొనే అవకాశం కల్పించాలి' అని కౌన్సిల్ స్పష్టంజేసింది. 26 ఏళ్ల ఫ్రాన్స్ స్ప్రింటర్ సౌంకంబ సిల్లా పారిస్ ఒలింపిక్స్‌కు ఎంపికైంది. కానీ ఆమె హిజాబ్ ధరించకుంటేనే ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనేందుకు అనుమతిస్తామని ఫ్రెంచ్ ఒలింపిక్ కమిటీ నిబంధన విధించింది. దాంతో సిల్లా టోపీ ధరించి కార్యక్రమంలో పాల్గొంది. ఈ విషయంపై సోషల్ మీడియా ద్వారా సౌంకంబ అసహనం వ్యక్తంజేసింది.



మల్డర్ (105 నాటౌట్)

దక్షిణాఫ్రికా భారీస్కోరు

బంగ్లాతో రెండో టెస్ట్

చటోగ్రామ్ (బంగ్లాదేశ్): బంగ్లాదేశ్‌తో రెండో టెస్ట్‌లో దక్షిణాఫ్రికా పైచేయి సాధించింది. తొలి ఇన్నింగ్స్‌ను 575/6 స్కోరుతో డిక్లేర్ చేసిన సఫారీలు..ఆపై బంగ్లాదేశ్ మొదటి ఇన్నింగ్స్‌లో రెండోరోజు ఆఖరికి నాలుగు వికెట్లు పడగొట్టారు. 38/4తో తీవ్ర ఇక్కట్లలో కూరుకుపోయిన ఆతిథ్య జట్టు..ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 537 పరుగుల వెనుకంజలో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 307/2తో బుధవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా జట్టులో మల్డర్ (105 నాటౌట్) శతకంతో చెలరేగాడు.



అగ్రస్థానానికి తలైవాస్

హైదరాబాద్: ప్రొ.కబడ్డీ లీగ్ తాజా సీజన్‌లో తమిళ్ తలైవాస్ అగ్రస్థానానికి దూసుకొచ్చింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 44-25తో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. తలైవాస్ జట్టులో నరేందర్ ఖండోలా 15 పాయింట్లతో చెలరేగగా.. సచిన్, సాహిల్ చెరో ఐదు పాయింట్లు సాధించారు. గుజరాత్ జట్టులో గుమాన్ సింగ్ (7) రాణించాడు. ఈ విజయంతో తలైవాస్ 37 పాయింట్లతో టేబుల్ టాపర్‌గా నిలిచింది. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 30-28తో యూపీ యోధాస్‌పై గెలిచింది.

సీఎంను కలిసిన బాబా రామ్‌దేవ్



అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): యోగా గురువు బాబా రామ్‌దేవ్ ముఖ్యమంత్రి చంద్రబాబును బుధవారం ఉండవల్లి నివాసంలో కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా వెల్‌నెస్ కేంద్రాలు నెలకొల్పాలని, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, విద్యారంగంలో పెట్టుబడులు పెట్టాలని బాబా రామ్‌దేవ్‌ను కోరినట్లు ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో విజయదుందుభి మోగించాక టీడీపీ తొలిసారి ప్రారంభించిన సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన లభించింది. మూడున్నర రోజుల్లో 5లక్షల మందికి పైగా నమోదు చేసుకున్నారు. వాట్సాప్ ద్వారా నమోదు చేసే వినూత్న ప్రక్రియకు ఈ దఫా టీడీపీ శ్రీకారం చుట్టింది. రూ.100తో సాధారణ సభ్యత్వం తీసుకున్న కేడర్‌కు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించారు.

పెన్షనర్ల సమస్యలపై సీఎం సానుకూలం

» అన్ని సమస్యలూ పరిష్కరిస్తామని హామీ

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని ఏపీ ఎన్జీవో మాజీ అధ్యక్షుడు, ఆల్ ఇండియా పెన్షనర్ల సంఘం జనరల్ సెక్రటరీ పూర్ణచంద్రరావు తెలిపారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలపై తాము సీఎంను కలిశామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, పెన్షనర్లు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన రూ.25 వేల కోట్ల బకాయిలపై సీఎం చంద్రబాబుతో చర్చించామన్నారు. పెన్షనర్లు, ఉద్యోగుల డిమాండ్లపై సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. ఆర్థిక పరిస్థితిని మీరూ చూస్తున్నారు కదా.. రోడ్లకు కూడా డబ్బులు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నామని సీఎం అన్నారని పూర్ణచంద్రరావు తెలిపారు. గత ప్రభుత్వం తగ్గించిన క్వాంటం ఆఫ్ పెన్షన్ 3 శాతాన్ని వెంటనే పునరుద్ధరించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. డీఏ బకాయిలు కూడా ఆర్థిక పరిస్థితిని బట్టి దశల వారీగా చెల్లిస్తామని చెప్పారన్నారు. డిసెంబరు 17ను పెన్షనర్ల డేగా ప్రభుత్వం తరఫున నిర్వహించాలని, పెన్షనర్ల కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని సీఎంను కోరామని తెలిపారు.

సర్వే రాళ్లలో.. అడ్డంగా దొరికాడు!



» రూ.575 కోట్ల దోపిడీకి వెంకటరెడ్డి స్కెచ్
» ఏసీబీ విచారణలో బట్టబయలు
» కోటి టర్నోవర్ కూడా లేని ధన్వంతరికి టెండర్ ఇవ్వడం కుదరదన్న అధికారులు
» నోట్‌ఫైల్స్‌పై రాసినా లెక్కచేయని ఎండీ
» 10 మంది అధికారులను నెల్లూరు తీసుకెళ్లి ప్రశ్నించిన ఏసీబీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సర్వే రాళ్ల కొనుగోళ్లపై ఏసీబీ నాలుగు రోజులుగా విస్తృతంగా దర్యాప్తు చేస్తోంది. సోమవారం ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) కార్యాలయంలో 14 మంది కీలక అధికారులను విడివిడిగా విచారించింది. వీరిలో 8 మంది గనుల శాఖకు చెందినవారు. స్టీల్ ప్లాంటు నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ఎస్వీ బోస్, మైనింగ్ శాఖకు చెందిన సాంకేతిక అధికారి.. ఓ ప్రముఖ కన్సల్టెన్సీకి చెందిన నలుగురు అధికారులు కూడా ఉన్నారు. వీరందరినీ సోమవారం రాత్రి వారిని నెల్లూరులోని ఏసీబీ ఆఫీసుకు తరలించారు. మంగళవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వారిని ప్రశ్నించారు. బుధవారం తెల్లవారుజామున ఆ అధికారులను, కన్సల్టెన్సీకి చెందిన ఇద్దరు అధికారులను తిరిగి విజయవాడకు పంపించారు. ఆ కన్సల్టెన్సీకి చెందిన ఇద్దరు ముఖ్య అధికారులను మాత్రం ఇంకా ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. సర్వే రాళ్ల ఎంగ్రేవింగ్ యూనిట్ల ఏర్పాటు కోసం పిలిచిన టెండర్లు, వైద్య పరికరాలు విక్రయించే సంస్థ 'ధన్వంతరి'కి టెండర్ అప్పగింతపై ఏసీబీ 16 ప్రశ్నలను ప్రధానంగా లేవనెత్తి సమాధానాలు రాబట్టింది.

రూపకర్త వెంకటరెడ్డే..!

వెంకటరెడ్డి గనుల శాఖ డైరెక్టర్‌గా, ఏపీఎండీసీ ఎండీగా ఉన్న సమయంలో 3.5 కోట్ల సర్వే రాళ్లను కొనుగోలు చేయాలనుకున్నారు. గ్రానైట్ రాళ్లను సరఫరాదారుల నుంచి తీసుకున్నాక పాలిష్ చేయడం, వాటిపై భూమి హక్కు, జగన్ పేర్లను రాయడం వంటి పనులు (ఎంగ్రేవింగ్) చేయడానికి ప్రత్యేకంగా ఓ అండ్ ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) యూనిట్లు ఏర్పాటు చేయాలనుకున్నారు. ఇందుకోసం చైనా యంత్రాలు కొనాలనుకున్నారు. ఈ యంత్రాల కొనుగోలు విలువే రూ.525 కోట్ల వరకు ఉంది. ఈ వర్క్‌ను కూడా సర్వే రాళ్ల సరఫరా ఏజెన్సీలకే అప్పగించవచ్చు. కానీ ఆ పనిచేయకుండా.. ప్రత్యేకంగా ఓఎండ్ఎం యూనిట్ల అంశాన్ని వెంకటరెడ్డి తెరపైకి తెచ్చారు. నిబంధనల ప్రకారం చైనా యంత్రాల సరఫరా కోసం గ్లోబల్ టెండర్లు పిలవాలి. టెండర్ డాక్యుమెంట్‌ను జ్యుడీషియల్ కమిషన్ ఆమోదానికి పంపించాలి. కానీ వెంకటరెడ్డి వైద్య పరికరాలు అమ్ముకునే ధన్వంతరి అనే కంపెనీకి టెండర్ కట్టబెట్టారు. సర్వే రాళ్లకు, వైద్య పరికరాల సంస్థకు సంబంధం ఏమిటని ఎవరైనా ప్రశ్నిస్తారనే సంకోచం లేకుండా.. యంత్రాల కొనుగోలు టెండర్, కొన్నవాటిని జాగ్రత్తగా నిర్వహించే కాంట్రాక్టు.. ఈ రెండింటినీ ఆ సంస్థకే వెంకటరెడ్డి ఇచ్చేశారు. ఆ తర్వాత ఆ కంపెనీకి చైనా యంత్రాలు కొనుగోలు చేసే ఆర్థిక సామర్థ్యం లేకపోవడంతో రూ.100 కోట్లు అడ్వాన్స్‌గా ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. ఆ వెంటనే డబ్బు విడుదలకు ఆర్థిక శాఖపై వెంకటరెడ్డి తీవ్ర ఒత్తిడిచేశారు. బహిరంగ మార్కెట్‌లో రూ.2 కోట్లు పలికే యంత్రాన్ని ఈ సంస్థ రూ.7.46 కోట్లకు కొనుగోలు చేసింది. బల్లికురవలో ఓ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. తర్వాత జిల్లాల వారీగా యూనిట్లు ఏర్పాటు చేయాలని వెంకటరెడ్డి ప్రతిపాదనలు పంపించారు. వాటిని నాటి గనుల శాఖ ముఖ్య కార్యదర్శి తిరస్కరించారు. ఈలోపు ఎన్నికల సందడి మొదలవడంతో నాటి ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఓ అధికారి అండతో ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్లాలని ప్రయత్నించి విఫలమయ్యారు.



> గనుల ఘనుడు వీజీ వెంకటరెడ్డి అవినీతి, అక్రమాల లీలలు ఒక్కటొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. భూముల సర్వే కోసం రాళ్ల కొనుగోలు, ఆ రాళ్ల పాలిషింగ్‌కు, వాటిపై జగన్ పేరు రాయడానికి (ఎంగ్రేవింగ్) చైనా యంత్రాల కొనుగోలు పేరిట భారీ దోపిడీకి స్కెచ్ వేసినట్లు ఏసీబీ విచారణలో తేలింది. ఆ దోపిడీ రూ.575 కోట్లపైనే. వెంకటరెడ్డి ప్రమేయం, అధికార దుర్వినియోగంపై ఏసీబీ పక్కా ఆధారాలు సేకరించింది.

అంతా గోల్‌మాల్..

టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించడంతో ఏసీబీ రంగంలోకి దిగింది. గతంలో ఈ టెండర్ల వ్యవహారాన్ని పర్యవేక్షించిన గనుల శాఖ అధికారులను ప్రశ్నించింది. టెండర్ కమిటీని కూడా విచారించింది. ఎంగ్రేవింగ్ యూనిట్లకు సంబంధించి 2023 జనవరి 4న జరిగిన మీటింగ్ మినిట్స్‌ను దగ్గర పెట్టుకుని విచారణ జరిపింది. చైనా యంత్రాల కొనుగోలు, నిర్వహణ టెండర్లకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోలేదని, టెండర్‌ను జ్యుడీషియల్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లకుండానే నడిపించారని గుర్తించింది. కనీసం రూ.కోటి టర్నోవర్ కూడా లేని ధన్వంతరి అసోసియేట్స్‌కు రూ.వందల కోట్ల టెండర్ కట్టబెట్టారని.. నిబంధనలకు, కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) మార్గదర్శకాలకు పూర్తి విరుద్ధంగా ఈ ప్రక్రియను నడిపారని తేల్చింది. ఆర్థిక సామర్థ్యమే లేని ధన్వంతరికి ప్రభుత్వమే రూ.100 కోట్ల అడ్వాన్స్ ఇప్పించి.. ఆ సొమ్ముతో చైనా యంత్రాలు కొనుగోలు చేయించడం పూర్తిగా కుట్రపూరితమని.. ఇందులో దురుద్దేశాలు ఉన్నాయని పలు నోట్‌ ఫైల్స్, ఇతర డాక్యుమెంట్ల ఆధారంగా ఏసీబీ నిర్ధారించింది. కాగా.. ఈ టెండర్ నిర్వహించే సత్తా ఈ కంపెనీకి లేదని, బిల్లులు ఇవ్వకూడదని పలు స్థాయిల్లోని అధికారులు స్పష్టం చేశారు. అవన్నీ బయటికొస్తే బండారం బయటపడుతుందని.. గుట్టుగా ఆ కంపెనీకి బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చి పంపించాలని వెంకటరెడ్డి ప్లాన్ చేసినట్లు ఏసీబీ నిర్ధారించింది. ఆ కంపెనీతో అగ్రిమెంట్లు రద్దుచేసుకోకుండానే.. అకౌంట్స్, ఇతర విభాగాల అధికారులు వ్యతిరేకించినా.. బ్యాంకు గ్యారెంటీలు ఇప్పించడం ద్వారా వెంకటరెడ్డి ఏకపక్షంగా మేలుచేశారని తేల్చింది.

ఆయన అనుకున్నదే చేశారు!

ధన్వంతరి పేరిట జరిగిన గోల్‌మాల్‌పై మైన్స్, కన్సల్టెన్సీ అధికారుల వాంగ్మూలాలను ఏసీబీ నెల్లూరు కార్యాలయంలో రికార్డుచేసింది. అక్కడే ఫైళ్లను పరిశీలించి వారి అభిప్రాయాలను నమోదు చేసింది. ప్రభుత్వానికి తెలియజేయకుండా టెండర్లు పిలవడం, జ్యుడీషియల్ కమిషన్ ఆమోదం తీసుకోకపోవడం, ఏకపక్షంగా ధన్వంతరికి అడ్వాన్స్ ఇప్పించడం వంటివన్నీ వెంకటరెడ్డి కేంద్రంగానే జరిగాయని వారు చెప్పారు. నోట్‌ఫైల్స్, ఇతర డాక్యుమెంట్లలో తాము నిబంధనలను ప్రస్తావించామని, కానీ చివరకు వెంకటరెడ్డి తాను అనుకున్నదే చేశారని వెల్లడించారు. దీనికి సంబంధించిన ఆధారాలనూ వారు ఏసీబీకి సమర్పించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. టెండర్ డాక్యుమెంట్లు, ఒప్పందాలను తయారుచేసిన కన్సల్టెన్సీకి చెందిన నలుగురు అధికారులను ఏసీబీ విచారించింది. వీరిలో ఇద్దరిని పంపించివేసి మరో ఇద్దరిని మాత్రం నెల్లూరులోనే ఉంచి ప్రశ్నిస్తోంది.



విజయవాడ వరదలు, సహాయక చర్యలపై సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, రెవెన్యూ మంత్రి అనగాని, ఉన్నతాధికారులు

వరదల్లో నష్టపోయిన వాహనదారులకు 15 రోజుల్లో చెల్లింపులు పూర్తి చేయాలి

» విజయవాడకు వరద ముప్పు లేకుండా శాశ్వత పరిష్కారం
» వరద సాయం పంపిణీపై చంద్రబాబు సమీక్ష

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరదల్లో దెబ్బతిన్న వాహనదారులకు బీమా చెల్లింపులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను 15రోజుల్లోగా పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. భవిష్యత్‌లో విజయవాడకు వరద ప్రమాదం లేకుండా శాశ్వత పరిష్కారం దిశగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, దీనికోసం తక్షణమే డీపీఆర్‌ను రూపొందించాలని కోరారు. రాష్ట్రంలో ఇటీవల వచ్చిన వరదలకు సంబంధించి చేపట్టిన సహాయక చర్యలు, బాధితులకు పంపిణీ చేసిన పరిహారంపై బుధవారం అమరావతి సచివాలయంలో అధికారులతో సీఎం సమీక్షించారు. వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఆయా జిల్లాల్లోని పరిస్థితులను ఆరా తీశారు. ఎన్టీఆర్ జిల్లాలో వరదలకు నష్టపోయిన వాహనదారులకు బీమా చెల్లింపు దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉండటంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు.

గుడ్.. బాగా చేశారు!

» డ్రోన్ సమ్మిట్‌పై అధికారులను అభినందించిన సీఎం

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): 'గుడ్.. బాగాచేశారు' అంటూ డ్రోన్ సమ్మిట్ నిర్వహించిన అధికారులను సీఎం చంద్రబాబు అభినందించారు. మౌలిక సదుపాయాలశాఖ కార్యదర్శి సురేశ్‌కుమార్, డ్రోన్ కార్పొరేషన్ ఎండీ దినేశ్‌కుమార్‌తో కూడిన బృందం బుధవారం వెలగపూడి సచివాలయంలో సీఎంను కలిసింది. డ్రోన్ జ్ఞాపికను చంద్రబాబుకు సురేశ్‌కుమార్ అందజేశారు. 22న కృష్ణాతీరాన అమరావతి డ్రోన్ సమ్మిట్‌ను అద్భుతంగా నిర్వహించారని అధికారులను సీఎం అభినందించారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు.

పెన్షనర్ల నుంచి 12 వరకు రికవరీ ఆపండి

» రిటైర్డ్ పోలీసు ఉద్యోగుల వ్యాజ్యంపై హైకోర్టు ఉత్తర్వులు

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): హైకోర్టుకు వచ్చిన రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ నుంచి కమ్యూటెడ్ పోర్షన్ కింద ఈ నెల 12 వరకు సొమ్ము రికవరీ చేయవద్దని సంబంధిత అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను నవంబరు 12కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవిలతో కూడిన ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పోలీసుశాఖకు సంబంధించిన పలువురు ఉద్యోగులు ఉద్యోగం నుంచి విరమణ పొందే సమయంలో ప్రభుత్వం నుంచి అడ్వాన్స్‌గా కొంత మొత్తాలను తీసుకున్నారు. కమ్యూటెడ్ పోర్షన్ రూపంలో(అసలుతో పాటు వడ్డీ) సొమ్మును 11 ఏళ్ల 3 నెలల పాటు రికవరీ చేస్తే సరిపోతుందని, అయితే ప్రభుత్వం 15ఏళ్ల పాటు రికవరీ ప్రక్రియ కొనసాగిస్తోందని పేర్కొంటూ 24మంది రిటైర్డ్ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. వారి తరఫున న్యాయవాది ఠాగూర్ యాదవ్, ప్రభుత్వం తరఫున ఏజీ సాంబశివ ప్రతాప్ వాదనలు వినిపించారు.

ఢిల్లీలో నూతన ఏపీ భవన్ నిర్మాణం

న్యూఢిల్లీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో నూతనంగా ఏపీ భవనం నిర్మాణానికి కసరత్తు ప్రారంభమైంది. కొత్త భవన నిర్మాణానికి సంబంధించి డిజైన్ల కోసం ఏపీ ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. 'రీడెవలప్‌మెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ భవన్' పేరుతో 11.536 ఎకరాల్లో నిర్మాణానికి డిజైన్లను కోరుతూ రోడ్లు, భవనాల శాఖ టెండర్లు పిలిచింది. నవంబరు 28లోపు ప్రతిపాదనలను సమర్పించాలని పేర్కొంది. నూతన సంవత్సరం ప్రారంభంలో ఈ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగే అవకాశం ఉంది.

హైకోర్టుకు వరుసగా ఐదు రోజులు సెలవులు

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): హైకోర్టుతో పాటు హైకోర్టు పరిపాలనా పరిధిలో పనిచేసే కార్యాలయాలకు నవంబరు 1న సెలవు ప్రకటించారు. అక్టోబరు 18న ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి చేసిన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకొని 1న సెలవు ఇచ్చామని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ తెలిపారు. అందుకు ప్రతిగా డిసెంబరు 21(శనివారం) పనిదినంగా ప్రకటిస్తున్నామన్నారు. దీపావళి పండుగ సందర్భంగా 30, 31 తేదీలలో కోర్టుకు సెలవులు ఉన్నాయి. నవంబరు 2, 3 తేదీల్లో వారాంతపు సెలవులు. 1 కూడా సెలవుగా ప్రకటించడంతో హైకోర్టుకు వరుసగా ఐదు రోజులు సెలవులు వచ్చాయి.

17 వరకు రెవెన్యూ రికార్డుల పరిశీలన

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కీలకమైన అసైన్డ్ భూముల రికార్డుల పరిశీలనను నవంబరు 17వ తేదీ వరకూ పొడిగిస్తూ రెవెన్యూ శాఖ నిర్ణయం తీసుకుంది. జిల్లా కలెక్టర్ల వినతి మేరకు భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) జయలక్ష్మీ ఈ నిర్ణయం తీసుకున్నారు. బుధవారం జిల్లా కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఏపీఈఆర్సీ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా రాంసింగ్!

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఇన్‌చార్జ్ చైర్మన్‌గా రాంసింగ్‌ను నియమించే అవకాశం ఉంది. ఈఆర్సీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన జస్టిస్ నాగార్జునరెడ్డి మంగళవారం పదవీవిరమణ చేశారు. దీంతో.. మరో నాలుగు నెలల పాటు పదవీకాలం ఉన్న ఈఆర్సీ సభ్యుడు రాంసింగ్‌ను ఇన్‌చార్జ్ చైర్మన్‌గా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

విజిలెన్స్ కమిషనర్‌గా పునేఠా బాధ్యతలు



అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్‌గా అనిల్‌చంద్ర పునేఠా బుధవారం అమరావతి సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారైన పునేఠాను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ కమిషనర్‌గా నియమించింది. గతంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా, సీసీఎల్ఏగాను పని చేశారు.

టపాసులు పేలి అగ్నిప్రమాదం జరిగితే.. టోల్ ఫ్రీ నంబర్లలో సంప్రదించండి

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కోరింది. అగ్నిప్రమాదం జరిగితే అత్యవసర సహాయం కోసం 101, 112, 100, 1070 టోల్ ఫ్రీ నంబర్లకు సంప్రదించాలని సూచించింది.

అది వారి కుటుంబ వ్యవహారం: సీపీఐ నారాయణ

న్యూఢిల్లీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జగన్, షర్మిల ఆస్తి వివాదం అన్నా చెల్లెళ్ల కుటుంబ వ్యవహారమని, అదేమీ రాజకీయ వివాదం కాదని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన వీడియో సందేశం విడుదల చేశారు. ఆస్తి వివాదం, పంపకాలు తదితర వివరాలన్నీ వాళ్ల తల్లి విజయమ్మ స్పష్టంగా తెలియజేశారని, ఆ విషయంలో మిగిలిన వాళ్లెందుకు నోరుపారేసుకుంటున్నారని ప్రశ్నించారు. అన్నాచెల్లెళ్ల పంచాయితీకి రాజకీయాలు ఆపాదించొద్దని సూచించారు. సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో వాళ్లకు తెలుసని, అందులో మిగిలిన వాళ్ల ప్రమేయం అవసరం లేదని అభిప్రాయపడ్డారు.

ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు



» జల్‌జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయండి
» నవంబరు 8న ఎస్ఈ, ఈఈలతో వర్క్‌షాపు
» కేంద్రం నిధులను దుర్వినియోగం చేసిన వైసీపీ ప్రభుత్వం: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించే జల్‌జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, జల్‌జీవన్ మిషన్ ద్వారా కేంద్రం అందించే నిధులను ఇందుకోసం సద్వినియోగం చేసుకుందామని స్పష్టం చేశారు. ఈ శాఖ బాధ్యతలు చేపట్టిన తొలిరోజుల్లో జల్‌జీవన్ మిషన్‌లో చేపట్టిన పనుల్లో లోపాలను గుర్తించామన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్‌మిషన్ ద్వారా రాష్ట్రానికి పంపిన నిధులను గత ప్రభుత్వం సక్రమంగా వినియోగించలేదన్నారు. పైప్‌లైన్లు కూడా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా వేయలేదని సమీక్షల ద్వారా తేలిందన్నారు. పలుచోట్ల అసలు పనులే మొదలు కాలేదని, వాటిని సరిదిద్దుతూ పనులు వేగవంతం చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుందన్నారు. జల్‌జీవన్ మిషన్ పనులు సక్రమంగా చేపట్టడం ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీటిని ఇవ్వగలమన్నారు. ప్రభుత్వ ప్రణాళికలను తెలియజేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు, ఈఈలతో వర్క్‌షాపు నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయి ఇంజనీరింగ్ సిబ్బందికి ఓరియెంటేషన్ కార్యక్రమం చేపట్టాలన్నారు. ఎస్ఈలు, ఈఈలతో వర్క్‌షాపును వచ్చే నెల 8న నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమీక్షలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ సంజీవరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, బొరగం శ్రీనివాసులు

జగన్ పాలనలో అర్చకులకు తీవ్ర నష్టం

» గత ప్రభుత్వ తీరుతో పథకాలకు దూరం
» ప్రజావేదికలో వైసీపీ బాధితుల గోడు

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చేపట్టిన జగనన్న రీ సర్వేతో రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల అర్చకులు తీవ్రంగా నష్టపోయారని, ఆన్‌లైన్‌లో, అడంగల్‌లో అర్చకుల పేర్లు తొలగించడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదని అర్చక సంక్షేమ సంఘ సభ్యులు ప్రజావేదికలో ఫిర్యాదు చేశారు. ఆలయాల అర్చకులు అనుభవిస్తున్న భూముల వివరాలను ఆన్‌లైన్, అడంగల్‌లో నమోదు చేసి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని అర్చక సంఘ సభ్యులు కోరారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, టిడ్కో చైర్మన్ శ్రీనివాసులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వ బాధితులు టీడీపీ నేతల వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. నక్కవాగు అభివృద్ధికి 2.39ఎకరాలు భూసేకరణ కింద తీసుకుని పరిహారం ఇవ్వలేదని, దీనిపై గత ప్రభుత్వంలో అధికారులను అడిగితే.. అప్పటి మంత్రి విడదల రజినిని కలవాలన్నారని పల్నాడు జిల్లా జగ్గాపురం గ్రామానికి చెందిన బసవేశ్వరరావు తన గోడు వెళ్లబోసుకున్నారు. రజనీని కలిసేందుకు అంగీకరించకపోవడంతో తనకు రావాల్సిన బిల్లులు రానివ్వలేదని నేతల దృష్టికి తెచ్చారు. ఏపీ గురుకుల పాఠశాలల్లో రికార్డు అసిస్టెంట్లుగా పని చేస్తున్న తమని ఎలాంటి ఉత్తర్వులూ లేకుండా గత ప్రభుత్వం విధుల నుంచి తొలగించడంతో ఉపాధి కోల్పోయామని పలువురు మంత్రి దృష్టికి తెచ్చారు. పోలవరం ముంపు గ్రామాల్లో ఇళ్లు కోల్పోయిన తమకు పరిహారం ఇవ్వకుండా, వైసీపీ వారికి మాత్రం మంజూరు చేశారని, అల్లూరి జిల్లా దేవీపట్నం మండలానికి చెందిన నిర్వాసితులు వాపోయారు.

నేడు, రేపు ప్రజావేదిక రద్దు

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఈ నెల 31న జరగాల్సిన ప్రజావేదికను దీపావళి కారణంగా రద్దు చేసినట్లు ఎమ్మెల్సీ అశోక్‌బాబు తెలిపారు. అలాగే నవంబరు1న పింఛన్ల పంపిణీ ఉన్నందున ఆ రోజు కూడా గ్రీవెన్స్ ఉండదని చెప్పారు.

దీపావళి విజయానికి ప్రతీక

» రాష్ట్ర ప్రజలకు గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం శుభాకాంక్షలు

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి దీపావళి ప్రతీకని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. దీపావళి వెలుగుల పండగని ఈ సంతోషకరమైన దీపావళి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికి హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు రాజ్‌భవన్ నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీపావళి దివ్య వెలుగులు అందరికీ శాంతి, శ్రేయస్సు, ఆనందాన్ని కలిగించాలని ఆకాంక్షించారు. ఈ ఆనంద దీపావళి పండుగ రాష్ట్ర ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. బుధవారం 'ఎక్స్' వేదికగా తెలుగు ప్రజలందరికీ సీఎం దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. 'సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 'దీపం-2.0' పథకంతో ఈ దీపావళి పండుగను మరింత కాంతివంతం చేస్తున్నాం. తెలుగింటి ఆడబిడ్డల కళ్లలో ఆనందం చూసేందుకు ఏడాదికి 3 వంటగ్యాస్ సిలెండర్లను ఉచితంగా ఇవ్వడమే ఈ పథకం ముఖ్యోద్దేశ్యం. మీ నుంచి వస్తున్న స్పందనతో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసే స్ఫూర్తిని పొందుతున్నాం' అని సీఎం పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. 'విధ్వంసపు చీకట్లను ప్రగతి వెలుగులతో తరిమేశాం. సంక్షోభాల చెడు పాలనపై సంక్షేమ పాలన విజయం సాధించింది. ఇక ప్రతిరోజూ ప్రతి ఇంటా సంక్షేమ పండుగే. ప్రజలంతా సంతోషంగా, సురక్షితంగా దీపావళి పండుగ జరుపుకోవాలని కోరుకుంటున్నాను' అని లోకేశ్ పేర్కొన్నారు. కాగా, జగతిని జాగృతం చేసే చైతన్య శోభావళి దీపావళి అని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. గురువారం దీపావళి సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. దీపావళిని అత్యంత జాగ్రత్తగా జరుపుకోవాలని సూచించారు. ఈ దీపావళి సకల జనులకు శుభాలను అందజేసి ఆనందం, ఆరోగ్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

నవంబరు నుంచి రేషన్‌లో కందిపప్పు, పంచదార, జొన్నలు

» ఐదేళ్ల తర్వాత అన్ని రకాల సరుకుల పంపిణీకి చర్యలు

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులందరికీ నవంబరు నుంచి ఉచిత బియ్యంతోపాటు పంచదార, కందిపప్పు, జొన్నలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే అన్ని ఎంఎల్ఎస్ పాయింట్లకు సరిపడా సరుకులు రవాణా చేసేలా పౌరసరఫరాల శాఖ చర్యలు తీసుకుంది. నవంబరు 1 నుంచి కార్డుదారులందరికీ రేషన్ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర కిలో రూ.180పైనే ఉంది. పంచదార రేటు కూడా పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో నవంబరు నుంచి బియ్యంతోపాటు సబ్సిడీ ధరలకు నాణ్యమైన కందిపప్పు, పంచదారను అందించి పేదలను ఆదుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో పౌరసరఫరాలశాఖ అధికారులు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి.. కిలో కందిపప్పు రూ.67కు, అరకిలో పంచదార రూ.17కు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. కాగా, జొన్నలు కావాలనుకునేవారు బియ్యానికి బదులుగా ఎన్ని కేజీలు కావాలంటే అన్ని కేజీలు జొన్నలు తీసుకోవచ్చని పౌరసరఫరాలశాఖ కమిషనర్ జి.వీరపాండియన్ తెలిపారు.

ధరల నియంత్రణకు రాష్ట్ర, జిల్లా కమిటీలు

రాష్ట్రంలో ధరల నియంత్రణకు ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. రాష్ట్రస్థాయి కమిటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ చైర్మన్‌గా, పౌరసరఫరాల శాఖ కమిషనర్, ఎక్స్ అఫిషియో కార్యదర్శి జి.వీరపాండియన్ మెంబరు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. వివిధ శాఖల కమిషనర్లు, కార్యదర్శులు, కార్పొరేషన్లు, ఫెడరేషన్ల ఎండీలు సభ్యులుగా ఉంటారు. అదేవిధంగా ఆయా జిల్లాల కలెక్టర్లు చైర్మన్లుగా, జిల్లా పౌరసరఫరాల అధికారులు మెంబరు కన్వీనర్లుగా, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు సభ్యులుగా జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

తీరు మారని 'బోరుగడ్డ'

» శ్రీకాకుళం కోర్టు ఆవరణలో మీడియాపై చిందులు
» 5 వరకు రిమాండ్ విధించిన కోర్టు
» రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలింపు

శ్రీకాకుళం/శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో హద్దుమీరి రెచ్చిపోయిన.. రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను పోలీసులు బుధవారం రాత్రి శ్రీకాకుళం కోర్టులో హాజరుపరిచారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌పైనా సోషల్ మీడియా వేదికగా బోరుగడ్డ అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై శ్రీకాకుళం నియోజకవర్గం గార మండలానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు బోర సురేష్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు మే 14న కేసు నమోదు చేశారు. ఈ కేసులో అనిల్‌కు పీటీ వారెంట్ జారీకావడంతో గార పోలీసులు రాజమండ్రి నుంచి తీసుకొచ్చి శ్రీకాకుళం కోర్టులో హాజరుపరిచారు. స్పెషల్ మొబైల్ కోర్టు ఇన్‌చార్జి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి భరణి నవంబరు 5 వరకు అనిల్‌కుమార్‌కు రిమాండ్ విధించారు. అనంతరం బోరుగడ్డను పోలీసులు రాజమండ్రి జైలుకు తరలించారు. కాగా, కోర్టు బయట వాహనంలో నుంచే పోలీసులు పక్కన ఉన్నప్పుడే ఆయన మీడియాపై చిందులు తొక్కారు. పాతబాణీలోనే అనుచిత వ్యాఖ్యలు చేశారు. తనను రౌడీషీటర్ అన్నవారి సంగతి తేల్చేస్తానని.. జాతీయ ఎస్సీ కమిషన్‌కు వెళ్తానని.. తానేంటో చూపిస్తానంటూ రెచ్చిపోయారు. ఇప్పటికే కొన్ని రోజుల నుంచి రిమాండ్‌లో ఉంటూ పాత కేసుల్లో ఒక్కో కోర్టుకు వెళ్లి వస్తూ.. రిమాండ్‌లు పొడిగింపు జరుగుతున్నా.. బోరుగడ్డలో ఎలాంటి మార్పు రాలేదని.. పోలీసులు పక్కన ఉండగానే బెదిరింపులకు పాల్పడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎడిటర్ల తయారీ ఫ్యాక్టరీ!

ఇక్కడ పనిచేసినవారు ఎంతో మంది సంపాదకులయ్యారు.. తెలుగు నాట మరే పత్రికకూ ఈ చరిత్ర లేదు



ఎడిటర్ కె.శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ; చిత్రంలో ఈడీ వేమూరి ఆదిత్య, కాబోయే ఎడిటర్ రాహుల్ కుమార్, తదితరులు

- ఎడిటర్‌గా శ్రీనివాస్ సేవలు ఎనలేనివి
- వీడ్కోలు సభలో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ
- 1 నుంచి కొత్త ఎడిటర్‌గా రాహుల్ కుమార్
- రాధాకృష్ణ అండదండలతోనే స్థిమితమైన నిర్ణయాలు: కె.శ్రీనివాస్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): "ఆంధ్రజ్యోతి.. ఎడిటర్లను తయారు చేసే ఫ్యాక్టరీ. ఇక్కడ పనిచేసిన వారెంతో మంది సంపాదకులుగా ఎదిగారు. అందుకు అవసరమైన ప్రాతిపదికను మనం మాత్రమే తయారు చేయగలిగాం. ఎడిటర్లుగా ఎదగడానికి, తద్వా రా సమాజం నుంచి పూర్తిస్థాయి గౌరవ మర్యాదలు దక్కడానికి అవసరమైన అవకాశాలు కల్పించాం. అది నాకు సంతృప్తిగా అనిపించింది. ఈ విధంగా ఆంధ్రజ్యోతి మాత్రమే చేయగలదు. తెలుగు నాట మరే పత్రికకూ ఈ చరిత్ర లేదు" అని 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయంలో బుధవారం ఎడిటర్ కె.శ్రీనివాస్ వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ.. కె.శ్రీనివాస్‌తో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "ఆంధ్రజ్యోతిని తిరిగి ప్రారంభించాలనుకున్నప్పు డు నాకు నేనుగా వెళ్లి సంస్థలోకి ఆహ్వానించిన ఏకైక వ్యక్తి కె.శ్రీనివాస్. ఆయన ఎంత కాలం ఉండాలనుకుంటే, అంతకాలం ఉండొచ్చని చెప్పా. శ్రీనివాస్ 22 ఏళ్ల పాటు ఒక సంస్థలో ఉండడం అరుదైన విషయం. ఆయనకు అ లాంటి సంతృప్తి ఇవ్వగలిగినందుకు గర్వపడదాం. ఇంతకాలం కుటుంబంలో ఒకరిగా ఉంటూ, మంచిచెడులు చెప్పే వ్యక్తి దూరమవుతుంటే బాధగా ఉంది" అని రాధాకృష్ణ చెప్పారు. శ్రీనివాస్ వివాదరహితుడు, మితభాషి అని, భాషపై ఆయనకున్న సాధికారతను ప్రశంసించారు. శ్రీనివాస్ మార్గనిర్దేశకత్వం ఇకపైనా కొనసాగాలని కోరారు. 'ఆంధ్రజ్యోతి' నూతన సంపాదకుడిగా రాహుల్‌కుమార్ నవంబరు1 నుంచి బాధ్యతలు స్వీకరిస్తారని ప్రకటించారు.

స్వేచ్ఛగా పనిచేసే అవకాశం ఇచ్చారు

కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. "నా 40 ఏళ్ల పాత్రికేయ జీవితంలో పాత ఆంధ్రజ్యోతితో ఆరేళ్ల అనుబంధం కలిపి మొత్తంగా 28 ఏళ్ల ఈ సంస్థతోనే ముడిపడి ఉంది. నేను ఇక్కడ ఇంతకాలం పనిచేయడానికి ప్రధాన కారణం రాధాకృష్ణ. స్వేచ్ఛగా పనిచేయడానికి, చెప్పాలనుకున్నది చెప్పడానికి అవకాశం కల్పించారు. ఆంధ్రజ్యోతి నుంచి నేను చాలా నేర్చుకున్నా" అని చెప్పారు. సిబ్బంది పట్ల రాధాకృష్ణ వైఖరి స్నేహపూర్వకంగా ఉంటుందని శ్లాఘించారు. రాధాకృష్ణ అండదండలతోనే తాను స్థిమితంగా నిర్ణయాలు తీసుకోగలిగానని చెప్పారు. విధి నిర్వహణలో తనకు తోడ్పడిన సహోద్యోగులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

భావ గాంభీర్యతతో బరువెక్కుతాయి..

"కె.శ్రీనివాస్ రచనల్లో మార్పు కావాలన్న హడావుడి ఉంటుంది. మనిషిని మంచివైపు నడిపించాలన్న ఉద్వేగం ఉంటుంది. న్యాయం కోసం మనుషులు ఆందోళన పడాలనే తత్వం ఉంటుంది. చెడును ఖండించాలనే ఆగ్రహం ఉంటుంది. ఇవన్నీ చెప్పడానికి ఆయన వాక్యాలన్నీ భావ గాంభీర్యతతో బరువెక్కుతాయి" అంటూ రాహుల్ కుమార్ ప్రశంసించారు. అసిస్టెంట్ ఎడిటర్ వక్కలంక రమణ మాట్లాడుతూ.. శ్రీనివాస్ కలం నుంచి జాలువారిన వాక్యాలు అద్భుతమైన అనుభూతి కలిగిస్తాయన్నారు. శ్రీనివాస్ లాంటి గొప్ప సంపాదకుడితో కలిసి ప్రయాణించామని గర్వంగా చెప్పుకొనే అవకాశం తమకు దక్కిందన్నారు. ఎండీ రాధాకృష్ణ, ఈడీ ఆదిత్య తదితరులు కె.శ్రీనివాస్, సుధ దంపతులను సత్కరించారు. యాజమాన్యం, సిబ్బంది జ్ఞాపికలను బహూకరించారు. తెలంగాణ నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, రాయలసీమ రీజనల్ ఇన్‌చార్జి ఉమామహేశ్వరరావు, జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్ రాఘవేంద్రరావు, ఎడిటోరియల్ సిబ్బంది, ఉద్యోగులు శ్రీనివాస్‌కు వీడ్కోలు పలికారు.

రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీ

- 7.5 లక్షల కోట్ల పెట్టుబడులు, 10 లక్షల మందికి ఉపాధి లక్ష్యం

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతా క్లీన్ ఎనర్జీని వినియోగించేలా పాలసీ డాక్యుమెంట్‌ను బుధవారం రాష్ట్ర ఇంధన శాఖ విడుదల చేసింది. ఏడున్నర లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు, పది లక్షల మందికి ఉపాధి అవకాశాలే లక్ష్యంగా ఈ పాలసీ డాక్యుమెంటును విడుదల చేసింది. ఈ మేరకు బుధవారం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వు జారీ చేశారు. రాష్ట్రంలో సౌర విద్యుత్తు 78.50 గిగావాట్లు, పవన విద్యుత్తు 35 గిగావాట్లు, 22 గిగావాట్ల పంప్డ్, 25 గిగావాట్ల బ్యాటరీ స్టోరేజి విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంగా ఈ పాలసీని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. అదేవిధంగా గ్రీన్ హైడ్రోజన్ 1.50 ఎంపీటీపీ ఉత్పత్తి, బయో ఫ్యూయల్స్ తయారీ, 5000 ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు, సోలార్ ప్యానళ్ల తయారీ, బ్యాటరీ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రోలైజర్స్ తయారీకి పాలసీలో అనుమతులు ఇస్తారు. క్లీన్ ఎనర్జీలో పెట్టుబడులు పెట్టేవారికి 25 శాతం క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీని అందిస్తారు. ఐదేళ్లలోనే పరిశ్రమలు ఉత్పత్తిని చేపట్టాలని షరతు విధించారు. ప్రభుత్వం, ఎన్ఆర్ఈడీసీఏపీ భూములు సేకరించి క్లీన్ ఎనర్జీ సంస్థలకు ఏటా 31,000లకు లీజుకు ఇస్తాయి.

స్వర్ణాంధ్ర సాధనకు 12 సూత్రాలు

(మొదటి పేజీ తరువాయి)

పలువురు అధికారులు పాల్గొన్నారు. 'వికసిత్ భారత్-2047' విజన్ డాక్యుమెంట్‌ను ప్రధాని మోదీ వచ్చేనెల ఆవిష్కరించనున్నారు. రాష్ట్రాల అభిప్రాయాలు, లక్ష్యాలను గుర్తించడంలో భాగంగా బుధవారం నీతి ఆయోగ్ ప్రతినిధులు బుధవారం ఏపీకి వచ్చారు. 'వికసిత్ భారత్-2047'కు సమాంతరంగా 'స్వర్ణాంధ్ర' సాధనను లక్ష్యంగా పెట్టుకున్నట్లు చంద్రబాబు ఇదివరకే ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై 18 లక్షల మంది ప్రజల నుంచి వచ్చిన సూచనలను క్రోడీకరించి 'విజన్- 2047'లో చేర్చామని చంద్రబాబు చెప్పారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని... అందుకే ప్రజారోగ్యానికి పెద్దపీట వేశామని చెప్పారు. ఏఐ, రోబోటిక్స్ నాలెడ్జ్ సిటీలుగా అమరావతి, తిరుపతి, విశాఖలను తీర్చిదిద్దుతామన్నారు. గతంలో ఇంటికొక ఐటీ ఉద్యోగి ఉండాలన్న లక్ష్యంతో పనిచేసి ప్రజల తలసరి ఆదాయం పెంచామని, ఇప్పుడు అదేబాటలో ఇంటికొక పారిశ్రామికవేత్త ఉండాలని విజన్- 2047 డాక్యుమెంట్‌ను రూపొందించామని సీఎం చంద్రబాబు నీతి ఆయోగ్ బృందానికి వివరించారు. నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, పరిపాలనలో సాంకేతికత... ఇలా ఆయా లక్ష్యాలపై నీతి ఆయోగ్ సభ్యులకు చంద్రబాబు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆ లక్ష్యాలు... అందులోని అంశాలు ఇవి..

1. ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యం

- పోషకాహారం, ఆరోగ్యకరజీవనంపై అవగాహన
- వ్యాధుల నుంచి విముక్తి కోసం ఏడు హెల్త్ మిషన్లు
- ప్రతి పౌరుడికి ఒకేరకమైన వైద్యపరీక్షలు, డిజిటల్ ప్రొఫైల్
- అరకు, పశ్చిమ గోదావరిలో ప్రపంచస్థాయి ఆయుష్ ఇనిస్టిట్యూట్లు
- యువశక్తి కోసం కుటుంబం ఒక యూనిట్‌గా తీసుకుని జనాభాలో హెచ్చుతగ్గులను నిర్ణయించడం

2. నైపుణ్యాల మెరుగుదల

- వివిధ రంగాల్లో డిమాండ్-సప్లై ఆధారంగా నైపుణ్యాల గణన
- అమరావతి, తిరుపతి, విశాఖపట్నం నగరాలను ఏఐ, రోబోటిక్స్ నాలెడ్జ్ సిటీలుగా మార్చడం
- ఏపీ స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు
- పాఠశాల విద్యలో క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ ఏర్పాటు

3. సురక్షిత, నాణ్యమైన జీవనం కోసం

- పేదరిక నిర్మూలన... ఏపీ మహిళా సాధికారత మండలి ఏర్పాటు
- ఆరోగ్య సంరక్షణ, నైపుణ్యాల శిక్షణ సౌకర్యాలతో సంక్షేమ హాస్టళ్లు
- సామాజిక భద్రత, ఉపాధి కోసం సీనియర్ సిటిజన్ల స్వయం సహాయక బృందాలు ఏర్పాటు

4. వాతావరణ సంరక్షణ

- వాతావరణ సంరక్షణ కోసం రాష్ట్రస్థాయిలో కార్యాచరణ ప్రణాళిక
- వాతావరణ సవాళ్లపై జిల్లాలకు ముందస్తు హెచ్చరికలు
- మడ అడవుల విస్తీర్ణం పెంచడం

5. అభివృద్ధి కేంద్రాలుగా నగరాలు

- అమరావతి, తిరుపతి, వైజాగ్, కర్నూలు, కాకినాడ, నెల్లూరు నగరాల చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలను కూడా నగర పరిధిలో కలపడం
- అంతర్జాతీయ స్థాయిలో జీవించడానికి అత్యంత అనువుగా ఉన్న నగరాల జాబితాలో రాష్ట్రం నుంచి కనీసం రెండింటినైనా చేర్చడం

6. తూర్పు ప్రాంతానికి లాజిస్టిక్స్ హబ్

- రెండు మెగా పోర్టుల నిర్మాణం
- తక్కువ ధరలోనే షిప్‌బిల్డింగ్, మరమ్మతులు, రీసైక్లింగ్
- రెండు నుంచి మూడు కోస్టల్ ఎకనమిక్ జోన్ల ఏర్పాటు
- రాష్ట్రంలో 3 అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులు, 10 కంటే ఎక్కువ దేశీయ ఎయిర్‌పోర్టుల నిర్మాణం.
- వైజాగ్, అనంతపురం, ఓర్వకల్లు, కొప్పర్తిలో మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు.

7. పరిశ్రమలు, పునరుత్పాదక కేంద్రాల ఏర్పాటు

- 25కి పైగా పారిశ్రామిక జోన్లు. ఇందులో 3 ఎకనమిక్ కారిడార్లు
- ఆయా పారిశ్రామిక జోన్లకు దగ్గరగా, నైపుణ్య అభివృద్ధి, పరిశోధన, అభివృద్ధి కేంద్రాల ఏర్పాటు, ఎంఎస్ఎంఈలకు మద్దతు.

8. నెక్స్ట్ జనరేషన్ సర్వీస్ హబ్

- ఏఐ, వ్యవసాయ హబ్‌గా అమరావతి, నానోటెక్నాలజీ, డ్రోన్ల హబ్‌గా తిరుపతి, రోబోటిక్స్ హబ్‌గా అనంతపురం - కర్నూలు, మెడ్‌టెక్, ఫిన్‌టెక్ హబ్‌గా వైజాగ్‌లను అభివృద్ధి చేయడం
- ఏఐ సదస్సులు, ఏపీ డిజిటల్ ఎక్స్‌పోలు నిర్వహించడం

9. అంతర్జాతీయ వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహార కేంద్రంగా ఏపీ

- అత్యంత విలువైన 27 పంటలు, ఉత్పత్తులను క్లస్టర్ విధానంలో అభివృద్ధి చేయడం
- వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల జోన్, ఫుడ్ పార్కులు, వినియోగం అధికంగా ఉన్న ప్రాంతాలకు దగ్గరగా అర్బన్ క్లస్టర్లు

10. పర్యాటక కేంద్రంగా ఏపీ

- తిరుపతి, అరకు, శక్తిపీఠాలు, బీచ్‌లు, నదులు ఇతర పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసి ప్రాచుర్యం కల్పించడం
- పర్యాటక సర్క్యూట్ల ఏర్పాటు
- సీప్లేన్లు, హెలీ టూరిజం, గోల్ఫ్ కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలు
- సేవారంగంలోకి అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఆహ్వానించడం

11. డిజిటల్ పరిపాలన

- ఏఐ అనుసంధానిత టెక్నాలజీ సేవల ద్వారా ప్రతి పౌరుడికి వ్యక్తిగతంగా సేవలందించడం
- సముద్ర ఆధారిత ఉత్పాదక ఆర్థికవ్యవస్థ అభివృద్ధి, పేదరిక నిర్మూలన కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- అన్ని శాఖల లక్ష్యాలు, వాటి సాధన నమోదుకోసం ఒక కామన్ ప్లాట్‌ఫాం

12. సమర్థవంతమైన ఆర్థిక విధానాలు

- ఏఐ, బ్లాక్‌చైన్, భూవిలువ ఆధారిత విధానాలతో సంప్రదాయిక ఆదాయ మార్గాలను బలోపేతం చేసుకోవడం
- దీర్ఘకాలిక కాలపరిమితితో, తక్కువ వడ్డీకే డబ్బు అందుబాటులోకి వచ్చేలా రాష్ట్ర ఆర్థిక కార్పొరేషన్‌ను బలోపేతం చేయడం
- అంతర్జాతీయ వెల్త్‌ఫండ్స్, డెవలప్‌మెంట్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్‌తో ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా రాష్ట్రంలో భారీ స్థాయి మౌలికసదుపాయాలు అభివృద్ధి చేసుకోవడం.



జ్యోతుల నెహ్రూ



ప్రశాంతి రెడ్డి



ఎంఎస్‌రాజు



జస్టిస్ హెచ్‌ఎల్‌దత్తు



సుచిత్రా ఎల్లా

టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు

(మొదటి పేజీ తరువాయి)

బోర్డు చైర్మన్‌గా, వివిధ రంగాలకు చెందిన 23 మందిని సభ్యులుగా నియమించింది. బోర్డులో ఆంధ్రప్రదేశ్ తర్వాత తెలంగాణకు ఎక్కువ ప్రాధాన్యం దక్కింది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వారికి బోర్డులో స్థానం లభించింది. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా పని చేసిన వ్యక్తిని తొలిసారి టీటీడీ బోర్డులో నియమించారు. మాజీ సీజేఐ జస్టిస్ హెచ్‌ఎల్ దత్తును బోర్డు సభ్యుడిగా నియమించారు. టీడీపీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలతో పాటు పలువురు నాయకులకు, జనసేన కోటాలో ముగ్గురికి స్థానం దక్కింది. మొత్తం 23 మంది సభ్యుల్లో ముగ్గురు మహిళలకు అవకాశం లభించింది.

టీడీపీ నుంచి...

ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలకు బోర్డు సభ్యులుగా అవకాశం కల్పించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజును నియమించారు. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మికి బోర్డులో స్థానం దక్కింది. తొలి నుంచి టీడీపీని నమ్ముకుని ఉన్న తెలంగాణకు చెందిన నన్నూరి నర్సిరెడ్డిని టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమించారు. రాజమండ్రికి చెందిన సాధారణ వ్యక్తి కోటేశ్వరరావుకు అవకాశం దక్కింది. నంద్యాల జిల్లా టీడీపీ ప్రెసిడెంట్ రాజశేఖర్ గౌడ్, పల్నాడు జిల్లాకు చెందిన టీడీపీ నేత జంగా క్రిష్ణమూర్తికి అవకాశం దక్కింది. ఎన్నికల్లో క్రిష్ణమూర్తి గురజాల ఎమ్మెల్యే టికెట్ ఆశించినా దక్కలేదు. ఇప్పుడు టీటీడీ బోర్డు సభ్యుడిగా అవకాశం కల్పించారు. మంగళగిరికి చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవిని సభ్యురాలిగా నియమించారు.

జనసేన కోటాలో...

జనసేన పార్టీ కోటాలో ముగ్గురికి టీటీడీ బోర్డులో అవకాశం లభించింది. జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు బి.మహేంద్రరెడ్డిని సభ్యుడిగా నియమించారు. 2009 నుంచి ఆయన జనసేనాని వెంటే ఉన్నారు. జనసేన పార్టీ వ్యవస్థాపక సభ్యురాలు అనుగోలు రంగశ్రీకి టీటీడీలో చోటు కల్పించారు. ఆమె భర్త ఎం.సి.దాస్ జనసేన పార్టీ ట్రెజరర్‌గా ఉన్నారు. ఇక జనసేన పార్టీ కోటాలో డిప్యూటీ సీఎం పవన్ సన్నిహితుడు, ప్రముఖ కళా దర్శకుడు ఆనంద్‌సాయికి అవకాశం దక్కింది. తెలంగాణలోని యాదాద్రి ఆలయం పునర్నిర్మాణంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. ఇక ఎన్ఆర్ఐ విభాగం నుంచి జాస్తి సాంబశివరావు, ఫార్మా రంగం నుంచి నన్నపనేని సదాశివరావు, సుచిత్ర ఎల్లాకు బోర్డు సభ్యులుగా అవకాశం కల్పించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు అత్యంత సన్నిహితుడు, తమిళనాడుకు చెందిన కృష్ణమూర్తికి నాలుగో సారి అవకాశం దక్కింది. అమిత్‌షా సతీమణి, కృష్ణమూర్తి సతీమణి చిన్ననాటి స్నేహితులని సమాచారం. కృష్ణమూర్తి మద్రాస్ హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయవాది. కాఫీ వ్యాపారి ఆర్ఎన్ దర్శన్, కుప్పం పారిశ్రామిక వేత్త శాంతరామ్, చెన్నైకి చెందిన పి.రామ్మూర్తిని సభ్యులుగా నియమించారు. పి.రామ్మూర్తి తమిళనాడులో పెద్ద టెక్స్‌టైల్స్ వ్యాపారవేత్త. కర్ణాటక నుంచి నరేష్‌కుమార్‌కు చోటు కల్పించారు. ఆర్థిక నిపుణుడు, నిధుల సమీకరణలో అనుభవం ఉన్న సౌరబ్ హెచ్.బోరాకు బోర్డు సభ్యుడిగా స్థానం దక్కింది. గతంలో ఎంసీఐ చైర్మన్‌గా విధులు నిర్వహించిన కేతన్ దేశాయ్ కుమారుడు డాక్టర్ అదిత్ దేశాయ్‌కు బోర్డులో స్థానం లభించింది. కేతన్‌పై ఆరోపణలుండడంతో ఆయనకు బదులుగా అదిత్ దేశాయ్‌కు అవకాశం కల్పించారు.

చైర్మన్: బొల్లినేని రాజగోపాల నాయుడు

సభ్యులు.. జ్యోతుల నెహ్రూ-జగ్గంపేట ఎమ్మెల్యే, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి- కోవూరు ఎమ్మెల్యే, ఎంఎస్‌రాజు-మడకశిర ఎమ్మెల్యే, పనబాక లక్ష్మి-కేంద్ర మాజీ మంత్రి, నన్నూరి నర్సిరెడ్డి-తెలంగాణ, సాంబశివరావు (జాస్తి శివ)-ఎన్ఆర్ఐ, నన్నపనేని సదాశివరావు-ఫార్మా, సుచిత్రా ఎల్లా-ఫార్మా, కృష్ణమూర్తి-తమిళనాడు కోటేశ్వరరావు-రాజమండ్రి, మల్లెల రాజశేఖర్ గౌడ్-టీడీపీ, జంగా కృష్ణమూర్తి-టీడీపీ, దర్శన్ ఆర్ఎన్-కాఫీ వ్యాపారి, జస్టిస్ హెచ్‌ఎల్‌దత్తు-మాజీ సీజేఐ, పి.రామ్మూర్తి-తమిళనాడు, తమ్మిశెట్టి జానకీదేవి-టీడీపీ, బి.మహేంద్రరెడ్డి-జనసేన, అనుగొల్లు రంగశ్రీ-జనసేన, బి.ఆనంద్‌సాయి-జనసేన కోటా, నరేష్ కుమార్-కర్ణాటక, శాంతరామ్-కుప్పం పారిశ్రామికవేత్త, డా.అదిత్ దేశాయ్, సౌరబ్ హెచ్ బోరా-ఆర్థిక నిపుణుడు

మళ్లీ అవకాశం

టీటీడీ పాలకమండలి సభ్యులుగా నియమితులైన వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జంగా కృష్ణమూర్తి గత వైసీపీ హయాంలోనూ బోర్డులో ఉన్నారు. వారిద్దరూ ఇప్పుడు టీడీపీలో ఉన్న సంగతి తెలిసిందే. వైసీపీ హయాంలోనూ బోర్డులో స్థానం దక్కించుకున్న సౌరబ్ బోరా.. ఇప్పుడు మరోసారి టీటీడీ సభ్యుడయ్యారు. ఇక ప్రస్తుతం టీటీడీ సభ్యుడిగా నియమితులైన రామ్మూర్తి సోదరుడు తిరుప్పూర్ బాలు గతంలో బోర్డు సభ్యుడిగా పని చేశారు. కేతన్ దేశాయ్ వైసీపీ హయాంలో టీటీడీ బోర్డు సభ్యుడిగా ఉండగా... ఇప్పుడు ఆయన కుమారుడు అదిత్ దేశాయ్‌కి అవకాశం లభించింది.

పోలవరం ఎత్తు తగ్గదు!

45.72 మీటర్ల కాంటూరులోనే నిర్మాణం: నిమ్మల

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించే ఆలోచనే టీడీపీ కూటమి ప్రభుత్వానికి లేదని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. 45.72 మీటర్ల కాంటూరు(ఎత్తు)లోనే నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రాజెక్టు ఎత్తుపై గానీ.. నీటి నిల్వపై గానీ తమ సర్కారు ఎంతమాత్రం రాజీపడదన్నారు. 150 అడుగుల మేర నీటిని నిల్వ చేసి.. నదులను అనుసంధానిస్తామన్నారు. రెండు దశల్లో ప్రాజెక్టు పూర్తిచేస్తామంటూ ప్రాజెక్టు ఎత్తును 41.15 మీటర్లకు కుదించిన ఘనుడు జగన్మోహన్‌రెడ్డేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దిశగా పీపీఏతో పలుమార్లు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారంటూ సంబంధిత డాక్యుమెంట్లు, లేఖలను మీడియాకు చూపించారు. లేఖల్లో ఫేజ్-1, ఫేజ్-2 అని పేర్కొన్నారని తెలిపారు. 41.15మీటర్ల ఎత్తులో మొదటి దశ పూర్తికి రూ.10,911 కోట్లు ఇవ్వాలని పీపీఏ సీఈవోను జగన్ కోరడం నిజం కాదా అని నిలదీశారు. జగన్ వచ్చాకే 41.15 మీటర్ల కాంటూరును తెరపైకి తెచ్చారని తెలిపారు. ఆయన తప్పిదాల వల్ల 2020లో వచ్చిన వరదలకు డయాఫ్రం వాల్ దెబ్బతిందని ఐఐటీ-హైదరాబాద్ నిపుణులు వెల్లడించారని చెప్పారు.

అప్పుడు తగ్గించేసి.. ఇప్పుడు పెడబొబ్బలా?

పోలవరం ప్రాజెక్టు గరిష్ఠ సామర్థ్యం 196.40 టీఎంసీలు (నీటి మట్టం 150 అడుగులు).. 45.72 మీటర్ల ఎత్తులో నిర్మాణం చేస్తామని గతంలో టీడీపీ ప్రభుత్వం స్పష్టంగా చెప్పింది. 2019లో జగన్ సీఎం అయిన నాటి నుంచి పరిస్థితి మారింది. ఎత్తు ఒక్కసారిగా 41.15 మీటర్లకు తగ్గిపోయింది. దశలవారీగా ప్రాజెక్టు పూర్తిచేస్తామని ఆయన చెప్పారు. తొలి దశలో 41.15 మీటర్ల కాంటూరులో 115 టీఎంసీలు నిల్వ చేస్తామని.. రెండో దశలో 45.72 మీటర్ల ఎత్తున 196.40 టీఎంసీలను నిల్వ చేస్తామని చెప్పడం మొదలుపెట్టారు. ఐదేళ్లూ అదే చేశారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడే పోలవరం నిల్వ సామర్థ్యాన్ని తగ్గించేస్తున్నారని 'ఆంధ్రజ్యోతి' పలు కథనాలు ప్రచురించింది. ఇది రాష్ట్ర ప్రజలను ఆందోళనకు గురిచేసింది. దీంతో ఎత్తు ఒకడుగు కూడా తగ్గదని అసెంబ్లీలో జగన్ చెప్పారు. కానీ 45.72 మీటర్ల కాంటూరులో 196.4 టీఎంసీల గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం మేరకు భూసేకరణ చేపడతామన్న హామీ ఇవ్వలేదు. ప్రధాని మోదీకి రాసిన లేఖలోనూ తొలి దశలో 41.15 మీటర్ల ఎత్తుకు అవసరమయ్యే రూ.12,567 కోట్లు విడుదల చేయాలని కోరారు. ఇప్పుడు అధికారం కోల్పోయి గద్దెదిగాక.. పోలవరం ఎత్తును చంద్రబాబు తగ్గించేశారంటూ గగ్గోలు పెడుతున్నారు. అదేమీ లేదని మంత్రి నిమ్మల అసలు వాస్తవాలు చెప్పడంతో జగన్ సహా వైసీపీ నేతలెవరూ కిమ్మనడం లేదు.

హెడ్‌వర్క్స్ అంచనా 11,214 కోట్లు

పోలవరంపై జలవనరుల శాఖ ఉత్తర్వులు

పోలవరం ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ అంచనా వ్యయం రూ.11,214.78 కోట్లుగా జల వనరుల శాఖ నిర్ధారించింది. ఈ మేరకు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం గ్యాప్ 1, 2, కాంక్రీట్ డ్యాం గ్యాప్-3, కాఫర్ డ్యాం, స్పిల్ చానల్, అప్రోచ్ చానల్, పైలట్ చానల్, 960 మెగావాట్ల విద్యుత్కేంద్రం కోసం క్రస్ట్ లెవెల్ వరకూ పునాదులు, స్పిల్‌వే నిర్మాణం, ఇన్‌టేక్ స్ట్రక్చర్లు, టెయిల్ పాండ్, టెయిల్ రేస్ చానల్, పవర్ హౌస్ అప్రోచ్ చానల్ వంటి నిర్మాణాలకు ఈ మొత్తం ఖర్చవుతుందని పేర్కొన్నారు.

బ్రాండ్ ఏపీ రూపకల్పనకు మద్దతివ్వండి

- ఇంద్రానూయి, సేల్స్ ఫోర్స్ ఏఐ సీఈవో క్లారాతో మంత్రి లోకేశ్ భేటీ

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బ్రాండ్ ఏపీ రూపకల్పనకు మద్దతివ్వాలని, టెక్నాలజీ, తయారీ రంగాల్లో విదేశీ పెట్టుబడులకు సహకరించాలని మంత్రి నారా లోకేశ్ కోరారు. పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తున్న ఆయన లాస్‌వేగాస్‌లోని ఐటీ సర్వ్ సినర్జీ సమిట్ ప్రాంగణంలో పెప్సికో మాజీ సీఈవో ఇంద్రానూయి, సేల్స్‌ఫోర్స్ ఏఐ సీఈవో క్లారా షియాతో విడివిడిగా సమావేశమై చర్చలు జరిపారు. ఇంద్రానూయితో భేటీ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ టెక్నాలజీ, తయారీ రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి విజనరీ లీడర్ చంద్రబాబు నేతృత్వంలో ఏపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు మద్దతివ్వాలని కోరారు. విద్య, సాంకేతిక ఆధారిత నైపుణ్యాల అభివృద్ధితో యువతకు సాధికారత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. నైపుణ్యం కలిగిన యువత వారి కెరీర్‌లో విజయం సాధించడానికి దోహదపడే మెంటరింగ్ ప్రోగ్రామ్‌లను రూపొందించాలని కోరారు. ఏపీలో సాంకేతిక పర్యావరణ వ్యవస్థ, మౌలిక సదుపాయాలు, పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలను ప్రత్యక్షంగా చూడటానికి ఒకసారి రాష్ట్రాన్ని సందర్శించాలని కోరారు. మంత్రి ప్రతిపాదనలపై ఇంద్రానూయి సానుకూలంగా స్పందించారు. ఏపీలో పెట్టుబడులకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కాగా, ప్రభుత్వ సేవల్లో కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ (సీఆర్ఎం)ను మెరుగుపరచడానికి సేల్స్‌ఫోర్స్ ఐన్‌స్టీన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ని ఏపీలో పరిచయం చేయాలని సేల్స్ ఫోర్స్ ఏఐ సీఈవో క్లారా షియాను మంత్రి లోకేశ్ కోరారు. స్మార్ట్ గవర్నెన్స్, ఏఐ డ్రివెన్ ఎకానమీపై దృష్టి సారించామని, ఏపీలో ఏఐ స్కిల్లింగ్ కార్యక్రమాలను ప్రారంభించేందుకు సహకరించాలని కోరారు. సేల్స్‌ఫోర్స్ ఏఐ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు, ప్రాక్టికల్ ట్రైనింగ్, టెక్ స్టార్టప్ ఎకోసిస్టమ్ అభివృద్ధి చేసేందుకు స్థానిక స్టార్టప్‌లకు ఏఐ టూల్స్, మెంటార్‌షిప్‌ను అందించాలని కోరారు. ఏపీలోని స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుల్లో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ సేఫ్టీ, అర్బన్ ప్లానింగ్ వంటి రంగాల్లో భాగస్వామ్యం అందించే అవకాశాలను పరిశీలించాలని మంత్రి కోరారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ సహచర బృందంతో మాట్లాడతానని క్లారా తెలిపారు.



పెప్సీ కో మాజీ సీఈవో ఇంద్రనూయిని కలిసిన మంత్రి లోకేశ్

రేపటి నుంచే ఉచిత గ్యాస్ సిలిండర్లు

- శ్రీకాకుళంలో పంపిణీని ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- ఏడాదికి రాయితీగా రూ.2,684 కోట్లు మంజూరు

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): 'సూపర్-6' హామీల అమలులో భాగంగా ఏడాది మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 'దీపం-2' పథకంగా వ్యవహరిస్తున్న ఈ ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి తొలి ఏడాది రూ.2,684 కోట్లు మంజూరు చేసింది. ఇందులో తొలివిడతగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి అయ్యే మొత్తం రూ.894 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం పెట్రోలియం సంస్థలకు అందజేశారు. సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో సీఎం చేతుల మీదుగా హిందూస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌ల ప్రతినిధులు ఆ చెక్కును అందుకున్నారు. పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆ శాఖ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నవంబరు 1న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఈదుపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబు లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేసి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇక నుంచి ప్రతి రోజూ లక్షల సంఖ్యలోనే ఉచిత సిలిండర్ల కోసం బుకింగ్‌లు కొనసాగనున్నాయి. గ్యాస్ సిలిండర్లు అందిన 48 గంటల్లోనే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

తొలిరోజే 4.3 లక్షల బుకింగ్‌లు: మంత్రి మనోహర్

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దీపం-2 పథకాన్ని సీఎం చంద్రబాబు నవంబరు 1న ప్రారంభించనున్నారని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సూపర్ సిక్స్‌లో అమలవుతున్న మొదటి పథకం ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అన్నారు. మంగళవారం ఉదయం నుంచే ఉచిత గ్యాస్ బుకింగ్‌లు ప్రారంభమయ్యాయని తొలిరోజే 4.3 లక్షల బుకింగ్‌లు జరిగాయన్నారు. లబ్ధిదారుల నుంచి భారీ స్పందన వస్తోందని చెప్పారు. రోజుకు రెండున్నర లక్షల బుకింగ్‌లకు డెలివరీ చేయగలమని గ్యాస్ కంపెనీలు చెప్పాయన్నారు. కొత్త రేషన్ కార్డుల డిజైన్ జరుగుతోందని, త్వరలోనే కొత్త కార్డులు ఇస్తామన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాలు ఎక్కడా ఇంటింటికీ వెళ్లలేదని, మూడు షాపులకు ఒక వ్యాన్ చొప్పున రూ.1500 కోట్లు గత ప్రభుత్వం దీనిపై ఖర్చు చేసిందని, అంతిమంగా వినియోదారుడికి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందన్నారు.

వేద పండితులకు నెలకు 3 వేల నిరుద్యోగ భృతి

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో భాగంగా వేద పండితులకు నిరుద్యోగ భృతి ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. వేదిక్ కోర్సు పూర్తయి, మూడేళ్ల నుంచి ఉద్యోగం లేని పండితులకు మాత్రమే ప్రతినెలా రూ.3వేలు చొప్పున ఇవ్వాలని నిర్ణయించింది. తొలివిడతలో భాగంగా 600 మందిని దేవదాయ శాఖ గుర్తించగా.. వారికి భృతి ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నిరుద్యోగ భృతి అందించే బాధ్యతను రాష్ట్రంలోని ఏడు మేజర్ ఆలయాలకు అప్పగించారు. సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, దుర్గమ్మ గుడి, శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీశైలం దేవస్థానాల నుంచి వేద పండితులకు భృతి అందిస్తారు.

అన్న క్యాంటీన్లకు సజ్జా రోహిత్ రూ.కోటి విరాళం

- వరద బాధితులకు పలువురి విరాళాలు



సీఎంకు చెక్కు ఇస్తున్న రోహిత్

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్నక్యాంటీన్ల నిర్వహణకు, వరద బాధితులను ఆదుకునేందుకు పలువురు దాతలు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విరాళాలు అందజేశారు. అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసిన పారిశ్రామికవేత్త సజ్జా రోహిత్ అన్నక్యాంటీన్ల కోసం రూ.కోటి చెక్కును విరాళంగా అందజేశారు. వరద బాధితుల సహాయార్థం ఎస్కే యూనివర్సిటీ సిబ్బంది తరుపున జీ వెంకటనాయుడు రూ.17,34,786 చెక్కు, కుప్పం నియోజకవర్గం నుంచి సేకరించిన రూ.14.36లక్షలను మాజీ ఎమ్మెల్సీ గౌరివాని శ్రీనివాసులు ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. అన్న క్యాంటీన్ల కోసం కపిలేశ్వరపురం మాతృభూమి శ్రేయో సంఘం ప్రతినిధి కే రామ్మోహన్‌రావు, ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా రూ.5,41,116 చెక్కును అందించారు.



అప్పుడు సంతకం చేసి ఇప్పుడు బెయిల్ కథలా?

(మొదటి పేజీ తరువాయి)

కాదన్నారు. గతంలోనూ ఎన్నో కంపెనీల ఆస్తులను ఈడీ అటాచ్ చేసినప్పటికీ వాటి షేర్లు బదిలీ కాకుండా ఆపలేదన్నారు. 2016లో భూములను ఈడీ అటాచ్ చేసినందువల్ల షేర్లను బదిలీ చేయకూడదని జగన్ వింతగా చెప్పడం హాస్యాస్పదమన్నారు. 2019లో తనకు 100 శాతం వాటాలను బదలాయిస్తానంటూ ఎంఓయూ మీద సంతకం చేశాక.. ఇప్పుడు బెయిల్ కుట్ర కథలు చెప్పడం ఏమిటని నిలదీశారు. ఎంఓయూ మీద సంతకం చేసినప్పుడు బెయిల్ రద్దు అవుతుందని జగన్‌కు తెలియదా అని షర్మిల ప్రశ్నించారు. 2021లో సండూర్ పవర్‌కు చెందిన షేర్లను అమ్మ విజయలక్ష్మికి రూ. 42 కోట్లకు ఎలా అమ్మారంటూ జగన్‌ను షర్మిల నిలదీశారు. అప్పుడు జగన్‌కు బెయిల్ రద్దవుతుందని తెలియదా అని నిలదీశారు. తల్లి విజయలక్ష్మికి ఫోలియా నంబర్లతో సహా రాసి గిఫ్ట్ డీడ్ ఇచ్చే ముందు బెయిల్ రద్దవుతుందని తెలియదా అని ప్రశ్నించారు. ఎన్సీఎల్టీలో కేసు ఉన్నందున షేర్లపై మాట్లాడితే కోర్టు ధిక్కారమవుతుందన్నారు. కొడుకు బెయిల్‌కు వచ్చిన ఇబ్బందేమీ లేదని అమ్మకు తెలుసునని షర్మిల చెప్పారు. అమ్మ ఆ లేఖ రాయకపోతే.. ఆ లేఖతో సంబంధం లేదని ఆమె స్వయంగా ఖండించేవారు కదా అని షర్మిల ప్రశ్నించారు.

షర్మిలకు 4+4 భద్రత కల్పించండి

» డీజీపీకి కాంగ్రెస్ నేతల వినతి

విజయవాడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు 4+4 భద్రత కల్పించాలని కాంగ్రెస్ నేతలు విజ్ఞప్తి చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు బొర్రా కిరణ్, విజయవాడ నగర కమిటీ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహరావు, ఏసురత్నం తదితరులు డీజీపీ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. 'తెలంగాణలో షర్మిలకు వై కేటగిరి భద్రత కల్పిస్తున్నారు. దాన్ని రాష్ట్రంలోనూ కొనసాగించాలి. రాజకీయంగా మారిన పరిస్థితుల నేపథ్యంలో వై కేటగిరి... 4+4 భద్రత కల్పించాలి' అని వారు కోరారు.

వైఎస్ కుటుంబ అక్రమ ఆస్తులను ప్రజలకు పంచాలి

» 'ముగ్గురూ' కలిసి వైఎస్సార్‌ను రోడ్డుకీడ్చారు: మంత్రి ఆనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం, పక్కన మంత్రి స్వామి

ఒంగోలు(కార్పొరేషన్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వైఎస్ కుటుంబ అక్రమ ఆస్తులను ప్రజలకు పంచాలి. ఈ విషయంలో అవసరమైతే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి' అని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఒంగోలులోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'జగన్ కుటుంబంలో ఆస్తుల గొడవ వైఎస్ ఫ్యామిలీకి సంబంధించినదే. ఇది ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేదు. తల్లి, కూతురు, కొడుకు మధ్య ఆస్తులపై రగడ చూస్తుంటే సిగ్గుగా ఉంది. రాజశేఖరరెడ్డి బతికి ఉన్నంతకాలం ఏవీ బయటకు రాలేదు. అయితే నేడు వైఎస్ కుటుంబసభ్యులు ఇంటి గుట్టును రాజకీయ సమస్య చేసి, పనికిమాలిన చర్యలకు పాల్పడుతున్నారు. వైసీపీ అధ్యక్షునిగా కొడుకు, మాజీ అధ్యక్షురాలిగా తల్లి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా కూతురు... ఈ ముగ్గురూ కలిసి ఆస్తుల వ్యవహారాన్ని రోడ్డుకీడ్చి రాజకీయం చేస్తున్నారు. జగన్ అక్రమ సంపాదన ప్రజలకు పంచాలి. నేను గత కాంగ్రెస్ ప్రభుత్వంలో పదిహేనేళ్లు ఎమ్మెల్యేగా, పదేళ్లు మంత్రిగా పనిచేశా. ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో నా ఆస్తులు మైనస్‌లోకి వెళుతుంటే విచిత్రంగా జగన్ ఆస్తులు మాత్రం పెరిగిపోయాయి. వైఎస్ బతికున్నప్పుడే జగన్ రూ.లక్ష కోట్ల ఆస్తులు సంపాదించారనే విమర్శలు వచ్చాయి. అందువల్ల కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని వాటిని ప్రజలకు పంచితేనే గొడవలు ఆగుతాయి. వైఎస్సార్‌ను ఈ ముగ్గురూ కలిసి రోడ్డున పడేశారు' అని మంత్రి ఆనం మండిపడ్డారు.

అక్రమాల పత్రిక అవినీతి పుత్రిక 'సాక్షి'

పైసా పెట్టుబడి లేకుండా రోత పత్రిక, చానల్ ఏర్పాటు

● జగన్ తన రోత మీడియాలో సొంతంగా రూపాయి కూడా పెట్టుబడి పెట్టలేదు. అసలు ఎవరు పెట్టుబడి పెట్టారో కూడా తెలియదు. ఇష్టానుసారం ఎడాపెడా షెల్ కంపెనీలు సృష్టించి, చట్టాలను ఉల్లంఘించి అందులోకి విదేశీ పెట్టుబడులు రప్పించారు. అంటే.. ఈ లెక్కన దావూద్ ఇబ్రహీంలాంటి మాఫియా డాన్‌లు, వేర్పాటు వాదులూ పత్రికలు పెట్టొచ్చన్న మాట!

● నాడు తండ్రి అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా 'మేళ్లు' పొందినవారు అందుకు ప్రతిఫలంగా జగన్‌కు లబ్ధి చేకూర్చారు. అంటే.. క్విడ్ ప్రోకో. అవినీతి సొమ్మును అక్రమ మార్గాల్లో విదేశాలకు తరలించి, పెట్టుబడుల రూపంలో మళ్లీ తన కంపెనీల్లో పెట్టారు. చట్టాలు సరిగా పనిచేసి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటే జగన్ రోత మీడియానే ఉండదు.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మానవాతీత శక్తులు ఉన్నవాళ్లు శూన్యంలో నుంచి సిరిసంపదలు సృష్టించడాన్ని పురాణగాథల్లో చూశాం. వైఎస్ రాజశేఖరరెడ్డి వారసుడు జగన్‌కు కూడా అలాంటి అతీంద్రియ శక్తులు ఉండి ఉంటాయి కాబోలు! ఎందుకంటే.. రూపాయి పెట్టుబడి పెట్టకుండా వందల కోట్ల విలువైన సాక్షి పత్రిక, చానల్, వాటిని నడిపే జగతి పబ్లికేషన్స్, ఇందిరా టెలివిజన్‌కు అధిపతి అయ్యారు. వీటిలో పెట్టుబడులు పెట్టిన కంపెనీలు నాడు రాజశేఖరెడ్డి ప్రభుత్వంలో అడ్డగోలుగా లబ్ధి పొందినవే అన్న అభియోగాలున్నాయి. షెల్ కంపెనీలను పుట్టించి, అక్రమంగా విదేశీ పెట్టుబడుల రూపంలో స్థాపించారు. అవినీతి సొమ్ముతో స్థాపించిన రోత మీడియాకు నిజమైన వారసులు ఎవరు? అసలైన యజమాని ఎవరు?

సండూర్‌తో మొదలై...

1998లో జగన్ సండూర్ పవర్ అనే కంపెనీని టేకోవర్ చేశారు. వైఎస్ సీఎం అయ్యాక ఆ కంపెనీకి తోడు గొలుసుకట్టు కంపెనీలను పుట్టించారు. ఓ మహా మాయా సామ్రాజ్యాన్ని నిర్మించారు. దేశీయ అక్రమార్జనను విదేశాలకు తరలించడం, దొడ్డిదారిన అదే సొమ్మును తన కనుసన్నల్లో ఉండే కంపెనీల్లోకి రప్పించడం అనే ఇంద్రజాలాన్ని ప్రదర్శించారు. దీనికి కేంద్ర బిందువు జగన్ టేకోవర్ చేసిన సండూర్ కంపెనీ. వైఎస్ అధికారంలోకి వచ్చాకే సండూర్ కంపెనీకి వెలుగులోచ్చాయి. నిజానికి 1998లో ఈ కంపెనీని టేకోవర్ చేస్తే, 2005లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించింది. 2005లోనే సండూరు పవర్ మరికొన్ని కంపెనీలను ఏర్పాటు చేసింది. అందులో ఒకటి కార్మెల్ ఏషియా హోల్డింగ్స్. ఈ కంపెనీ క్యాపిటల్ 20 కోట్లు కాగా, పెయిడ్ అప్ క్యాపిటల్ 15.22 కోట్లు. సండూర్ పవర్‌లో ప్రమోటర్ల వాటా 62.54%(33 కోట్లు). 2005లో 2ఐ క్యాపిటల్ అనే సంస్థకు 1.48 కోట్ల షేర్లను, ప్లూరీ ఎమర్జింగ్ కంపెనీస్ అనే సంస్థకు 26.76 లక్షల షేర్లను రూ.61 ప్రీమియంతో అలాట్ చేశారు. దీని ద్వారా సేకరించిన మొత్తం రూ.124.6 కోట్లు. అంటే 53.41 కోట్ల పెట్టుబడితో కంపెనీని ఏర్పాటు చేసి, అందులోని షేర్లను విక్రయించడం ద్వారా 124 కోట్లను సేకరించారు.

పిల్ల కంపెనీలను పుట్టించి...

సండూర్ కంపెనీ 2005లో కార్మెల్ ఏషియా హోల్డింగ్స్ సహా అనుబంధ కంపెనీలను ఏర్పాటు చేసింది. 2006 అక్టోబరులో రూ.10 రూపాయల ముఖ విలువతో కార్మెల్ షేర్లను తిరిగి సండూర్ పవర్‌కు జారీ చేశారు. షేర్ల విక్రయం ద్వారా సమీకరించిన 124 కోట్లలో 15 కోట్లను సండూర్ పవర్.. కార్మెల్ ఏషియాలో పెట్టుబడిగా పెట్టిందన్నమాట.

పెట్టుబడులు ఎలా వచ్చాయి?

జగన్ పత్రిక, టీవీ చానల్ ఏర్పాటుకు కేంద్ర బిందువు కార్మెల్ ఏషియా. దీనికి మూలబిందువు సండూర్ పవర్. ఈ సంస్థ వ్యాపార విస్తరణకు విదేశీ పెట్టుబడి సంస్థలు 2ఐ క్యాపిటల్, ప్లూరీ ఎమర్జింగ్ క్యాపిటల్ పెట్టుబడులు పెట్టాయి. 22 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే సంస్థలో రూ.61 ప్రీమియంతో పెట్టుబడులు పెట్టడం జగన్మాయే. సండూర్ పవర్‌లో 1.48 కోట్ల షేర్లను కొన్న 2ఐ క్యాపిటల్ తన ప్రతినిధిగా విజయసాయిరెడ్డిని నియమించింది. జగన్ సన్నిహితుడినే బోర్డు సభ్యుడిగా ఎందుకు నియమించినట్లు? అంటే.. జగన్ తన సంపాదనను దారి మళ్లించి 2ఐ క్యాపిటల్‌కు చేర్చి, దాని ద్వారా తిరిగి తన కంపెనీలోనే పెట్టుబడులు పెట్టించారా? అంటే.. సీబీఐ అవుననే చెబుతోంది. రెండో కంపెనీ ప్లూరీ ఎమర్జింగ్. స్టాక్ మార్కెట్‌లోకి అక్రమంగా నిధులను తరలించిన ఆరోపణలు దీనిపై ఉన్నాయి. కార్మెల్ ఏషియాలో పెట్టుబడులు పెట్టిన వారే జగతిలోనూ పెట్టారు. వీటిలో జీఆర్ ఇంట్రాకెమ్, పయనీర్ ఇన్ ఫ్రా, ఇండియా సిమెంట్స్ ఉన్నాయి. ఇండియా సిమెంట్స్ వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు లబ్ధిపొందింది.

■ పైసా పెట్టుబడి లేకుండా...

2006 నవంబరులో జగతి పబ్లికేషన్స్ ఏర్పాటైంది. అప్పుడు దాని ఆథరైజ్ క్యాపిటల్ రూ.5 కోట్లే. నెల రోజుల్లోనే జగన్ తన మాయాజాలంతో 100 కోట్లకు పెంచారు. 2007 అక్టోబరు నుంచి 2008 మే మధ్య దాదాపు 97.36 లక్షల షేర్లను ఇతర కంపెనీలకు కేటాయించడం ద్వారా 350 కోట్లను సమీకరించుకుంది. రూ.10 చేసే ఒక్కో షేర్‌ను రూ.350తో అలాట్ చేసింది. ఈ రూ.350 కోట్లు, కార్మెల్ ఆసియా సమకూర్చిన 73.56 కోట్లు వెరసి మొత్తం పెట్టుబడి 423.56 కోట్లు.



సరిగ్గా సండూర్‌కు షేర్లను జారీ చేసిన 4 నెలల తర్వాత రూ.10 షేర్లనే బయటి వాళ్లకు రూ.252 ప్రీమియంతో కార్మెల్ అలాట్ చేసింది. రూ.10కు రూ.252 కలిపితే వెరసి రూ.262 అన్నమాట. మొత్తం 24.04 లక్షల షేర్లను రెండు విడతల్లో అమ్మడం ద్వారా రూ.82 కోట్లను సమీకరించింది. సండూర్ అనుబంధ కంపెనీగా ఉన్న కార్మెల్ ఏషియా మరో 2 కంపెనీలను ఏర్పాటు చేసింది. అందులో ఒకటి జగతి పబ్లికేషన్స్ మరొకటి ఇందిరా టెలివిజన్. కార్మెల్ ఏషియా సమీకరించిన 82 కోట్లలో 73.56 కోట్లను జగతి పబ్లికేషన్స్‌లో, 10.47 కోట్లను ఇందిరా టెలివిజన్‌లో పెట్టుబడిగా పెట్టింది.

"జగన్ వ్యాపార సామ్రాజ్యమంతా ఓ మాయా ప్రపంచం. సండూర్ పవర్ కంపెనీ మొత్తం 4 అనుబంధ కంపెనీలను ప్రమోట్ చేసింది. ఇవి క్లాసిక్ రియాల్టీ, కార్మెల్ ఏషియా, భగవత్ సన్నిధి ఎస్టేట్స్, హరీశ్ ఇన్‌ఫ్రా. ఈ కంపెనీల్లో క్లాసిక్ రియాల్టీకి మరో 3 అనుబంధ కంపెనీలుగా సిలికాన్ బిల్డర్స్, మార్వెల్ ఇన్‌ఫ్రా, కాప్‌స్టోన్ ఇన్‌ఫ్రా తోడయ్యాయి. కార్మెల్ అనుబంధ సంస్థల్లో జగతి పబ్లికేషన్స్, ఇందిరా టెలివిజన్‌తో పాటు జనని ఇన్‌ఫ్రా ఉంది. సిలికాన్ బిల్డర్స్ అనుబంధ సంస్థల్లో షలోమ్ ఇన్‌ఫ్రా, ఇన్‌స్పైర్ హోటల్స్ ఉన్నాయి."

అంతా మాయా ప్రపంచం

కేసీ కెనాల్ భూముల పరాధీనం కేసులో 20 మంది అధికారులపై చర్యలకు సిద్ధం

» విజిలెన్స్ నివేదిక ఆధారంగా రెవెన్యూ శాఖ చర్యలు

» 2019లోనే నివేదిక.. తొక్కిపెట్టిన జగన్ సర్కారు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కడప జిల్లాలోని కేసీ కెనాల్ భూముల పరాధీనం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. గత ఐదేళ్లు జగన్ సర్కారు తొక్కిపెట్టిన విజిలెన్స్ నివేదికను కూటమి ప్రభుత్వం వెలుగులోకి తీసుకొచ్చింది. భూములు పరాధీనం అవడానికి, ఆతర్వాత ఆ భూములను పరిరక్షించడంలో 20 మంది అధికారులు తీవ్ర వైఫల్యం చెందారని విజిలెన్స్ గుర్తించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఫారసుల మేరకు 20 మంది అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు (జీవో-241) జారీ చేశారు. నాలుగు శాఖల అధికారులు ఈ జాబితాలో ఉన్నారు. కాబట్టి ఆయా శాఖలు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అభియోగాలు ఎదుర్కొంటున్నవారు 2019కు ముందు కడప జిల్లా పరిధిలో పని చేశారు. ప్రస్తుతం వీరంతా వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్నారు.

ఐదేళ్ల తర్వాత చర్యలు

కడప జిల్లాలో విలువైన కేసీ కెనాల్ భూములు అన్యాక్రాంతం అయ్యాయి. వాటి పరిరక్షణలో ఆయా శాఖల అధికారులు విఫలమయ్యారు. దీంతో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో విచారణ జరిపింది. అధికారుల పాత్ర ఉందని అనుమానాలు రావడంతో విజిలెన్స్ విచారణ జరిపించింది. ఈమేరకు విజిలెన్స్ విచారణ జరిపి 2019 మే 20న సర్కారుకు నివేదిక ఇచ్చింది. అప్పటికే రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం నెలకొంది. జగన్ సర్కారు వచ్చాక ఈ ఫైలుపై ఐదేళ్లపాటు ఏ చర్యలూ తీసుకోలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం పెండింగ్ ఫైళ్ల బూజు దులిపి పరిశీలిస్తోంది. ఈ కేసులో చర్యలు తీసుకుంటూ రెవెన్యూ శాఖ ఆదేశాలు ఇచ్చింది.

వీరిపైనే క్రమశిక్షణ చర్యలు!

ఇరిగేషన్ శాఖ అధికారులు: 1. ఎస్.సుధాకర్-ఈఈ, మైలవరం, 2.మల్లికార్జున-ఈఈ, కెసీ కెనాల్ నంద్యాల, 3.కె.సుబ్బయ్య-ఈఈ, ధవళేశ్వరం, 4.ఎస్.జిలాని బాష-డీఈ, మైదుకూరు.

పురపాలకశాఖ: 5.బి.విజయభాస్కర్-అసిస్టెంట్ సిటీ ప్లానర్, గూడూరు మున్సిపల్ కార్పొరేషన్, 6. టీఎం.రామ్మోహన్-టౌన్ ప్లానింగ్, కదిరి మున్సిపాలిటీ. 7.జి.నాగశివ ప్రసాద్-టౌన్‌ప్లానింగ్, కడప మున్సిపాలిటీ. 8.జి.శారదాంబ-ప్లానింగ్ సూపర్‌వైజర్, రాజంపేట. 9.సీటీ కష్ణసింగ్-టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్, పులివెందుల మున్సిపాలిటీ. 10. ఎ.సలీమ్‌బాషా-కాకినాడ మున్సిపల్ కమిషనర్, 11.డి. జాన్‌శామ్సన్-కమిషనర్, రామగుండం మున్సిపాలిటీ(తెలంగాణ), 12.సి.ఓబులేసు-కమిషనర్, అనంతపురం మున్సిపాలిటీ.

హోంశాఖ: 13. టి.రెడ్డప్ప-సీఐ, 14. ఎస్.రామకృష్ణుడు-సీఐ, 15.ఎస్.రామకృష్ణ-సీఐ, 16. వి.నారాయణస్వామిరెడ్డి-డీఎస్పీ.

రెవెన్యూ శాఖ: 17. ఎ.శ్రీనివాస్-తహసీల్దార్, వేంపల్లి, 18.ఎస్.రవిశంకర్‌రెడ్డి -తహసీల్దార్, దువ్వూరు, 19. ఎస్.ప్రేమానంతకుమార్, తహసీల్దార్.

పంచాయతీరాజ్ శాఖ: 20.ఎస్.శివరామిరెడ్డి-సూపరింటెండెంట్, కడప జెడ్పీ.

మద్యం స్కాంపై సీఐడీ స్పీడు

» ఆరు జిల్లాల్లో 14 చక్కెర, 4 బీర్ ఫ్యాక్టరీల్లో తనిఖీలు

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

మద్యం కుంభకోణంలో మూలాలను సీఐడీ అధికారులు వెలికితీస్తున్నారు. మద్య నిషేధం హామీతో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ మాట తప్పి, మడమ తిప్పి వేల కోట్లు దోచేసిన తీరును సీఐడీ బయటికి తీస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మద్యం తయారీ కేంద్రాల్లో వరుస సోదాల ద్వారా ఆధారాలు సేకరిస్తోంది. ఇటీవల డిస్టిలరీల్లో సోదాలు చేపట్టిన సీఐడీ అధికారులు బుధవారం ఆరు జిల్లాల్లోని 14 చక్కెర ఫ్యాక్టరీల్లో తనిఖీలు చేపట్టారు. మద్యం తయారీకి ఉపయోగించే మొలాసిస్ గడిచిన ఐదేళ్లలో ఎంత ఉత్పత్తి అయింది? దాన్ని ఏ మద్యం తయారీదారుకు విక్రయించారు? ఎవరెవరికి ఎంత సరఫరా చేశారు? దాని ఖరీదెంత? బిల్లులు మొత్తం వచ్చేశాయా? బకాయిలు ఎక్కడెక్కడ ఉన్నాయి? తదితర వివరాలను ఆయా పరిశ్రమల్లోని వ్యక్తులను ప్రశ్నించి నమోదు చేసుకున్నారు. 2019 జూన్ నుంచి గడిచిన ఐదేళ్ల రికార్డులు స్వాధీనం చేసుకున్న సీఐడీ అధికారులు రాష్ట్రంలో బీర్ తయారు చేసే నాలుగు కంపెనీల్లోనూ సోదాలు చేపట్టారు. అక్కడి ఉత్పత్తి, సరఫరా, ఆర్థిక లావాదేవీలు, బిల్లుల వివరాలకు సంబంధించిన రికార్డులు తీసుకెళ్లారు. ఉమ్మడి చిత్తూరు, కర్నూలు, నెల్లూరు, తూర్పు గోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఈ తనిఖీలు జరిగాయి. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం చినబ్రహ్మదేవంలోని కేబీకే బయోటెక్ కంపెనీలో డిజిటల్ రికార్డులు, కంప్యూటర్ల డేటాను సీఐడీ అధికారులు పరిశీలించారు. ఆల్కహాల్ స్పిరిట్‌ను తయారు చేసే ఈ కంపెనీ కొన్నేళ్లుగా రాష్ట్రంలోని పలు డిస్టిలరీలకు స్పిరిట్ సరఫరా చేస్తోంది. ఈ నేపథ్యంలో స్పిరిట్ క్రయవిక్రయాలకు సంబంధించిన లావాదేవీలను సీఐడీ బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. కేబీకే పరిశ్రమ స్థానికంగా కొంత మంది నుంచి పీడీఎస్ బియ్యాన్ని పెద్దమొత్తంలో కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దాన్ని వివిధ రకాలుగా ప్రాసెస్ చేసి ఆల్కహాల్ తయారీలో వినియోగిస్తున్నారా? లేదా క్యాటిల్ ఫీడ్ తయారీకి వినియోగిస్తున్నారా? అనే కోణంలోను ఆరా తీశారు. నెల్లూరు జిల్లాలోని సర్వేపల్లి సమీపంలో ఉన్న ఎస్ఎన్‌జే (ఎస్ఎన్ జయమురగన్) బీర్ ఫ్యాక్టరీలోనూ సీఐడీ బృందం మరోసారి ఆకస్మిక సోదాలు చేపట్టింది. అయితే, వివరాలేవీ బయటకు పొక్కకుండా చాలా గోప్యంగా ఉంచారు. పలు కీలకమైన ఫైళ్లు, రికార్డులు, హార్డ్ డిస్క్‌లను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. శ్రీకాకుళం జిల్లా బంటుపల్లి వద్ద యాబీ బేవరేజెస్‌లోనూ సీఐడీ అధికారులు తనిఖీలు చేశారు. బాటిలింగ్ యూనిట్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసినట్టు తెలుస్తోంది. గత ఐదేళ్లుగా నాసిరకం మద్యం సరఫరా చేసిన విషయంపై ఆరాతీసినట్టు సమాచారం. అలాగే, విజయనగరం జిల్లా రేగిడి మండలం సంకిలి ఈఐడీ ప్యారీ సుగర్స్ అనుబంధ డిస్టిలరీ ప్లాంట్‌లో సీఐడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈఎన్ఏ తయారీ, నిల్వలు, వినియోగంపై ఆరా తీసినట్లు సమాచారం. తనిఖీల సమయంలో మీడియాను అనుమతించలేదు. బయటకు వచ్చాక మీడియా వివరాలు అడిగినా వెల్లడించేందుకు సిట్ సభ్యులు నిరాకరించారు.



భయపెట్టారు.. బెదిరించారు!

» తప్పు చేయలేదని వేడుకున్నా నాడు పోలీసులు వదల్లేదు: జెత్వానీ

» సీఐడీ అధికారుల ముందు కన్నీరుమున్నీరు

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): 'భయపెట్టారు.. బెదిరించారు.. నేను చేసిన తప్పేంటో వివరంగా చెప్పరు.. ఫోన్లు, ల్యాప్‌టాప్ లాక్కొని ఏకాకిని చేశారు.. లాయర్‌తో మాట్లాడుకోవడానికి అవకాశమివ్వరు.. ఖాళీ పేపర్లపై సంతకాలు పెట్టమని ఒత్తిడి చేశారు.. అందరూ మగ పోలీసులు చుట్టుముట్టి వేధించారు.. ఆడ పోలీసు చెంపపై కొట్టి జుట్టు పట్టుకు లాగారు.. ఆ భూమి గురించి నాకు తెలియదని మొత్తుకున్నా వినలేదు.. నాలుగు రోజులు నరకం చూపించారు.. నలభై రోజులు జైల్లో పెట్టారు.. ఆ బాధ ఎప్పటికీ మరిచిపోలేను..' అని ముంబై సినీనటి కాదంబరి జెత్వానీ సీఐడీ అధికారుల ముందు కన్నీటి పర్యంతమయ్యారు. వైపీఎస్ అధికారుల బాధితురాలు జెత్వానీ కేసులో సీఐడీ బుధవారం ఆమెను, ఆమె తల్లిదండ్రులను మంగళగిరిలోని తమ కార్యాలయానికి పిలిపించింది. వారి వాంగ్మూలాలను రికార్డు చేసింది. తాడేపల్లి ప్యాలెస్‌లో కుట్ర చేసి ముంబై నుంచి బలవంతంగా తమను బెజవాడకు తీసుకొచ్చి వేధించిన ఐపీఎస్ అధికారుల కర్కశత్వాన్ని వారు వివరించారు. వైసీపీ ప్రభుత్వ పెద్దలు, వైపీఎస్ అధికారులు మాఫియాగా వ్యవహరించిన ఈ కుట్ర వ్యవహారం గతేడాది డిసెంబరు చివరి వారంలో తాడేపల్లి ప్యాలెస్‌లో పురుడు పోసుకుంది. ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్లో వైసీపీ నాయకుడు కుక్కల విద్యాసాగర్‌తో తప్పుడు ఫిర్యాదు చేయించి ఈ ఏడాది ఫిబ్రవరి 2న కేసు నమోదు చేసి వేధించారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడగానే తమకు జరిగిన అన్యాయాన్ని దాని దృష్టికి తీసుకెళ్లింది. ఆగస్టు చివరి వారంలో విజయవాడకు వచ్చి పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబుకు ఫిర్యాదు చేయగా.. ఏసీపీ స్రవంతి రాయ్‌కు విచారణ బాధ్యతలు అప్పగించారు. ఈ వ్యవహారంలో నాటి నిఘా చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, బెజవాడ పోలీసు కమిషనర్ కాంతి రాణా, డీసీపీ విశాల్ గున్నీ పేర్లు ఉండడంతో వారిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆ ముగ్గురితోపాటు ఏసీపీ హనుమంతరావు, అప్పటి ఇబ్రహీంపట్నం సీఐ ముత్యాల సత్యనారాయణపై జెత్వానీ ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నంలో సెప్టెంబరు 14న కేసు నమోదైంది. విద్యాసాగర్ ఏ-1కాగా ముగ్గురు ఐపీఎస్‌లు, ఇద్దరు పోలీసులు, మరో న్యాయవాది నిందితులుగా ఉన్నారు. కేసులో పెద్దలు ఉండడంతో డీజీపీ ద్వారకా తిరుమలరావు దీనిని సీఐడీకి అప్పగించారు. సీఐడీ దర్యాప్తును వేగిరపరచింది.

విద్యాసాగర్ ఎందుకు టార్గెట్ చేశాడు..?

జెత్వానీ చెప్పిన అంశాలను రికార్డు చేసిన సీఐడీ అధికారులు.. ఆమెను కొన్ని వివరాలు అడిగారు. 'ఇబ్రహీంపట్నంలో ఫిబ్రవరి 2న మీపై పోలీసులకు ఫిర్యాదు చేసిన కుక్కల విద్యాసాగర్‌తో మీకున్న వైరం ఏంటి.. ఆయన్నుంచి మీకేమైనా వేధింపులు వచ్చాయా.. ఉద్దేశపూర్వకంగా ఎందుకు టార్గెట్ చేశాడు.. అంతకుముందు మీ ఇద్దరి మధ్య ఏం జరిగింది..' అని ప్రశ్నించి.. కీలక సమాచారాన్ని రాబట్టారు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం పోలీసులు సేకరించిన ఆధారాలతో ఆమె చెప్పిన వివరాలను పోల్చిచూస్తున్నట్లు తెలిసింది. ఇంకోవైపు.. విద్యాసాగర్‌ను కోర్టు తమ కస్టడీకి ఇస్తే సంధించాల్సిన ప్రశ్నలను సీఐడీ అధికారులు ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. ఆ తర్వాత ఐపీఎస్‌లను కూడా ప్రశ్నించనున్నట్లు సమాచారం.

ఈ దీపావళి కథే వేరు

శ్రీకాకుళం జిల్లాలో రెండు గ్రామాలకు పండగ పేరు.. రాజు ప్రాణాలు కాపాడినందుకు ఓ ఊరికి.. ఎలుక చేసిన తుంటరి పనికి మరో ఊరికి పేర్ల మార్పు



శ్రీకాకుళం, రణస్థలం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బస్సెక్కి దీపావళికి ఓ టికెట్ ఇవ్వండి అని అడిగితే.. అటుగా వచ్చే కొత్తవాళ్లు ఎవరైనా ఆ బస్సులు ఉన్నారంటే కాస్త ఆశ్చర్యపోవాల్సిందే. మరి రెండు ఊళ్లు అదే పేరుతో ఉంటే.. సంబరమాశ్చర్యమే. ఎందుకంటే ఓ పండగ పేరే ఆ ఊళ్లకు పేరుగా ఉండటమే కారణం. చారిత్రక పాశస్త్యంతో పాటు ఎన్నో విశేషాలకు నెలవైన శ్రీకాకుళం జిల్లాలో దీపావళి పేరుతో రెండు ఊళ్లు ఉన్నాయి. ఈ పేర్లు ఎలా వచ్చాయనేది ఆసక్తి కలిగిస్తుంది. కొన్ని దశాబ్దాల కిందట వేర్వేరుగా జరిగిన సంఘటనలతో ఆ రెండు గ్రామాలకు దీపావళి పేరు వచ్చింది. గార మండలంలో దీపావళి, టెక్కలి మండలంలో దీపావళి పేట గ్రామాలు ఆ ప్రత్యేకతను సంతరించుకున్నాయి. అప్పట్లో సిక్కోలు రాజు ఆధీనంలో కళింగపట్నం ఓడరేవు ఉండేది. ఇప్పుడు గార మండల పరిధిలో ఉంది. అప్పట్లో సిక్కోలు రాజు 'దీపావళి' పండగ నాడు కళింగపట్నం వైపు గుర్రంపై బయలుదేరారు. మధ్యలో ఓ గ్రామంలో స్వల్ప అస్వస్థత గురై ఆయన స్పృహ తప్పి పడిపోయారు. స్థానికులు ఆ రాజుకు సపర్యలు చేయగా.. కొద్దిసేపటి తర్వాత తేరుకున్నారు. తనను కాపాడినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ రోజు దీపావళి పండగ కావడంతో.. ఇకపై ఈ గ్రామానికి కూడా 'దీపావళి'గా నామకరణం చేస్తున్నట్లు ప్రకటించారు. అప్పటి నుంచీ ఆ గ్రామం దీపావళి అయ్యింది. ఈ గ్రామంలో దీపావళి పండుగ పదిరోజుల పాటు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.



టెక్కలి మండలంలో దీపావళిపేట గ్రామం

■ ఇళ్లు అంటించిన ఎలుక..

టెక్కలి మండలం అయోధ్యాపురం పంచాయతీలో 'దీపావళిపేట' అనే గ్రామం ఉంది. ఈ గ్రామంలో వందేళ్ల కిందట అన్నీ పూరి గుడిసెలే ఉండేవి. ప్రతి ఇంటిలో నూనె దీపాలనే వినియోగించేవారు. ఓ రోజు వెలుగుతున్న దీపం ఒత్తిని తుంటరి ఎలుక తీసుకెళ్లి ఓ ఇంటికి నిప్పుపెట్టింది. దీంతో పూరిళ్లు అన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. దీపంతో పేట మొత్తం ఆహుతి అవ్వడంతో తొలుత దీపాలపేటగా పిలిచేవారు. ఆ తర్వాత దీపావళి పేటగా మార్పు చెందింది.

పున్నానపాలెం.. దీపావళికి దూరం

దీపావళి పేరుతో ఉన్న గ్రామాల్లో సందడికి విరుద్ధంగా.. శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలం మండలం పున్నానపాలెంలో ఈ పండగకు ఏ సందడీ ఉండదు. రెండు వేల జనాభా ఉన్న ఈ గ్రామంలో ఏఒక్కరూ దీపావళి, నాగుల చవితి జరుపుకోరు. ఇదిచాలా ఏళ్ల నుంచి వస్తున్న ఆనవాయితీ. 150 ఏళ్ల కిందట ఈ గ్రామంలోని ఒక రైతుకు దీపావళి, నాగులచవితి పండగ చేసిన తర్వాత కష్టాలు కలగడంతో అప్పటి నుంచి ఈ పండుగలు చేసుకోవట్లేదని గ్రామపెద్దలు చెప్పారు. చిన్న పిల్లలు సైతం టపాసులు పేల్చకుండా ఉండటం విశేషం.

పెద్దలు చెప్పగా విన్నాం



అప్పుడెప్పుడో మా ఊరు అంతా అగ్నికి ఆహుతైందని పెద్దల ద్వారా విన్నాం. మా చిన్నప్పుడు ఎక్కువగా ఇదే విషయం పండగలప్పుడు మాట్లాడుకునేవాళ్లం. ఇప్పుడు ఊరు అభివృద్ధి చెందింది. అన్నీ డాబా ఇళ్లే. అయితే దీపావళి అంటేనే మా ఊరందరికీ ప్రత్యేక పండగగా నిర్వహిస్తుంటాం.

- జామి చిన్నవాడు, దీపావళిపేట

మాకెంతో ఆనందం



మా గ్రామం పేరు దీపావళి కావడం.. ఆ పేరు వెనుక చరిత్ర ఉండడంతో ఎంతో ఆనందంగా ఉంటుంది. దీపావళి సమయంలో మా గ్రామ చరిత్ర గురించి పెద్దవాళ్లు.. పిల్లలు కూడా మాట్లాడుకుంటూ ఉంటారు.

- శ్రీరంగం మధుసూదన రావు, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి, దీపావళి

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


HAPPY Diwali
Vijaydigital
The Electronics Super Store Since 1982
Festival Sales UPTO 60%* OFF
Follow us on Instagram
మా కస్టమర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు దీపావళి శుభాకాంక్షలు
BAJAJ FINSERV
TVS CREDIT
IDFC FIRST Bank
HDB FINANCIAL SERVICES
HDFC BANK
benow it's easy
onsitego
₹1* డౌన్ పేమెంట్‌తో 24 నెలలు* వడ్డీ లేకుండా సులభ వాయిదాలతో*
Cash Backs, No Cost EMI* BAJAJ FINSERV Anywhere EMI* Follow us on
Upto 50% Off*
OLED
55 (139 cm)
MRP ₹ 1,59,990/-
Offer Price ₹ 74,990/-*
T&C Apply*
LED TV
55 UHD (139 cm) Offer Price ₹ 36,990/-*
43 UHD (108 cm) Offer Price ₹ 26,990/-*
32 HD (80 cm) Offer Price ₹ 11,990/-*
Combo
Special Offers on Sound Bars*
Air Conditioners
1.5 Ton 3 Star AC Range Starts from
₹ 29,990/-*
Cash Back ₹ 10,000/-*
LG
SAMSUNG
BLUE STAR
HITACHI
LLOYD
GENERAL
IFB
Carrier
Panasonic
DAIKIN
Godrej
Whirlpool
Haier
MITSUBISHI
VOLTAS
CASH BACK
190 Ltr Single Door Fridge
Offer Price
₹ 11,990/-*
240 Ltr Double Door Fridge
Offer Price
₹ 20,990/-*
Cash Back ₹ 1,000/-*
IFB
6 Kg. Front Load
Offer Price
₹ 22,990/-*
Cash Back ₹ 1,500/-*
LG
8 Kg. Front Load
Offer Price
₹ 33,990/-*
Cash Back ₹ 5,000/-*
LLOYD
570 Ltr Side by Side Fridge
Offer Price
₹ 44,990/-*
Cash Back ₹ 6,000/-*
SAMSUNG
653 Ltr Side by Side Fridge
Offer Price
₹ 68,990/-*
Cash Back ₹ 2,500/-*
Whirlpool
6.5 Kg. Fully Automatic
Offer Price
₹ 12,990/-*
LLOYD
7.5 Kg. Fully Automatic
Offer Price
₹ 14,490/-*
Galaxy A35 5G
Samsung S24 Ultra
Upto ₹ 12,000* Cash Back
EMI ₹ 5,000/-*
Samsung A35
Upto ₹ 5,000* Cash Back
EMI ₹ 3,444/-*
Vivo V40E
Upto 10%* Cash Back
EMI ₹ 3,625/-*
Vivo V40E
Upto 10%* Cash Back
EMI ₹ 4,375/-*
Oppo F27 Pro plus
Upto 10%* Cash Back
EMI ₹ 3,500/-*
Reno 12 Pro
Upto 10%* Cash Back
EMI ₹ 4,625/-*
Premium Kitchen Appliances
(₹ 20,000/- and above Cash Back)
Chimney Range Starts from
₹ 9,990/-*
(₹ 20,000/- and above Cash Back)
DELL lenovo hp
Range Starts from
₹ 24,990/-*
Upto ₹ 10,000* Cash Back + Extended Warranty Offers available*
FREE BAG + KEY BOARD MOUSE*
*Conditions Apply | *Selected Models | *Cash back on selected cards only
KALYANI ADS
OUR STORES
Our Customer Care ✆ 0863-2268838
GUNTUR : Opp. Incometax Office, Lakshmipuram ✆ 0863-2226463, Mahatma Gandhi Inner Ring Road, ✆ 9246655559, Chandana Brothers Complex, Jinna Tower, ✆ 0863-2226464, Haier Exclusive Showroom, Revenue Complex ✆ 0863-2345559, L.G. Best Shopee, ✆ 0863-2336464, Arundelpet, Main Road ✆ 0863-2217717, 27 VIJAYAWADA : Main Road, Poranki ✆ 0866-2499008, 2499009, Bhavanipuram, Swathi Theatre, Road, Sivalayam Center, ✆ 0866-2414193, 2414194, Eluru Road, Gunadala, VIJAYAWADA, ✆ 0866-2999922
MACHILIPATNAM : Opp. Raithu Bazar ✆ 9182053171, TIRUVURU : Ganesh Bomma Centre ✆ 8121437111, NUZIVIDU : Main Road, Near Municipal office, ✆ 7396476111 MANGALAGIRI : RR Towers, Near Old Bus Stand, ✆ 08645-233664
TENALI : Opp. Saibaba Temple Bose Road, ✆ 08644-226337, Gandhi Chowk, ✆ 08644-238827, 47 ONGOLE : Near Power Office, Prasanna Nilayam, Kurnool Road, ✆ 08592-282620, 282621, Old LIC Office Building, G.T. Road, Ramnager, ✆ 08592-282818
CHILAKALURIPET : Sai Karthik Citi Centre, G.T. Road, ✆ 9640755559, 9640855559 NARASARAOPET : Bank Street, Arundelpet, ✆ 08647-222559, 229559, PIDUGURALLA : Pillutla Road, ✆ 9182053174, AMARAVATHI : Main Road, Beside Church, ✆ 9182053161, PONNURU : G.B.C. Road, Beside Sajja Chandramouli Hospital, ✆ 7093335111 BAPATLA : College Road, Bapatla, ✆ 08643 - 220017 JAGGAYYAPETA : Kodhada Road, Jaggayyapeta, ✆ 9642559111, 7396476111